# సాంబ - శివ ప్రహసనం

మూలం

**చంద్రశేఖర కంబార్**

స్వేచ్ఛానువాదం

**మొదలి నాగభూషణ శర్మ**

# పాత్రలు

| | |
|---|---|
| సాంబ | శివ |
| వినాయకుడు | వార్తాహరుడు |
| పోలీసు | డింగ్ డాంగ్ |
| ఐరావతం | రాజు |
| ఆంతరంగిక మంత్రి | భాగ్యవంతుడు |
| చిల్లర | బైరయ్య |
| మంత్రి | గజనిమ్మ |
| గోదావరి | సేవకుడు |

# ప్రస్తావన

**దర్శకుడు:** అందరికీ నమస్కారం. ఇవాళ మీ కోసం ఓ గొప్ప హాస్యనాటకాన్ని ప్రదర్శిస్తున్నాం. అంటే ఒక ప్రహసనాన్ని. ఒక దర్జీ ఆయనకి మన బట్టల్ని కుట్టడానికి కొలతల కిస్తాం, చూడండి అట్లాగే మా నాటక రచయితగారికి మా మీ మనస్సుల కొలతల్నిచ్చి నాటకం రాయమన్నాం. ఇదే మన కోసం ప్రత్యేకంగా రాయబడిన నాటకం. మీ ఆనందం కోసం ఇందులో కావలసిన మసాలాలన్నీ వున్నాయి. ఇందులో – ప్రేమ వుంది, విప్లవం వుంది, రాజకీయాలున్నాయ్ – పాటలు, నృత్యాలు, ఓ చిన్నరకం సర్కస్ – ఇవన్నీ వున్నాయ్. మగవాళ్ళు, ఆడవాళ్ళు ఉన్నారు – సరే – కాని వాళ్ళూ వీళ్ళూ కాని వాళ్ళు కూడా వున్నారు. ఉద్యోగస్థులకి కొంచెం కోపం రావచ్చు. కాని వాళ్లకు లోలోపల సంతృప్తినిచ్చే బయటకి చెప్పని మజాలున్నాయి.

మీరు ఆశ్చర్యంతో గడ్డకట్టుకుపోయినా ఫరవాలేదు. మీకు ఈ రహస్యం చెప్పక తప్పదు: ఈ నాటకానికి నాయకుడు ఓ గాడిద. గాడిద మంత్రి అవుతాడు; మహారాజు గాడిద అవుతాడు. అధికారం అంధకారుల చేతుల్లోకి పోతే అమాయకులు విప్లవం లేవదీస్తారు.

మగవాళ్ళు ఆడవాళ్ళవుతారు; ఒక ఆడ గాడిదకు పెళ్ళి – వగైరా.....వగైరా....

ఇవ్వాళ రేపు నవ్వడం మరిచిపోయాం మనం. సహృదయులైన జనానికి కూడా నవ్వడం ఒక మహత్కార్యం అయి కూర్చుంది. ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోండి. మీరు ఒకప్పుడు ఎట్లా హాయిగా నవ్వేవాళ్ళో! మీ పూర్వీకులు? ఎంత స్వేచ్ఛగా మనసునిండా నవ్వేవాళ్ళు! మళ్ళీ మీరు కూడా అన్నీ మరిచిపోయి హాయిగా నవ్వి మమ్మల్ని సంతోషపెట్టండి.

మిమ్మల్ని నవ్వించడానికి మేం ఎక్కెడెక్కడినుంచో హాస్య ప్రసంగాల్ని, జోక్స్‌ని – ఇందులోకి లాక్కొచ్చాం. ఇది ఎటువంటి నాటకమో తెలుసా? ఒకళ్ళనొకళ్ళం చూసుకుని – అంటే – మమ్మల్ని చూసి మీరు, మిమ్మల్ని చూసి మేము అందరం నవ్వుకోవాలి.

## మొదటి రంగం

(నగరం వెలుపల వినాయకుడి గుడి. గర్భగుడిలో దేవుడు కనిపించడం లేదు. సాంబ-శివ- తండ్రీ కొడుకులిద్దరూ ఉన్నారు. వాళ్ళు పోట్లాడుకుంటున్నట్లు స్పష్టం అవుతుంది. సాంబడు మెల్లగా ఒక కల్లుసీసా బయటకు తీస్తాడు)

**శివ:** తాగుడు, ఆడవాళ్ళు! అవి వుంటే నీకేం అక్కర్లేదు. ఇది దేవుడి గుడి. కనీసం ఇక్కడైనా తాగకు.

**సాంబ:** దేవుడికి మాత్రం దాహం వెయ్యదాయేం? మరి మనుషులం, మనం దానికి అతీతులమా? (వ్యంగ్యంగా) నువ్వేగా "తాగుబోతూ, వ్యభిచారి" అంటూ నాకు బిరుదులిచ్చావ్! కనీసం నీమాట నిలబెట్టడానికయినా నేను అట్లా ఉండాలిగా, అబ్బాయ్?

**శివ:** నన్ను అబ్బాయ్ - అని పిలవకు. నువ్వు నా తండ్రివని చెప్పుకోకాని, నేను నీ కొడుకునని మాత్రం చెప్పుకోను..ఏ తండ్రీ కొడుకుకన్నా ముందు పెళ్ళి చేసుకోడానికి సిద్ధపడడు.

**సాంబ:** నేను కూడా అదేమాట అనొచ్చుగా! "మా నాన్న, పాపం! ఈ చలికాలంలో ఒణికిపోతున్నాడు; ఒంటరిగా వున్నాడు; ఆయనకో తోడు ఉంటే బావుణ్ణు" అని అనుకోని వాడివి నువ్వేం కొడుకుని? మీ అమ్మ పోయింతర్వాత ఒక్కసారన్నా అట్లా మాట్లాడానా? నోరు తెరిస్తే చాలు - నా పెళ్ళెప్పుడు? నా పెళ్ళెప్పుడు - అనే మాటే! పెళ్ళిచేసుకోవడానికి నీకు ఎన్ని ఏళ్లని? నీ వయసుకి నేను ఇంకా చడ్డీలు కూడా తొడుక్కునే వాణ్ణి కాదు. (తాగుతాడు)

**శివ:** ఈ మాటలన్నీ అనవసరం. నా పెళ్ళికి నువ్వు అడ్డం రావడం ఏమీ బాగులేదు.

**సాంబ:** అదెప్పుడు?

**శివ:** మొన్న శ్రీకాకుళం పెళ్ళి తప్పించిందెవరు? నువ్వు కాదూ?

**సాంబ:** నేనా! నాకేం పని? కొడుకు పెళ్ళి చేసుకుంటే తండ్రికి మాత్రం సంతోషంగా ఉండదూ? నాకు మాత్రం కోడలు పిల్ల ఇంటికి రావాలని లేదూ?

**శివ:** అయితే వాళ్ళు చివరికి ఎందుకు ఒప్పుకోలేదు?

**సాంబ:** నువ్వు ఒట్టి బడుద్దాయివని తెలిసుంటుంది?

**శివ:** వాళ్ళతో రహస్యంగా నువ్వేం చెప్పావో నాకు తెలియదనుకోకు.

**సాంబ:** రహస్యంగానా? ఏం చెప్పానంటావ్?

**శివ:** మా పిల్లవాడికి ఇంత చిన్నతనంలో పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చెయ్యండి - అని చెప్పలేదూ నువ్వు?

**సాంబ:** చెప్పాను. నిజమే! కాని ఎప్పుడు? వాళ్ళు నిన్ను కాదు, పొమ్మన్న తర్వాత. మీ అమ్మకు తెలుసు నేనెంత నిఖార్సయిన మనిషినో! ఇవ్వాళ అది బతికుంటే ఏమనేదో తెలుసా? "మీ నాన్న నిజం చెబుతున్నాడు. ఆయన్ని నమ్ము." అనేది.

**శివ:** నువ్వు ఎక్కువ అబద్ధాలు అమ్మకే చెప్పేవాడివి. నీ బయటి సరసాలు అమ్మకి తెలియవా యేం?

**సాంబ:** నాలుగో అయిదో - నీ వయసుకు అవేం ఎక్కువా?

**శివ:** నీ అబద్ధాలే అమ్మ ప్రాణాలు తీసాయి.

**సాంబ:** పెళ్లి అయిన తరువాత నువ్వూ అంతేనోయ్....ఏ పెళ్ళానికయినా నూటికి నూరుసార్లు నిజం చెబితే ఇంకే మన్నా వుందా? నిజం చెబుతున్నట్టుగా ఉండాలి, అబద్ధాలు అందంగా చెప్పాలి...జ్ఞాపకం ఉంచుకో.

**శివ:** నాతో కూడా అబద్ధాలేగా? నాకోసం అమ్మాయిల్ని చూస్తున్నావు. కాని నిజానికి వాళ్ళని ఎగరేసుకు పోవాలని చూస్తున్నావ్? ఏం తండ్రివి నువ్వు?

**సాంబ:** సరే! అదే నిజం అనుకో! పోనీ ఇప్పుడయినా – "నీ పెళ్ళి అయిన తర్వాత నేను చేసుకుంటాను నాన్న" అనవేం?

**శివ:** నీకిదివరకొకసారి పెళ్ళి అయిందిగద?

**సాంబ:** కాని ఆవిడ పోయింది కద? లేకపోతే నేను అడిగేవాడినా?

**శివ:** నాకొక్కసారి కూడా కాలేదు గదా?

**సాంబ:** ఆ తరువాత నువ్వు నాలుగుసార్లు చేసుకో, నేను వద్దనడం లేదే! ముందు తండ్రికి పెళ్ళి చెయ్యి...రాత్రి మీ అమ్మ కలలో కనిపించింది కూడా!

**శివ:** అన్నీ అబద్ధాలు

**సాంబ:** నిజంగా "నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకో. చేసుకోకపోతే నా మీద ఒట్టు" అన్నది మీ అమ్మ.

**శివ:** (నవ్వుతూ) భేష్.....బావుంది.

**సాంబ:** వెధవా! నవ్వుతున్నావా? బతికుండగానే నేను, మీ అమ్మ ఎంతగా ప్రేమించుకున్నామో తెలుసా?

**శివ:** తెలియకేం? పొద్దున్నే ఒకళ్ళ మొహం ఒకళ్ళు చేసుకున్న దగ్గర్నుంచీ కీచులాడుకోవడమేనా?

**సాంబ:** అది బతికుంటే ఇప్పుడూ కీచులాడుకునే వాళ్ళమే! కాని – మేం కలలో పోట్లాడుకోలేదు. నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని దానికి నేను ప్రమాణం చేశాను. అప్పుడు కాని అది వెళ్ళిపోలా....లేకపోతే నీ కలలో నుంచి నేను వెళ్లను అని హఠం వేసింది...అర్థమయిందా?

**శివ:** అరె! అమ్మ రాత్రి నా కలలో కూడా కనిపించింది. మీ నాన్న మళ్లీ పెళ్ళి చేసుకుంటానంటాడు. చేసుకోనివ్వకు – అంది. అంతేకాదు...మీ నాన్న నోటంటే వచ్చేవన్ని అబద్ధాలే నంది.

**సాంబ:** అబద్ధాల నాయారా! అది ఇద్దరి కలల్లోకి ఎట్లా వస్తుందిరా?

**శివ:** అంటే అమ్మ నీ కలలోకి రాలేదు అన్నమాట.

**సాంబ:** లం....మాటకి మాట రెట్టిస్తావేమిటి? నువ్వు నా కొడుకువే కాదు, ఫో.

**శివ:** అబద్ధా కోరువి. నువ్వు నాకు నాన్నవే కాదు, ఫో.

**సాంబ:** ఓ!

**శివ:** ఓ!

(కొంతసేపు ఇద్దరూ మౌనంగా ఉండి పోతారు)

**శివ:** నాన్నా!

**సాంబ:** నాతో మాట్లాడకు – ఖబడ్దార్.....

**శివ:** బయట బాగా చలిగా వుంది....కొంచెం కల్లుతాగు....

**సాంబ:** ఏమన్నావ్? మళ్ళీచెప్పు?

**శివ:** బయట చలిగా వుంది...కొంచెం కల్లు తాగు – అన్నాను.

**సాంబ:** అదీ నా కొడుకంటే! అదే నోటితో నువ్వు పెళ్ళి చేసుకో – అని కూడా అనేసెయ్...

**శివ:** అయితే ఒక పనిచేద్దాం – ఇద్దరం ఒకే రోజు చేసుకుంటే?

**సాంబ:** కొంపదీసి ఒకే పిల్లనా?

**శివ:** కాదు, కాదు....

**సాంబ:** అట్లా అన్నావు, బాగుంది.

**శివ:** అయితే, నేనొక అమ్మాయిని చూశాను...నువ్వు నాకు సాయం చెయ్యాలి. అట్లాగే నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పు, నేనూ సాయం చేస్తాను...పరస్పర సహకార సంఘం. ఏమంటావ్?

**సాంబ:** సరే! నన్నేం చెయ్యమంటావు?

**శివ:** నువ్వు చీరె కట్టుకోవాలి.

**సాంబ:** ఏమిటీ!

**శివ:** చెప్పానుగా, వాళ్ళింట్లో ఒక పనిమనిషి కావాలి.

**సాంబ:** అయితే – ?

**శివ:** నీ కొడుక్కి సహాయం చెయ్యాలని నీకుంటే, నువ్వొక చీరె కట్టుకుని పని మనిషిగా ఆ ఇంట్లో చేరు... నిన్ను చూసే నెపంతో నేను ఆ ఇంటికి రావచ్చు...ఆ తరువాత నీకెవరన్నా ఇష్టమయితే నేనూ సాయం చేస్తాను.

**సాంబ:** బ్రహ్మాండంగా ఉంది..నేను ఒప్పుకోకపోతేనో?

**శివ:** నేను చచ్చిపోతాను.

సాంబ: అయితే నువ్వు చావడమే మంచిది.

**శివ:** నిజంగా! నా ఖర్మకాలి నా బాధలన్నీ నీతో చెప్పుకోవలసి వచ్చింది. ఇక ఛస్తే ఈ విషయం మాట్లాడను.

**సాంబ:** మరీ మంచిది. కాని నేను మాట్లాడతాను. "ఒరే వెధవా! నీకంటె ముందు పుట్టాను. ముందు నన్ను పెళ్ళి చేసుకోనీ. అప్పుడు నీకో అమ్మ వస్తుంది. రెండు పూటలా భోజనం ఉంటుంది. నీ పెళ్ళానికో అత్తగారుంటుంది.

**శివ:** (పళ్ళు కొరుకుతూ) ఇహ నోరుమూసుకో! నాకు చచ్చే కోపంగా ఉంది. ఒళ్ళు మండుతోంది.

**సాంబ:** ఒళ్ళు మండితే బావిలో పడమన్నాడు, వెనకటికి. ఆ మాటకొస్తే నాకు కోపంగానే వుంది. నేనూ మాట్లాడను...ఒకవేళ మాట్లాడాల్సి వస్తే – మాటలు కాదు; పాటల్తో సమాధానం చెబుతాను:

పెళ్ళికాదు; భార్య రాదు
ఏ విధినే బతికేది?
తనయుడు వినడు; దారే లేదు
ఏ విధినే బతికేది?
ఏ విధినే బతికేది?

ఇట్లా పాటలు పాడతాను.

**శివ:** అంతే! అంతే! నేనొక అనాథని! నీకు పాటలూ, నాటకాలు! నా సంగతి పట్టదు. నేను తింటున్నానో,

లేదో; నిద్ర పోతున్నానో లేదో ఎవ్వరికీ అక్కర్లేదు. నేను బతకడమెందుకు? ఆ లోపలికి పోయి ఉరిపోసుకు చచ్చిపోతాను. అప్పుడు నువ్వు హాయిగా బతకొచ్చు.

**సాంబ:** సరే!

**శివ:** నువ్వు చచ్చిగీపెట్టినా తలుపు తియ్యను.

**సాంబ:** ఎట్లా వస్తావు? ఉరేసుకు చచ్చిపోయుంటావు కదా?

**శివ:** తరువాత విచారిస్తావ్!

**సాంబ:** ఇప్పుడు విచారించకుండా ఉంటే కదా!

**శివ:** ఈ వెధవ గుళ్ళో దేవుడు కూడా లేదు నా బాధలు చెప్పుకోవడానికి.

(గర్భగుళ్ళోకి వెళ్ళి దభాలున తలుపు వేసుకుంటాడు)

**సాంబ:** భలే కొడుకు! ఉరిపోసుకుని ఛస్తాట్ట! అదీ చూద్దాం – ఈ నగరానికి అమ్మాయిల్ని వెతికి పెళ్ళిచేసుకుందామని వచ్చాం. చుట్ట పక్కాలెవ్వరూ లేరు. ఇది జరిగే పని కాదు, వెళ్లిపోదాం – అనుకుంటూ వుండగా వీడొక అమ్మాయిని చూశాడు – ఓ సందులో ఓ యిల్లు.....ఆ ఇంట్లో ఓ అమ్మాయి..మేడ మీద నిలబడి తల చిక్కు తీసుకుంటోందట...వీడా సందులో నిలబడి ఆ అమ్మాయి వంక నోరు తెరుచుకుని అట్లా చూస్తూ ఉండిపోయాట్ట! ఆ అమ్మాయి నవ్విందట! ఎవరిని చూసి నవ్విందో? వీడు కూడా నవ్వాడుట!...నేనూ నవ్వుతాను ఎవరన్నా అమ్మాయి నన్ను చూసి నవ్వితే... సరే! అది వేరే కథ..ఆ క్షణం నుంచి వీడికి ఆ అమ్మాయి జ్వరం పట్టుకుంది. నిట్టూర్పులు, కలలు కనడాలు, తనలో తను మాట్లాడుకోవడాలు, నవ్వడాలు, సిగ్గుపడటాలూ.....ఒకటా?

వీడిని ముందు పెట్టుకుని ఎట్లా అయినా ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని నా ఎత్తు. కాని నా ఎత్తులేం పారడం లేదు. వీడేమో నాకొక్కడే కొడుకు. మేం ఒకళ్ళకొకళ్ళం సాయం చేసుకోవాల్సిందే! కాని వాడు –"నేను ముందు పెళ్లిచేసుకుంటాను" అని మొండి పట్టు పట్టుక్కూర్చున్నాడు.

సరే! అట్లాగే కానిద్దాం.....పూర్వకాలంలో ఇట్లా ఉండేదా? భీష్ముణ్ణి చూడండి. పెళ్ళి చేసుకోమని వాళ్ళ నాన్న అడిగినా ససేమిరా అన్నాడు. పైగా "లేదు నాన్నగారూ! మీరు పెళ్ళి చేసుకోండి. నేను జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోతాను" అన్నాడు.

అటువంటి కొడుకులేరీ ఇప్పుడు?

(పడుకుంటాడు. వినాయకుడు వస్తాడు. ఆయనతో పాటు ఓ గాడిద)

**వినా:** భక్తులూ లేరు, పూజలూ లేవు...కనీసం మా అమ్మా, నాన్న దగ్గరికి వెళ్ళి హాయిగా వుండడానికి వీలులేదు. ఈ వెధవ గాడిద ఒకటి. నేనెక్కడికి వెడితే అక్కడికి తయారు. నేను ఒక్క నిమిషం కనిపించకపోతే ఒకటే ఓండ్రపెట్టడం. నేను దీన్ని ఇచ్చేస్తానన్న తీసుకునే ధర్మాత్ముడెవరు? మా నాన్న సాంబశివుడే నన్ను కాపాడాలి. (తలుపు వేసి వుండడం చూసి) ఈ లోపలెవరో ఉన్నట్టున్నారే! (తలుపు తడుతూ) ఎవరయ్యా లోపల? తలుపు తియ్యండి...

(సాంబడు లేచి, వినాయకుణ్ణి చూస్తాడు)

**సాంబ:** నమస్కారాలు.

**వినా:** లోపలున్నదెవరు?

**సాంబ:** అయ్యా! మీరు వేసుకున్న వేషం బహు అందంగా వుంది.

**వినా:** వేషం ఏమిటి?......నువ్వెడివి?

**సాంబ:** కాస్త గౌరవంగా మాట్లాడండి...నేనసలే మంచివాణ్ణి కాదు.

**వినా:** తమాషాగా వుందే! జనం అంతా నా ముందు సాష్టాంగపడి వరాలు కోరుకుంటారు...వీడు ఏకంగా నా మీదనే అరుస్తున్నాడే! సరే! (సాంబడితో) నాయనా! నువ్వు చాలా మంచివాడివి –

**సాంబ:** మరీ అంత గౌరవం ఒద్దులెండి.

**వినా:** అంత సిగ్గుపడిపోకు. నిన్ను ఊరికే మంచివాడివి అన్నాను – అంతే.

**సాంబ:** నా పేరు సాంబయ్య. అట్లా పిలవండి, చాలు.

**వినా:** అట్లాగా! చూడు సాంబయ్యా! లోపలెవరున్నారు?

**సాంబ:** నా కొడుకు – శివ. మంచివాడే......కాని ఈ మధ్య కొన్నాళ్ళ నుంచీ – మీరు నాటకాల్లో అంటూ వుంటారే – ప్రేమో..దోమో అని. ఆ జబ్బు వచ్చి పడ్డది. వాడు కావాలలనుకున్న అమ్మాయి దొరకలేదు. అందుకని లోపల తలుపులు బిడాయించుకుని ఉరిపోసుకు ఛస్తాట్ట.

**వినా:** చావడానికి నా గుడే దొరికిందా? బయటకి రమ్మను.

**సాంబ:** అట్లాగే పిలుస్తాను కాని, మీ వేషం తీసెయ్యండి.

**వినా:** చూడు. నేను వేషం వేసుకున్న వినాయకుణ్ణి కాదయ్యా! నిజమైన వినాయకుణ్ణి. ఇది నా గుడి. ఆ గట్టు మీద కూర్చుని విసుగు పుట్టి అట్లా గాలికి తిరిగొద్దామని వెళ్లాను. అంతే! మీ వాణ్ణి తలుపు తియ్యమను.

**సాంబ:** (తనలో) ఓ! నాటకాల కంపెనీ వాడు కాదన్నమాట! అయితే పిచ్చాసుపత్రి నుంచి తప్పించుకొని వచ్చి వుండాలా. (బయటకి) ప్రభూ! మీరు విఘ్న వినాయకులు కదా! మిమ్మల్ని ప్రార్థిస్తాను. నాకో వరం దయ చేయిస్తారా?

**వినా:** ఇప్పుడు పాడడం, ప్రార్థించడం అవన్నీ మొదలు పెట్టకు.

**సాంబ:** అట్లా అనకండి. స్వామీ! పాటలతో ప్రార్థించడం మన ఆనవాయితీ! పాడితే మాత్రం పోయిందేముంది? ఒక పాటే గదా? ఇదుగో, కాచుకోండి.

వందనమయ్యా ఓ పార్వతీతనయా
నీకు దండాలు పెడతామూ ఓ పార్వతీతనయా
విఘ్నాలు తొలిగించు ఓ పార్వతీతనయా
నీకు ఉండ్రాళ్లనిస్తాము ఓ పార్వతీతనయా
మా తప్పులను నేయవయ్యా ఓ పార్వతీతనయా
మము రక్షించే దేవుడవు నీవేనయ్యా ఓ పార్వతీతనయా
వెన్నకూ సున్నానికి తేడా తెలుపు
గాడిదకు గుర్రానికి తేడా తెలుపు
ఆ మాత్రం బుద్ధినివ్వు అంతేచాలు

మా తప్పుల్ని సైరించే చూపే చాలు

అమ్మయ్య! పాట అయిపోయింది....ఒక్క వరాన్ని ఇట్లా పారెయ్యండి.

**వినా:** నా దగ్గర ఏముంది ఇవ్వడానికి? నేనే బీదవాణ్ణి..భక్తులు ఎవ్వరూ రాని గుళ్ళో ఉంటున్న దేవుడు ఏమివ్వగలడు?

**సాంబ:** పాడేటప్పుడంతా మాట్లాడకుండా ఊరుకుని, ఇప్పుడేమీ లేదంటావా? కనీసం ఏదన్నా మాజిక్కన్నా చూపించు...

**వినా:** ఏమిటది? మాజిక్కా?

**సాంబ:** (తనలో) మా వాడు నేను ఆడమనిషిగా మారాలన్నాడు కదూ? (బిగ్గరగా) అవును. నన్నో ఆడమనిషిని చెయ్యండి.

**వినా:** ఏమిటీ? ఆడమనిషినా?

**సాంబ:** అవును...నువ్వు దేవుడివేగా? చూద్దాం, నువ్వు చెయ్యగలవో లేదో?

**వినా:** శాశ్వతంగా ఆడదానివి కావాలని వుందా, తాత్కాలికంగానా?

**సాంబ:** నువ్వేం చెయ్యగలవో అదే చెయ్యి..

**వినా:** అయితే సరే!....ఈ ముత్యాన్ని చూశావా? దీన్ని నోట్లో పెట్టుకో. (దానిని సాంబడికిస్తాడు. సాంబడు దాన్ని నోట్లో పెట్టుకోబోతాడు) ఇక్కడ కాదు, ఇక్కడ కాదు....అట్లా ఇందాక నువ్వు పడుకున్నావే, ఆ మూలకు పోయి ఆ ముత్యాన్ని నోట్లో పెట్టుకో –

(సాంబడు పక్కకు పోయి, వెంటనే ఆడమనిషిగా మారాడు, పరిగెత్తుకుంటూ వస్తాడు)

**సాంబ:** స్వామీ! విఘ్నేశ్వరా! క్షమించు..నిన్ను నిజమైన వినాయకుడనుకోలేదు. నన్ను క్షమించు. తండ్రీ! నన్ను మళ్ళీ మగవాణ్ణి చెయ్యి...నీకు ఇప్పుడు నిజంగా మొక్కుకుంటాను.

**వినా:** అక్కర్లేదు, అక్కర్లేదు...మళ్ళీ అక్కడికి పోయి, నీ నోట్లోని ముత్యాన్ని బయటకు తియ్యి.

**సాంబ:** (అట్లా చేసి) ధన్యోస్మి, స్వామీ!

**వినా:** ఇహ ఇప్పటికైనా గుడి తలుపులు తీయిస్తావా?

**సాంబ:** ఓ! మరిచిపోయాను. (తలుపులు తడుతూ) శివా! తలుపు తియ్యి...వినాయకుడే స్వయంగా వచ్చాడు. తలుపు తియ్యి...దేవుడే వచ్చాడు..

**శివ:** (లోపలినుంచి) దేవుడా? కోతలు కొయ్యకు.

**సాంబ:** నిజంగా దేవుడేరా! వినాయకుడు, గణేశుడు, విఘ్నరాజు...

**శివ:** వినాయకుడైతే నాకో వరం ఇవ్వమను.

**సాంబ:** అయితే తలుపు తీసి వరం కోరుకో –

**శివ:** అమ్మో! నేనేం తియ్యను. ముందాయనని వరం ఇవ్వమను. అప్పుడే తలుపు తీస్తాను.

**వినా:** బలే భక్తుడే! ఒట్టి జింటాన్‌లాగా వున్నాడే! ఏయ్! ఎవరోయ్ నువ్వు? బయటికి వస్తావా, పోలీసుల్ని పిలవమంటావా?

**సాంబ:** స్వామీ! భక్తుడిమీద కోపం ఎందుకు? ఒక వరం పారెయ్యరాదూ?

**వినా:** నా దగ్గర ఏమీ లేందే? కావాలంటే అతణ్ణి దీవిస్తాను.

**సాంబ:** శివా! స్వామి దీవిస్తారు. తలుపు తెరు.

**శివ:** ఒట్టొట్టి దీవలను ఎవరైనా ఇస్తారు. నాకు వరం ఇస్తేనే తలుపు తెరుస్తాను.

**వినా:** ఏం చిక్కొచ్చి పడ్డదిరా? నాకున్న దల్లా ఈ గాడిద ఒక్కటే. దానిని తీసుకో.

**శివ:** దాన్నేంచేసుకోను. ఎక్కి ఊరేగనా?

**వినా:** అది మామూలు గాడిద అనుకోకు. దాని పేరు డింగ్‌డాంగ్. దానికీ రూపం ఎట్టా వచ్చిందో తెలుసా? ఒక చిత్రకారుడుండేవాడు. ఇక్కడే గుళ్ళో ఉండేవాడు. నాక్కూడా ఆ లోపల కూర్చుని కూర్చుని విసుగు పుట్టేది. అతనితో స్నేహం చేశాను. ఎవరి బొమ్మనయినా సరే అతని వెంట్రుక చూసి గియ్యగలనని ప్రగల్భాలు పలికేవాడు. ఏ మాత్రం ఘటికుడో చూడాలనిపించింది. ఈ నగరం రాజుగారి వెంట్రుక తెచ్చి ఆ రాజు బొమ్మని గియ్యమన్నాను. గీశాడు. అదే గాడిద బొమ్మ. ఇద్దరం నవ్వుకున్నాం. నవ్వుతూనే ఆ గాడిదకు ప్రాణ ప్రతిష్ట చేశాను. ఆ గాడిదే ఈ గాడిద.

**సాంబ:** బలే బావుందే!

**వినా:** మీరు చెప్పినట్లుగా చేస్తుంది. ఒక సర్కస్ కంపెనీ పెట్టుకోవచ్చు దీనితో. అంతేకాదు....ఈ గాడిదకి రాజయోగం ఉంది.

**సాంబ:** శివా! ఈయన గాడిదని వరంగా ఇస్తామంటున్నారు. బయటకు రా.

(శివ బయటకు వస్తాడు. వినాయకుణ్ణి చూస్తాడు. సాష్టాంగ పడడానికి వస్తూ వుండగానే వినాయుడు తప్పించుకుని లోపలకు పోయి తలుపు వేసుకుంటాడు)

**వినా:** చూడు! నాకున్న దల్లా ఈ గాడిద ఒక్కటే. దానిని ఇస్తున్నాను. తీసుకుని వెళ్లు.

**శివ:** మొత్తానికి దేవుడివే! మరి నన్ను దీవిస్తానన్నావు!

**వినా:** (తలుపు తెరిచి) అదీ ఇచ్చేశాను....ఇహ వెళ్ళిరండి.

**శివ:** ఏమని దీవించారు?

**వినా:** నీకేం కావాలి?

**శివ:** నేను కోరుకున్న అమ్మాయి నాకు దక్కాలి.

**వినా:** ఆ అమ్మాయి నీకు దక్కడానికి కూడా ఆ గాడిద సహాయం చేస్తుంది ఇహ వెళ్ళు.

**సాంబ:** స్వామీ! ఆ ముత్యం నాకివ్వగూడదూ? నువ్వు ఆ జన్మ బ్రహ్మచారివి గదా! అది నీకెందుకు?

**వినా:** అది నాది కాదు.

**సాంబ:** ఒకటి రెండు రోజులు కోసమే! మళ్ళీ తిరిగి ఇచ్చేస్తాను.

**వినా:** ఆడిన మాట తప్పవు కదా!

**సాంబ:** అమ్మో! దేవుణ్ణి మోసం చెయ్యడమే!

**వినా:** మీ మనుషులు నిత్యమూ చేసేది అదే కదా! సరే తీసుకో! కాని నాకు కావాలనుకున్నప్పుడు మళ్ళీ ఇచ్చెయ్యాలి.

(వినాయకుడు ఆ ముత్యాన్ని ఇచ్చి, తలుపు వెయ్యబోతాడు)

**సాంబ:** ఒక్క నిమిషం స్వామీ!

**వినా:** మళ్ళీ ఏమిటి?

**సాంబ:** ఏమీ లేదు. మా ఈ గాడిద నాటక ప్రదర్శన బ్రహ్మాండంగా జరిగేటట్టు దీవించు.

**వినా:** తథాస్తు.

## రెండో రంగం

(రాజ ప్రాసాదం......రాజుగారు, రక్షక భటుడు)

**రాజు:** నగర రక్షణ ఎలా వుంది?

**ర.భ:** అంతా సవ్యంగానే ఉంది ప్రభూ!

**రాజు:** ఎక్కడైనా విప్లవాలు, తిరుగుబాట్లు –

**ర.భ:** ఏమీలేదు ప్రభూ! తిరుగుబాటు దారులందరినీ కారాగారంలో వేసేశాం.

**రాజు:** అయితే ఆంతరంగిక మంత్రి గారిని రమ్మను....నేను రహస్యంగా ఆయనతో మాట్లాడాలి....నువ్వు బయట వుండు.

**ర.భ:** ఆజ్ఞ ప్రభూ!

(అతను వెడతాడు.....ఆంతరంగిక మంత్రి వస్తాడు)

**రాజు:** ఏం, ఆంతరంగిక మంత్రిగారూ? ఆమె కనిపించిందా?

**మంత్రి:** నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను మహారాజా!

**రాజు:** ఎంతకాలం? శివపురం మహారాజులుంగారు తాను ముచ్చటపడ్డ ఒక అమ్మాయిని తెచ్చుకోలేక పోయాడని ప్రజలకు తెలిస్తే మాకెంత నగుబాటు?...నగరంలో ప్రతి ఇల్లు సోదా చేయించావా?

**మంత్రి:** చిత్తం మహారాజా!

**రాజు:** అమ్మాయిలే కనిపించలేదా?

**మంత్రి:** అమ్మాయిలు కనిపించకే మహారాజా? నీలం చీరె, పచ్చరవికెతో ఉన్నవాళ్ళు దొరకలేదు. కాని త్వరలోనే ఆమెను కనుక్కుంటాను. ఈ మధ్యే దాని విషయం ఆరా తీసాను. ఆమె ఒక వ్యాపారి కూతురు.

**రాజు:** నీలంచీరె, పచ్చ రవికె...జ్ఞాపకం ఉంచుకో......అది మాత్రం మరిచిపోకు. ఓ! ఏం అందం! ...మంత్రీ! ఊహించు...ఓ నందనవనం.....ఊహించు......

**ర.భ:** (వచ్చి, నమస్కారం చేసి) ముఖ్య పౌరుల బృందం ఒకటి ప్రభువుల్ని కలవడానికి వచ్చింది మహారాజా!

**రాజు:** చాలా ముఖ్యమైన ఆంతరంగిక విషయాలు మాట్లాడుతున్నామని చెప్పలేదా?

**ర.భ:** చెప్పాను, ప్రభూ! కాని మిమ్మల్ని చూడక తప్పదంటున్నారు.

**రాజు:** ఎందుకు?

**ర.భ:** వాళ్ళిచ్చిన వినతి పత్రం ఇదుగో ప్రభూ!

**రాజు:** ఏముందో చెప్పు.......సంక్షిప్తంగా.....టూకీగా –

**ర.భ:** (చదువుతూ) అయ్యా! మా బ్రతుకులు బండలవుతున్నాయి. కూర్చుంటే పన్ను, నిలబడితే పన్ను, మొహం కడుక్కుంటే పన్ను, బట్టలు వేసుకుంటే పన్ను...ఎ పన్ను, బి పన్ను, సి పన్ను....టూకీగా చెప్పాలంటే – ఆ పన్నుల భారంలో ప్రజలు అల్లాడిపోతున్నారు.

**రాజు:** అర్థమయింది...ఇంకా అక్కడే ఎందుకు నిలబడ్డావ్? ఈ సారి మా ఆంతరంగిక చర్చలకి అడ్డం వచ్చావా, బతికుండగానే నిప్పుల్లో తోయిస్తాను.

(ర.భ. గాభరాగా వెళ్ళిపోతాడు)

వెధవ ప్రజలు...మంచి రసపట్టులో చికాకు పెడతారు...ఆ! ఏం చెబుతున్నాను?

**మంత్రి:** ఒక అందమైన వనం....

**రాజు:** ఆ! అదీ! ఓ వనం....ఓ నందనవనం లాంటి అందమైన వనం.....పక్షులు, చెట్లు, చేమలు కలకలారావం..ఎక్కడో ఓ కోకిల దుమ్ములేపుతూ ఉంటుంది. బియ్యప్పిండిని తూర్పార పడుతున్నట్టు వెన్నెల విరజిమ్ముతోంది! అప్పుడు ఆ సుకుమారి, ఆ నవమోహనాకారి, నీలం చీరె, పచ్చ రవికెతో.. ఆ వనంలోకి ప్రవేశిస్తుంది. ఆడుతూ, పాడుతూ; తక్కుతూ, తారుతూ....మేళతాళాలతో..ఆవిడ వచ్చిందా?

**మంత్రి:** చిత్తం మహారాజా! ఒక చిన్న అనుమానం ప్రభూ! ఆ వనంలో నాకూ ప్రవేశం ఉందా మహారాజా?

**రాజు:** ఉంది, ఉంది. నీ సహాయం లేకుండా నేను ప్రేమించడం ఎట్లా? కాని నువ్వు చడీ చప్పుడు లేకుండా రావాలి. లేకపోతే అక్కడ పచ్చగడ్డి మేస్తున్న హంస పారిపోవచ్చు.

**మంత్రి:** హంస పచ్చగడ్డి తినడమేమిటి ప్రభూ? అది పక్షి కదా?

**రాజు:** కాదు అది జంతువు. దాన్ని పక్షి అన్నావంటే నీ నాలిక పీకేస్తాను.

**మంత్రి:** తమరు అన్నారంటే అది జంతువే అయివుండాలి ప్రభూ! దానికి నాలుగు కాళ్ళు, ఒక తోక, గుర్రం మొహం లాంటి మొహం, చిన్న చెవులు.....

**రాజు:** ఆ......అది ఆకాశం వంకకి మోరసాచి, ఓండ్ర పెడుతుంది. అటువంటివి మన పశువులశాలల్లో చాలా వున్నాయి. అది మన జాతీయ జంతువు.

**మంత్రి:** మీ మాటలు వింటుంటే దానికీ గాడిదకీ చుట్టరికం ఉన్నట్టుగా వుంది.

**రాజు:** దాన్ని గురించి ఓ కథ వుంది. గాడిద కూడా మనిషిలాంటిదే! చికాకు పెడితే ఓండ్ర పెడుతుంది. అదంటే నాకింకా మంచి వుద్దేశం కలగడం లేదు, ఎందుకో తెలుసా? దగ్గర కెడితే తంతుంది. ఒక్క రాజులకి మాత్రమే తన్నే అధికారం ఉండాలన్నది మా మతం. ఏమంటావ్?

**మంత్రి:** బాగా చెప్పారు.

**రాజు:** ఈ విప్లవ కారులున్నారే, తమకీ తన్నే హక్కు కావాలంటారు.

**మంత్రి:** అమ్మో! అది నేరం కాదూ?

**రాజు:** చూశావా! నువ్వు వనం సంగతే మరిచిపోయావు..పాపం ఆ అమ్మాయిని ఇందాకటినుంచి అక్కడే నిలబెట్టావు...ఆ తరువాత ఏం అవుతుంది?

**మంత్రి:** ఆ!.....ఆ అమ్మాయి అక్కడ ఉందని అనుకుందాం మహారాజా! మీరు ఇక్కడ ఉన్నారు...నేను ఆ అమ్మాయి పక్కనే ఉన్నాను.

**రాజు:** ఆ అమ్మాయి పక్కన నువ్వు ఎట్లా ఉంటావు? నేను ఉండాలి..నువ్వు ఇక్కడ వుండు..

**మంత్రి:** ఒట్టిగా ఊహలోనే ప్రభూ!

**రాజు:** అయినాసరే, నేను ఏమనుకుంటున్నానో, నువ్వూ అదే అనుకోవాలి.

**మంత్రి:** నేను ఆ అమ్మాయిని అప్పుడే వెంట బెట్టకువచ్చానన్నమాట! అందువల్ల లోపలికి వచ్చినప్పుడు నా పక్కనే ఉంది. ఇప్పుడు మీ దగ్గరికి ఇంకా దగ్గరికి వస్తుంది.......

**రాజు:** అట్లాగా!...అయితే సరే!

**మంత్రి:** మీరిక్కడే ఉన్నారు.....ఆ అమ్మాయి మీ దగ్గరకు వచ్చింది....మీరెట్టా నిలబడతారో చెప్పండి.

**రాజు:** ఇట్లాగా?

**మంత్రి:** ఇంకొంచెం ఠీవిగా?

**రాజు:** ఇప్పుడు?

**మంత్రి:** బావుంది..నేనే ఆ అమ్మాయిననుకోండి...నేను వచ్చాను..అప్పుడు మీరేం చేస్తారు?

**రాజు:** ఏం చెయ్యాలి?

**మంత్రి:** ఆ అమ్మాయి మీదికి వయ్యారంగా వంగి, ఫ్చ్ఫ్చ్ఫ్చ్.......

(దీర్ఘంగా ముద్దు పెట్టుకున్నట్లు పొడిగిస్తాడు)

**రాజు:** (వంగి) ఫ్చ్ఫ్చ్ఫ్చ్....

**మంత్రి:** అట్లాకాదు మహారాజా! ఆ అమ్మాయి మీ దగ్గరకు రాగానే మందహాసంతో 'ప్రియా' అనాలి....అక్కడ నుంచే ఓ ముద్దు విసిరెయ్యాలి......(చూపుతూ) ఇప్పుడు మీరు చెయ్యండి.

**రాజు:** ప్రియా –

**మంత్రి:** అట్లా కాదు ప్రభూ! మీరు ముద్దును ఎంత హుందాగా ప్రేమగా విసిరెయ్యాలంటే, ఆమె తన హృదయాన్ని కూడా అంత హుందాగా మీ మీదకు విసరాలి.....అంత ఠీవిగా ఉండాలి మీరు.

**రాజు:** తుడిచేసిన పాతగుడ్డలా ఉన్న నీ మొహం చూస్తూ ప్రేమపాఠాలు చెప్పడం ఎలా?

**మంత్రి:** సరే! మీ పద్ధతిలోనే కానివ్వండి.

**రాజు:** ప్రియా.....

**మంత్రి:** ఇప్పుడు మీరు మోకాళ్ళమీద కూర్చుని, ఒక చెయ్యి చాసి, మరో చేతిని గుండెల మీద పెట్టుకుని ఆ మాట చెప్పాలి.....నేనే ఆ అమ్మాయిలా నటిస్తాను...(సిగ్గుతో నిలబడతాడు)

**రాజు:** ప్రేమసీ! నాకు సిగ్గుగా ఉంది.

**మంత్రి:** సిగ్గు మీకు కాదు మహారాజా! ఆ అమ్మాయికుండాలి.

**రాజు:** అయితే నువ్వే చూపించు ఏం చెయ్యాలో, ఏమనాలో

**మంత్రి:** మీరే ఆ అమ్మాయి అనుకోండి...నేను మీరనుకోండి..నేను మీ ముందు ఇలా మోకాళ్ళ మీద కూర్చుని

ప్రేయసీ! నేరుగా నీకో విషయం చెప్పాలి...నా ఆత్మ క్షభిస్తోంది.

ఆత్మ శరీరంలో ఉంటుంది. శరీరం ద్వారా మనం జీవిస్తాం....

జీవితంలో జీవిస్తాం...కాని గొప్పవాళ్ళు – మహాత్ములు ఏమన్నారో తెలుసా?

జీవితం ప్రపంచంకన్న పెద్దదనో చిన్నదనో అన్నారు...

నేను? జీవితం మన కన్న గొప్పదంటాను. ఎందుకు? అందులో

ప్రేమ వుంది కనుక. లాలిత్యం ఉంది కనుక....నీ ప్రేమవలలో నేను చిక్కుకుపోయాను...

ఎట్లా వుంది మహారాజా?

**రాజు:** ఏడిసినట్టుంది.....అందులో ఒక రీతి, రివాజు లేదు, లయ లేదు; కళాత్మక హృదయం లేదు...మన పెద్దవాళ్ళేమన్నారు..జీవితమన్నాక కుసింత కళాపోసన వుండాలన్నారు...నువ్వింత మరీ నేలబారు మనిషివని నాకింత వరకు తెలియదు..మీ యిద్దరి సంభాషణ ఎట్లా ఉండాలో విను...

నేను: ప్రేయసీ!

ఆమె: ప్రియా!

నేను: ప్రేయసీ! నా హృదయ సింహాసనం మీద తిష్టవేసుక్కూర్చున్నావు....చచ్చినా నిన్ను దాని మీద నుంచి దిగనివ్వను..

ఆమె: ప్రియా! నువ్వు మన్మధుడు నన్ను గడ్డిపోచను విసిరేసినట్టు అటూ ఇటూ ఊపుతున్నాడు. అంత కోపం వదిలి నా దగ్గరకు రా.

నేను: ఓ! ప్రేయసీ! నా హృదయం తాప ఉపశామనా! ఈ జీవితం ఎంత ఆనందమయం? మనం కూడా ఆనందంగా ఉందాం. ప్రేమించుకుంటూ, ముద్దులాడుకుంటూ, పూల పాన్పుమీద సయ్యాటలాడుకుంటూ.......ట్రా.....లా......లా.....లా.....

ఎట్లావుంది?

**మంత్రి:** బ్రహ్మాండంగా ఉంది ప్రభూ! ఇంత అందమైన ప్రేమదృశ్యాన్ని మీరు మనవనంలో చూపగూడదు.

**రాజు:** ఏం?

**మంత్రి:** రాత్రిపూట అక్కడ ఒకటే దోమలు....పైగా చలి....మీరు ఈ ప్రేమ పాఠాలు చెబుతున్నప్పుడు గబుక్కున ఒక దోమ మీ నోట్లోకి పోయిందనుకోండి. అమ్మో! ఇంకేమైనా వుందా? అంతేకాదు....ఇంత అందమైన దృశ్యాలకి అనువైన చోటు ఊరు చివర రహదారి బంగళా...

**రాజు:** అట్లా అంటావా? అయితే, ఆ అమ్మాయి కనిపించగానే రహదారి బంగాళాలోనే ఏర్పాట్లు చేయించు... నీలం చీరె, పచ్చని రవికె...ఆంతరంగిక మంత్రీ విను....

ఆ అమ్మాయిని వస్తే
తీసుకురా ఏ వేళయినా
రహదారి బంగళాకు.

మంత్రి: అట్లాగే, మహారాజా!

## మూడోరంగం

(వినాయకుడి గుడి. సాంబ–శివ)

**శివ:** ఇన్ని నవలలు, నాటకాలు చదివాను. కాని ఎక్కడా దేవుడు గాడిదను వరంగా ఇచ్చాడని ఎవ్వరూ చెప్పలేదు. దీనివల్ల నాకు జరిగిన మంచి ఒక్కటే! నాకో వుద్యోగం వచ్చింది – దీనికి కాపలా కాసే ఉద్యోగం.

**సాంబ:** నువ్వొట్టి చవట వెధవ్వి....నీకొక్కటీ అర్థం కాదు. నీకు తలకాయ ఉంది; దేవుడు నీకు గాడిదనిచ్చాడు. ఇంకేం కావాలి? ఈ గాడిదని కనీసం కోటి రూపాలయకన్నా అమ్మవచ్చు...ఎట్లాగో చెప్పనా? ఏయ్!

డింగ్‌డాంగ్......

(గాడిద ఓండ్ర పెడుతుంది)

ఇటురా. (వస్తుంది) కూర్చో. (కూర్చుంటుంది) నుంచో. (నిలబడుతుంది) నువ్వు డాన్స్ చెయ్యడం చూపించు (చేస్తుంది)

(శివకి చాలా సంతోషం...ఇద్దరూ పాడుతూ గాడదతో డాన్సు చేయిస్తారు)

సలాం డింగ్‌డాంగ్ దొరవారు
మీరుంటేనే వినోదాల హోరు ॥
రాజుగారితో పోలిస్తే
మీరెన్నో రెట్లు మేలు ॥
ఈ రాజుగారు ఒక కొజ్జా –
మంత్రులు సామంతులు శ్రీమంతులు
ఎవ్వడికీ లేదిక్కడ మనిషి కుండు లజ్జ ॥
ఈ రాజేమో రెండు కాళ్ళ పశువు
మీరేమో నాల్గుకాళ్ళ శిశువు
మంత్రుల, సామంతుల, శ్రీమంతులు
తంత్రాలను సాగనివ్వమింక ॥

**సాంబ:** ఇప్పుడా చీరె, జాకెట్టు ఇవ్వు (శివ ఇస్తాడు) నీలం చీరె, పచ్చ జాకెట్లు, ఇవేనా?

**శివ:** సరిగ్గా ఇవే కట్టుకున్నది ఆ అమ్మాయి అప్పుడు.

**సాంబ:** అంటే ఇప్పుడు నేను ఆమెలా కనిపించాలంటావ్!

**శివ:** మా నాన్నవు కదూ! (బతిమిలాడుతూ)

**సాంబ:** జాగ్రత్తగా విను. ఇంట్లోకి పోవడానికి, నాకా ఉద్యోగం రావడానికి మధ్య కాస్త సమయం పట్టవచ్చు. కాస్త ఆలస్యమయితే ఊరికే గోల చెయ్యకు.

**శివ:** సరే!

**సాంబ:** ఆలస్యం అయితే ఈలలు అవ్వీ వెయ్యకు.

**శివ:** వెయ్యను

**సాంబ:** వినాయకస్వామి చెప్పినట్లు ఈ ముత్యం ఆధారంతో నా తెలివి తేటల్ని చూపిస్తాను..నువ్వు అనవసరంగా గాడిద ప్రయోగాలు చెయ్యకు.

**శివ:** త్వరగా తెములు......

**సాంబ:** కొంచెం నెమ్మది...చూడు! ఎట్లాగయినా ఆ అమ్మాయిని నీ దగ్గరకు పంపిస్తాను. అప్పటిదాకా నువ్వు పెద్దమనిషిలా ప్రవర్తించాలి...అర్థం అయిందా?

**శివ:** ఎక్కువసేపు నోరుమూసుకు కూర్చోలేను నేను. ఏం చెయ్యమంటావ్?

**సాంబ:** వేళ్ళు, గోళ్ళు లెక్కపెట్టుకుంటూ కూర్చో.

**శివ:** అట్లాగేలే....నువ్వు తొందరగా వెళ్ళు.

**సాంబ:** జ్ఞాపకం ఉంచుకో.....వాళ్ళింట్లో నా పేరు బంగారి...(ముత్యాన్ని చూస్తూ) వినాయకా! నువ్వే రక్షించాలి....

(నోట్లో పెట్టుకోబోతూ పరిగెత్తుకుని ...........లోకి వెడతాడు)

## నాలుగో రంగం

(ఓ భాగ్యవంతుడి ఇల్లు. కావేరీ కిటికీ పక్కనే నిలబడి వుంది. ఆమెకు దగ్గరలో నీలంచీరె, పచ్చని జాకెట్ వేసుకుని సాంబ – అంటే బంగారి నిలుచుని వుంది)

**కావే:** ఈ వియోగాన్ని నేను భరించలేను. మన్మథబాణాలల తాకిడిని తట్టుకోలేను...ప్రియా! నువ్వు కనిపించవేం? మొన్న ఆ యువకుడు నా హృదయాన్ని కొల్లగొట్టిన నాటినుంచి నాలో ఆరని సెగలు మన్మథ బాణాలను నాలాంటి కోమలిని ఎర వెయ్యడం భావ్యం కాదని అతనికి ఎవ్వరూ చెప్పలేరా? అతన్ని చూడకుండా ఒక్క క్షణం ఉండలేను. నిద్రలేని రాత్రుళ్ళు నా అవస్థని అతనికి చెప్పేవాళ్ళు ఎవరూ లేరా?

ఆ! అడుగో! వచ్చాడు.

ఈ ఆడమనిషి ఎవరో ఈ ఇంట్లో పనిమనిషిగా ఉద్యోగం ఇవ్వండని ఇందాకటినుంచి ప్రాధేయ పడుతోంది ఈమెను పనిలో పెట్టేటట్లు అమ్మకు చెప్పి ఆమెను నాకు నమ్మకస్థురాలిగా చేసుకుంటా. ఆమె సహాయంతో అతన్ని నా వాణ్ణిగా చేసుకుంటా...(బంగారి వైపుకు తిరిగి) చూడు! నీకు ఉద్యోగం కావాలనుకుంటే అమ్మ వచ్చేదాకా ఆగాలి....అన్నట్టు, నీ పేరేమిటన్నావ్?

**సాంబ:** బంగారి.

**కావే:** మీది ఈ ఊరేనా?

**సాంబ:** అవును.

**కావే:** బంగారి! ఆ దొడ్డి వేపున నిలబడ్డ అబ్బాయిని చూశావా? ఎవరతను? నీకు తెలుసా?

**సాంబ:** (తనలో) అప్పుడే ఈ వెధవ వచ్చేసినట్టున్నాడు (పైకి) నాకు తెలుసునమ్మా! మా వీధిలోనే ఉంటాడు.

**కావే:** మీ వీధిలోనా? అతని పేరేమిటి?

**సాంబ:** అతని పేరు శివ. ఎందుకడుగుతున్నారమ్మా?

**కావే:** మూడ్రోజులనుంచి అక్కడే నిలబడి వున్నాడు. అతని వెంట ఓ ముసలాడు కూడా వచ్చేవాడు...ఇవ్వాళ వచ్చినట్లు లేదు.

**సాంబ:** ఆ ముసలాయన అందంగా ఉంటాడా?

**కావే:** ఛీ! ఛీ! ముసలి కోతి....అచ్చంగా నీలాగే వుంటాడనుకో...కాని ఆ కుర్రాడు మాత్రం చాలా బావుంటాడు. ఏమంటావ్?

**సాంబ:** బావుంటాడా? ఏమిటి మీ ఉద్దేశ్యం? రెండు బీడీలకు కూడా కొనరు వాడిని. వాడి మొహం చూశారా? సరిగ్గా నవ్వడం కూడా చేతకాదు. కాని ఆ రెండో మనిషి వున్నాడు చూడండి, మీరిందా 'ముసలాడు'

అన్నారే అతని అందం చెప్పుకోవాలి..అంత ముసలివాడు కూడా లేదు. ఎంత బాగా ఆడతాడు. పాడతాడు? జనం అందరూ అతన్నేమని అడుగుతారో తెలుసా? మీ యౌవనంలో ఉన్న రహస్యం ఏమిటండీ – అని....

**కావే:** నా వంకే ఊరికే చూసేవాడు, కోతిమొహమూ వాడూ! వాడికంటే నువ్వే బావున్నావు....కాని ఆ కుర్రాడు! మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే మనిషి.

**సాంబ:** కాని వాడు ఒట్టి పోకిరీ అమ్మా! వాడితో ఉన్న ముసలాడున్నాడే, వాడు పెద్దమనిషి.

**కావే:** ఆ ముసలాడంటే నీకంత ఇష్టమయితే, అతనితో ఫో....ఇక్కడి కెందుకొచ్చావు? ఇంకోసారి అతని పేరెత్తితే ఈ ఉద్యోగం నీకు రాదు. ఇవ్వాళ ఆ ముసలి పీనుగ రాలేదు, దేవుడి దయ.

**సాంబ:** (తనలో) సాంబా! ఆ అమ్మాయి నీది కాదురా! ఇన్నాళ్ళూ నా కొడుకు చేతకాని వాడు అనుకున్నాను. కాని ఆ అమ్మాయి మనసునే దోచేసినట్టున్నాడు. బలే సాహసివిరా డింభకా! శివా! ఇప్పుడు ఒప్పుకుంటున్నానురా, నేను ముసలివాణ్ణవుతున్నానని.

**కావే:** ఎన్నేళ్ళుంటాయో?

**సాంబ:** ఎవరికి? నాకా?

**కావే:** కాదు. ఆ కుర్రాడికి.

**సాంబ:** నలభై ఐదో, యాభయ్యో –

**కావే:** ఏమైంది నీకు? సరిగ్గా మాట్లాడితే మాట్లాడు, లేకపోతే బయటికి నడు.

**సాంబ:** పొరపాటయింది అమ్మాయిగారూ! ఆ అబ్బాయి కుర్రాడే ఇంకా.

**కావే:** ఆ కుర్రాడు మంచివాడేనంటావా?

**సాంబ:** మంచివాడే! కాని ఆ నడక –

**కావే:** ఏమయింది అతని నడకకి? నిన్న వస్తుండగా చూశాను..చాలా ఠీవిగా నడుస్తాడు...నువ్వేమన్నావ్? చాలా అందంగా ఉంటాడని కదూ?

**సాంబ:** అందగాడే! కాని ఆ నుంచోడం –

**కావే:** ఆ నుంచోడానికేం? చాలా అందంగా నుంచున్నాడు.

**సాంబ:** వాడు బీదవాడు...వాడి మోహం –

**కావే:** ఎంత అందంగా ఉంది ఆ మొహం! చూడు.......

**సాంబ:** (తనలో) నీ పప్పులేం ఉడకవురా సాంబా! మీ వెధవాయిని ఆ అమ్మాయి గుండెల్లో కట్టేసుకుంది. (పైకి) అందంతా బాగానే వుంది అమ్మా! వాడి నడత, వాడు నుంచోడం, వాడి మొహం, వాడి బీదతనం – అన్నీ అందంగా ఉన్నాయి, సరే! కాని గత మూడు రోజుల్నుంచి వాడికొక పెద్ద జబ్బు పట్టుకుందమ్మా!

**కావే:** జబ్బా! మూడు రోజుల్నుంచా?

**సాంబ:** అవును....వాడు ఒక అందరమైన అమ్మాయిని చూశాడట! అప్పటినుంచీ తనలో తాను మాట్లాడుకోవడం, శూన్యంగా ఆకాశం వంక చూడడం, ఊరికే నిట్టూర్పులు విడవడం, నిద్రపోకుండా మంచం మీద అటూ ఇటూ దొర్లడం...

**కావే:** (నవ్వుతూ) ఎవరా అమ్మాయి?

**సాంబ:** అమ్మాయి ఈ ఇంట్లోనే వుంటుందిట.

**కావే:** ఏమిటి! ఈ ఇంట్లోనా? ఆ అమ్మాయి పేరేమిటి?

**సాంబ:** పాములాంటి చలాకీతనం, ఏనుగులాంటి హుందాతనం, పోకిరీ వాళ్లను గడగడలాడించే జాణతనం – గజనిమ్మ పండు – అన్నాడమ్మా నాతో.

**కావే:** అన్నీ అబద్ధాలు.

**సాంబ:** నీకు అబద్ధాలు ఎందుకు చెప్పాలి నేను? నీ దగ్గరకి నన్ను పంపించింది అతనే! నువ్వు తనని ప్రేమించకపోతే బతకలేనన్నాడు. అతన్ని చూసి జాలిపడి ఇట్టా వచ్చాను. నీకా కుర్రాడు కావాలంటే నాకీ ఇంట్లో పని ఇప్పించు.

**కావే:** అమ్మ వచ్చేదాకా వుండు..అటు చూడు! ఆ గాడిద మీదకు వంగి దాన్ని లాలిస్తూ దాంతో గుసగుసలాడుతున్నాడు. నేనా గాడిదనై ఉంటే ఎంత బావుండును! బంగారి! ఆ పనికి మాలిన కుర్రాడు ఆ పనులన్నీ గాడిదకోసం చెయ్యడం ఏమన్నా బావుందా? అతన్ని తలుచుకుని తలుచుకుని, మూడ్రోజుల్నుంచి నాకు నిద్రలేదు, తెలుసా?

**సాంబ:** అయ్యయ్యో.....

**కావే:** బంగారి! అతన్ని నీ యిష్టం వచ్చినట్టు తిట్టు.

**సాంబ:** అదేమిటి అమ్మాయి?

**కావే:** నువ్వట్లా తిడితే నాకు అతనంటే కోపం రావచ్చు..అప్పుడు నేను హాయిగా నిద్రపోవచ్చు.

**సాంబ:** నిజంగా తిట్టమంటావా?

**కావే:** ఊ.....కానీ......

**సాంబ:** వాడిని మనిషని ఎవరంటారు? కోతి, కొండముచ్చు....ఈ ప్రపంచంలో కోట్టకొద్దీ కోతులున్నాయి. ఈ కోతిలో ప్రత్యేకత ఏమిటి? మరో కోతిని ఎంచుకో అమ్మాయి.

**కావే:** కాని మరి ఏ ఇతర కోతీ ఇంత అందంగా ఉండదు.

**సాంబ:** ఆ మొహం వంక చూడండి..దరిద్రపు గొట్టు మొహం –

**కావే:** కాని ఎంత అందంగా ఉంది!

(గోదావరి వస్తుంది)

**గోదా:** ఆ కిటికీ పక్కనే నిలబడొద్దని నీకు లక్షసార్లు చెప్పాను. ఇంకోసారి అక్కడనుంచి వీధుల్లో పోయే కుక్కల్ని చూస్తూ ఉన్నావంటే ఆ కుక్కల కాళ్ళు విరగ్గొడతాను. జాగ్రత్త.

**సాంబ:** అదేమిటి! ఆ పిల్ల పెద్దదయింది. దేన్ని చూడొచ్చో, దేన్ని చూడకూడదో ఆ మాత్రం తెలియదా ఏమిటి?

**గోదా:** ఈవిడెవరు?

**కావే:** నువ్వు పని మనిషి కావాలన్నావు కదమ్మా! నీ కోసమో వచ్చింది.

**సాంబ:** ఇంట్లో ఇద్దరు ఆడవాళ్ళు దుంగల్లా ఉంటే పనివాళ్ళెందుకు? ఏం అక్కర్లేదు.

**కావే:** నువ్వే అన్నావు కదే! అప్పుడే మరిచి పోయినావా?

**గోదా:** అది అప్పుడు....ఇప్పుడు మనకేం అక్కర్లేదు.

**కావే:** పనిలో – ఎత్తిన నడుం ఎత్తదమ్మా....పెట్టుకుంటే నీకు సాయం.....

**గోదా:** నీ వత్తాసు ఏం అక్కర్లేదు....ఎంతగావాలి నీకు?

**సాంబ:** ఎంత? వంద రూపాయలు చాలు.

**గోదా:** వంద రూపాయలా! ఎన్ని సంవత్సరాలకి?

**సాంబ:** ఒక నెలకి.

**గోదా:** రాజుల ఇళ్ళల్లోగాని మాలాంటి వాళ్ళు అంత ఇచ్చుకోలేరమ్మా...అయినా ఏమేం పనులు చేస్తావు?

**సాంబ:** ఒకటేమిటి? బట్టలు ఉతుకుతాను. ఇళ్ళు ఊడుస్తాను. అంట్లు తోముతాను. తింటాను. తాగుతాను. నిద్రపోతాను.

**గోదా:** హవ్వ! ఇక నోరుమూసుకో...ఇక్కడ పని చెయ్యదలుచుకుంటే నోరు కొంచెం సంబాళించుకోవాలి....పద, ఏం చెయ్యాలో చెబుతాను..

(లోపలికి పోబోతూ వుండగా, భాగ్యవంతుడు వస్తాడు)

**భాగ్య:** చూశావా, చూశావా! మన దొడ్డి గుమ్మం ముందు ఒక గాడిద నిలబడి వుంది. అచ్చం గుర్రంలా ఉందనుకో.

**గోదా:** నిన్ను చూసింతరువాత ఇంకా ఆ గాడిదను చూడడం ఎందుకు?

**భాగ్య:** అది నాకన్నా బావుంది...కావాలంటే వచ్చి చూడు.

(అందరూ కిటికీ దగ్గరకు పోయి చూస్తారు)

**గోదా:** నువ్వు చెప్పింది నిజమే! ఎట్టా మెరుస్తోంది. ఏం రంగు! ఏం కాళ్ళు....ఏం ఒళ్ళు!

**భాగ్య:** ఎంత పెద్దదో! ఎంత ఎత్తు, ఎంత వెడల్పు –

**గోదా:** ఇంత పెద్దగాడిదని నా జీవితంలో చూడలేదు. ఎక్కడ కనిపించింది?

**భాగ్య:** మన పెరటి దొడ్లో నిలబడి వుంది. నేనూ ఇప్పుడే చూశాను.

**గోదా:** అక్కడ నిలబడ్డ ఆ కుర్రాడెవరు?

(గాడిద అరుస్తుంది. సాంబడు, గాడిద ఒకరికొకరు సైగలు చేసుకుంటారు)

ఎంత మధురంగా ఉంది అది ఓండ్రపెడితే.

**భాగ్య:** నువ్వు పాడే దేవుడి పాటల కంటె బావుంది కదూ?

**గోదా:** ఊ!...కావేరీ! నువ్వుపోయినీ సంగీత పాఠాలు నేర్చుకో......

**సాంబ:** ఎందుకూ? ఆ పెరట్లో నిలబడి ఆ గాడిద అరుపులు వింటే సంగీతం అదే వస్తుంది.

(కావేరి మెల్లగా జారుకుంటుంది)

**భాగ్య:** బాగా చెప్పావ్! అన్నట్టు, ఈవిడెవరు?

**గోదా:** మన కొత్త పనిమనిషి.

**భాగ్య:** బాగానే ఉంది....ఆ ముక్కే కొంచెం –

**సాంబ:** నేను ముక్కుతో పనిచెయ్యను...చేతుల్తో చేస్తాను.

**గోదా:** చూడు! నిన్న లెక్కల్లో పదిరూపాయల తేడా వచ్చింది..ఆ లెక్కలు సరి చేశావా?

**భాగ్య:** ఇంకా చెయ్యలేదు. ఇప్పుడు చూడాలి...

**గోదా:** మరి నోరుమూసుకుని ఆపని చేసుకోక, ఇక్కడ తారట్లాడతావేం? పదమ్మా, వాకిట్లో పనివుంది.

(ఇద్దరూ వాకిట్లోకి వెడతారు. వెంటనే వెనక్కు నడుస్తూ ప్రవేశిస్తారు. వాళ్ళతో పాటు ఆంతరంగిక మంత్రి. సాంబడిని చూచి చాలా ఆనంద పడుతున్న మొహం. సాంబ, గోదావరి ఇద్దరూ భయపడతారు)

**గోదా:** ఏమయ్యోయ్!..చూడు ఎవరో వచ్చారు.

**మంత్రి:** నీలం చీరె! పచ్చ జాకెట్టు! (తనని తానే చరుచుకుని) ఒరే ఆంతరింగిక మంత్రీ! చివరికి నువ్వే గెలిచావురా వెధవా!!

**భాగ్య:** (ఆయన్ని చూసి, భయపడి) ఓ! మంత్రిగారా! ఆంతరింగిక మంత్రిగారా!! రండి, లోపలికి రండి. అయ్యగారికి పళ్ళూ ఫలహారాలు తీసుకురండి...అయ్యా లోపలికి రండి...

**మంత్రి:** నీలంచీరె! పచ్చ జాకెట్టు.....భలే!

**భాగ్య:** ఈవిడ –

**మంత్రి:** నాకు తెలుసు.

**భాగ్య:** మా ఇంటికి ఇవ్వాళే వచ్చిందండి.

**మంత్రి:** (భాగ్యవంతుడితో సీరియస్‌గా) నిన్ను గురించి నాకంతా తెలుసు...... పద –

**భాగ్య:** మా ఆవిడ మీద ఒట్టు .....నేనే తప్పు ఎరగనండీ! కలలో కూడా నాకు అటువంటి ఆలోచనలు రావండి.

**గోదా:** అయ్యా! కలల్లో కూడా మేము మహారాజుగారి పాదాలను కొలుస్తాం.

**భాగ్య:** నిజం అండీ! ఇద్దరికీ కలిసే ఆ కలలు వస్తాయండీ....నేనే దానికి సాక్షిని.....ఆ తరువాత రాజుగారి కాళ్ళు కడిగి ఆ నీళ్ళు మా నెత్తిన చల్లు కుంటాం.

**గోదా:** అవును....

**భాగ్య:** బాబుగారూ! నాకు విప్లవాలంటే బొత్తిగా గిట్టదండీ.......ఏ విప్లవమయినా సరే! హరిత విప్లవం, ఎర్ర విప్లవం, తెల్ల విప్లవం....ఏ రంగుదైనా నాకు నచ్చదండీ. ఇంతవరకు ఒక్క పైసా ఇటువంటి వాటికి చందాలివ్వలేదండి...నిఘం,

**మంత్రి:** మంచిది......

**భాగ్య:** అంతేకాదండి....నా స్నేహితులెవ్వర్నీ కూడా అటువంటి వాటికి కానీ ఇవ్వనివ్వండి.....విప్లవం పేరుతో వాళ్ళొచ్చి కనీసం పది రూపాయలివ్వండి అని ప్రాధేయపడతారండీ.....నేను ఛస్తే ఒక్కపైసా ఇవ్వనని ఖచ్చితంగా చెప్పేశానండీ.....అంతే!

**మంత్రి:** (సాంబనే తదేకంగా చూస్తున్నాడింతసేపు.....ఒక్కసారిగా ఒక శృంగార నాయకుడిలా పాట అందుకుంటాడు)

చూశాను, చూశాను, చూశాను
ఓ అందమైన అమ్మాయిని చూశాను
ఆమె కవ్వించే కళ్ళనే చూశాను
పచ్చ రవికె, నీలం చీరె చూశాను

బంగరు కాంతి వేడిసౌరు చూశాను

ఓ అందమైన అమ్మాయిని చూశాను

నేను రాజుగారి ప్రియురాల్నే చూశాను

(భాగ్యవంతుడితో) ఏమయ్యోయ్! మిమ్మల్ని గురించి నిన్న రాజుగారు నేను ఎంత సేపు మాట్లాడుకున్నామని!

**గోదా:** మమ్మల్ని గురించా?

**మంత్రి:** ఇంకా వివరంగా చెప్పాలంటే, ఈవిడని గురించి (సాంబని చూపుతూ)

**భాగ్య:** నిజంగా!

**మంత్రి:** భయపడకు. నిన్నేమీ తప్పు పట్టడం లేదు.....పైగా అదృష్ట దేవత నీ తలుపు తడుతోంది. నీ పేరేమిటమ్మా?

**సాంబ:** బంగారి.

**మంత్రి:** రాజుగారి మనసునట్లా పరుగులెత్తించడం మాటలు కాదు.

**భాగ్య:** అయ్యా! నాకంతా అగమ్యగోచరంగా ఉంది......తమరు ఇంకొంచెం వివరంగా చెబితే –

**మంత్రి:** చెప్పడానికేముందయ్యా? రాజుగారికి నువ్వంటే చాలా ఇష్టం ఏర్పడ్డది..నేనడిగేదల్లా ఒక్కటే – ఆ తరువాత నన్ను మాత్రం మరిచిపోకు అంతే.

**భాగ్య:** నాకేం అర్థం కావడం లేదు.

**మంత్రి:** అంతా మరిచిపో.....అన్నీ యథా ప్రకారం జరుగుతాయి...మీ అమ్మాయిని గురించి రాజుగారికి ముందుగా చెప్పింది నేనే! బంగారి! ఇహ చూసుకో! ఈ ఇల్లంతా బంగారంతో నిండిపోబోతుంది.

**భాగ్య:** మీరు మాట్లాడే దేమిటో కొంచెం వివరంగా చెప్పండి. నాకు పిచ్చెక్కుతుంది.

**మంత్రి:** నేను చెప్పను. ఏం చేస్తావ్?

**భాగ్య::** ఓరి భగవంతుడా!

**గోదా:** (ఆయన్ని అనుకరిస్తూ) ఓయీ భగవంతుడా! చెప్పాల్సిందేమిటో కుండ బద్దలు కొట్టి చెప్పవేం? చూడండి మంత్రిగారూ! ఈవిడ మా అమ్మాయి కాదు.

**మంత్రి:** మరి?

**గోదా:** మా పని మనిషి.

**మంత్రి:** ఆ! (దెబ్బతిన్నాడు..తేరుకుని) మీరిద్దరూ ఆ కిటికీ దగ్గరకు పోయి నిలబడండి. (బంగారితో) మొన్న వసంతోత్సవానికి రాజుగారి వనానికి వెళ్ళావా?

**సాంబ:** (ఒక్కక్షణం ఆలోచించి, కావానే) ఊ,,, వెళ్ళాను.

**మంత్రి:** అప్పుడుకూడా ఇదే నీలం చీర, ఇదే పచ్చ జాకెట్టు వేసుకున్నావా?

**సాంబ:** అవునండి.

**మంత్రి:** ఆ రోజున ఎవరన్నా నీ మీద ప్రేమలో పడ్డట్టు నీకేమైనా అనుమానం వచ్చిందా?

**సాంబ:** అనుమానం ఎందుకండీ? ఒకళ్ళా, ఇద్దరా? నా అందాన్ని చూసి అందరూ నా వెంట పడడమే! ఎవరో ఒక్కరని ఎట్లా చెప్పడం?

**మంత్రి:** ఒక పెద్దమనిషి – కొంచెం పెద్దవాడే – నీ వంక అదే పనిగా ప్రేమగా, ఆశగా చూస్తూనే ఉన్నాడా?

**సాంబ:** పెద్దవాడా? ఆ! అవును..అయన రాజాలాగా వున్నాడు.

**మంత్రి:** (ఆనందంతో) ఆ! అప్పుడేమయింది?

**సాంబ:** నన్ను చూస్తూనే నోరు తెరిచాడు...మళ్ళీ నోరు మూతపడలేదు. ఇప్పటికైనా నోరు మూత పడిందో లేదో?

**మంత్రి:** పిచ్చదానా! నువ్వెంత పెద్ద చేపని పట్టుకున్నావో నీకు తెలియదు. ఆ నోరు తెరిచుకుని నిన్ను చూస్తున్న ఉండిపోయినాయన సాక్షాత్తు మహారాజుగారే!

**సాంబ:** ఆ!! ఆ!! (నిర్ఘాంతపోయి)

**గోదా:** (కిటికీలోనుంచి బయలకు చూస్తూ) అటు చూడండి. అమ్మాయికి అతుక్కుపోయి ఆ కుర్రాడు ఎలా మాట్లాడుతున్నాడో.....చూడండి......కావేరీ! జాగ్రత్తే!

**మంత్రి:** ఏమిటట్లా! అరుస్తావ్! నోరుమూసుకుని ఉండండి. లేకపోతే జైల్లో తోయిస్తాను. (మళ్ళీ మెల్లగా, సాంబ మాత్రమే వినేటట్టు) బంగారి! నా మాటలు వింటే, నా అదృష్టాన్ని అందలం ఎక్కిస్తాను.

**సాంబ:** నేను వినను – అని చెప్పానా?

**మంత్రి:** నిన్ను గురించి వివరాలు చెప్పు....

**సాంబ:** మీరడగండి....నీకు పెళ్ళయిందా అని అడగండి.....

**మంత్రి:** నీకు పెళ్ళయిందా?

**సాంబ:** అయ్యగారూ! మా ఆయనే బతికుంటే ఇట్లా వీధిన పడి వుండేదాన్నా? ఆయన పోయిన తరువాత ఊరికుక్కలు నా వెంట పడడం మొదలు పెట్టాయి....మా ఆయన ఎట్లా పోయినాడని అడగరేం?

**మంత్రి:** మీ ఆయన ఎట్లా పోయినాడు?

**సాంబ:** మీకేమీ తెలియదేం? ఎట్లా పోతాడు? నేనే చంపేశాను.

**మంత్రి:** ఎందుకు?

**సాంబ:** పక్కింటావిడ మొగుడు నేనంటే పడి చచ్చేవాడు. మా ఆయనకి తెలిసింది. నమోషే వేసి ఉరిపోసుకు చచ్చిపోయినాడు. మరి, నువ్వెట్లా బతుకుతున్నావని అడగరేం?

**మంత్రి:** నువ్వెట్లా బతికున్నావ్?

**సాంబ:** అదే చెప్పబోతున్నాను. ఇంతదాకా ఒక అంట సన్నాసి దగ్గర పని చేసేదాన్ని. ఆయన మీలాగా సన్నగా, పొడుగ్గా, అందంగా ఉండేవాడు. మీ మాదిరిగానే, నువ్వేం పనులు చెయ్యగలవు బంగారీ – అని అడిగాడు. "మీరేం చెయ్యమన్నా చేస్తాను (మంత్రి బుగ్గలు గిల్లుతూ) మీరు మాత్రం నవ్వుతూ వుండాలి" అన్నాను. ఆ మాట అనగానే ఆయన దగ్గరకు వచ్చి, నా చేతులు పట్టుకుని, నాతో ఉండిపో – అన్నాడు.

**మంత్రి:** (సాంబ చేతులు పట్టుకుని) నేనూ నిన్ను అదే అడుగుతున్నాను, బంగారీ! నువ్వు రాజుగారితో ఉండిపోతావా?

**భాగ్య:** అయ్యో! పిలిచారా?

**గోదా:** అయ్యో! అయ్యో! ఆ కుర్రాడు మా అమ్మాయి చెవుల్లో ఎట్లా గుసగుసలాడుతున్నాడో చూడండి!

చెవులు కొరుకుతున్నాడు.

**భాగ్య:** కావేరీ! నీ లోలాకులు జాగ్రత్త!

**మంత్రి:** ఏయ్, నోరుమూసుకోండి. (సాంబతో) బంగారి! నువ్వు ఈ భాగ్యవంతుడి కూతురువని రాజుగారితో ఓ చిన్న అబద్ధం ఆడాలి.

**సాంబ:** నాకు తెలియదూ?

**మంత్రి:** రాజుగారు ఇచ్చే దాంట్లో మూడోంతులు నాకివ్వాలి.

**సాంబ:** మొత్తమంతా మీరే తీసుకుందురూ.

**గోదా:** అయ్యో! అయ్యో! ఎట్లా కావించుకుంటున్నాడో! ఏయ్! కావేరీ!

**మంత్రి:** ఏమిటి నీ గోల? (సాంబతో) అంతా పరిష్కారం అయినట్టేగా?

**సాంబ:** ఆహా! కాని మనం ఇక్కడ కలుసుకోకూడదు...నగంర బయట వున్న వినాయకుడి గుళ్ళో కలుద్దాం.

**మంత్రి:** సరే! ఊరి బయట, వినాయకుడి గుడి! అంతేనా?

(వెడతాడు)

## అయిదో రంగం

(రాజ ప్రాసాదం. రాజూ, మంత్రీ)

**రాజు:** ఓయ్, మంత్రీ!

**మంత్రి:** పిలిచారా మహారాజా?

**రాజు:** నేను పిలిస్తే నీకు వినిపిస్తుందో లేదోనని చూశాను. అంతే.

**మంత్రి:** వినిపిస్తూనే వుంది మహారాజా. కాని ప్రజల పిలుపు ఇంకా గట్టిగా వినిపిస్తోంది మహారాజా.

**రాజు:** మంత్రీ! పూర్వకాలం రాజులంతా తమ దర్బారులు ఎట్లా మొదలు పెట్టేవాళ్ళో?

**మంత్రి:** వాళ్ళు మంత్రుల్ని పిలిచి దేశక్షేమాన్ని ముందు తెలుసుకునేవారు.

**రాజు:** నిజమే! ఈ మధ్య మనం చూసిన నాటకంలో ధర్మరాయుడి దర్బారు కూడా అట్లాగే మొదలైంది. మంత్రీ! మన ప్రజలందరూ ముక్కు మూసుకుని శివుడిని ధ్యానిస్తూ ఉన్నారా? మన దేశం సుభిక్షంగా ఉందా?

**మంత్రి:** లేదు మహారాజా. ప్రజలంతా చాలా అసంతుష్టితో ఉన్నారు.

**రాజు:** మనం చూసిన నాటకంలో మంత్రి ఇట్లా మాట్లాడలేదే!

**మంత్రి:** మీరు నాటకంలో మహారాజులు కాదు. ఇది నాటకమూ కాదు ప్రభూ! మీరు నిజమైన మహారాజులు. ప్రజల నిజమైన బాధల్ని మీరు విని, చూసి వారిని ఆదరించాలి.

**రాజు:** అట్లాగే, అట్లాగే...ఇంకా చెప్పు.

**మంత్రి:** మహారాజా! నేను మీకంటే వయసులో చిన్నవాడిని.

**రాజు:** తెలివితేటల్లో కూడా!

**మంత్రి:** అయినా చెప్పక తప్పదు. ఈ దేశం క్షేమం కోసమైనా కొన్ని కఠోర సత్యాలు మీకు చెప్పి తీరాలి.

**రాజు:** నువ్వు మాట్లాడే మాటల కన్న, కక్కే విషం ఎక్కువ....మన దేశంలో క్రమం తప్పకుండా సూర్యుడు ఉదయిస్తూ అస్తమిస్తున్నాడని ఐరావతం చెప్పాడు. అది నిజమేనా?

**మంత్రి:** ప్రభూ! ప్రజలు పన్నుల భారంతో కుంగిపోతున్నారు. దొంగలు, హంతకులు ఎక్కువవుతున్నారు. ఎక్కడ చూసినా క్షామం, అవినీతి, లంచగొండితనం రాజ్యం చేస్తున్నాయి.

**రాజు:** నువ్వు చెప్పేదంతా నిజమయితే, దీనికంతటికీ కారకులెవరు?....నీ పని నువ్వు సక్రమంగా చెయ్యడం లేదని నీ మాటలే చెబుతున్నాయి.

**మంత్రి:** అది నిజం కాదు మహారాజా! మీరుగాని, ఐరావతం గారు కాని మా ఇబ్బందులు అర్థం చేసుకోవడం లేదు. సమయానికి మేల్కోకపోతే చాలా ప్రమాదం. ప్రజలంతా ఏకమైన విప్లవం అంటున్నారు.

**రాజు:** మనం ప్రభుత్వం తరఫు నుంచి కూడా కొన్ని విప్లవాలు లేవదీశాం కదా! (నవ్వుతూ) హరితవిప్లవం, శ్వేత విప్లవం, కాషాయి విప్లవం....

**మంత్రి:** ఇది నవ్వులాట కాదు మహారాజా! ప్రజల బాధల్ని, అధికారుల అహంకారాన్ని మనం సహించి ఊరుకోకూడదు...నా మాట వినండి.

**రాజు:** ఏమిటయ్యా ఇదంతా? నాకు హితబోధ చేసేటంత గొప్పవాడివై పోయావా?

**మంత్రి:** ఇది హితబోధ కాదు మహారాజా! పరిస్థితి తీవ్రతను, ప్రమాదాన్ని గుర్తించమంటున్నాను.......మీరు చివరికి –

**రాజు:** ఆ! నిజంగా! నా కాలి చెప్పు కూడా నాకు ఏం చెయ్యాలో చెబుతూ ఉంటే, నా కర్తవ్యం ఏమిటి?

మంత్రి: ఆ కాలి చెప్పుల్ని విడిచి విసిరి అవతల పడేస్తారు. అంతేగా? ఇదుగో! నా రాజీనామా ఆమోదించండి.

(వెడతాడు)

**రాజు:** దొంగ లం –

(సేవకుడు వస్తాడు)

**సేవ:** మహారాజుకు జయం. ఐరావతం గారు వేచివున్నారు ప్రభూ!

**రాజు:** ప్రవేశపెట్టు.

(సేవకుడు వెళ్ళిపోతాడు)

**ఐరా:** (వస్తూ) మహారాజుకు జయం.

**రాజు:** జయం ఎట్లా కలుగుతుందయ్యా? ప్రజలంతా అసంతృప్తితో ఉన్నారట. విప్లవం చేయడానికి సిద్ధంగా ఉన్నారట. నిన్నడిగితే, నువ్వేమో అంతా సవ్యంగా ఉన్నదంటావ్!

**ఐరా:** ప్రభూ! ఈ విషయంలో మీకు శంక అనవసరం. మీ చెవుల్ని ఇట్లా పడెయ్యండి. మన వేగులవాళ్ళు తెచ్చిన తాజా సమాచారాన్ని మీకు నివేదిస్తాను.

**రాజు:** అట్లా చెప్పు......ఇవిగో నా చెవులు.

**ఐరా:** ప్రభూ! తాజా సమాచారం ప్రకారం మన మహామంత్రే విప్లవ నాయకుడు!

**రాజు:** ఏమిటీ!

**ఐరా:** నిజం మహారాజా! మరో విశేషం చెప్పాలి మీకు. ఆయనగారి కళ్ళు మీ సింహాసనం మీద పడ్డాయని

గట్టిగా తెలిసింది. పాపం! మంత్రిగారంటే మాకు జాలిగా వుంది; మీరంటే గర్వంగానూ వుంది.

**రాజు:** చూడు ఐరావతం! ఏదో మిషమీద ఆ మంత్రిని జైలుకు పంపలేవా?

**ఐరా:** ఆయనని జైలుకు పంపించడానికి మిష ఎందుకు మహారాజా? మీ కోరికల్ని అమలు చేయడానికి నేనులేనా? ఇవ్వాళ సాయంకాలంలోగా ఆయన జైలులో ఉండితీరతాడు...నిన్నంటే నిన్న – ఆయన అనుచరుడొకడు ఉపన్యాసం ఇస్తూ ఏమన్నాడో తెలుసా మహారాజా? ప్రతి ఐరావతానికి ఎన్ని బంగళాలు వున్నాయి? ...అన్నాడు...ఆ మాట అనొచ్చా ప్రభూ?

**రాజు:** అవునూ –

**ఐరా:** ప్రభూ! అటువంటి ప్రజలున్నారు కనకే తమవంటి గట్టి ప్రభువులున్నారు. మీలాంటి ప్రభువులున్నారు కనకే మా లాంటి అధికారులం ఉన్నాం. మేం ఉండకపోతే ఈ పరిపాలన ఈ విధంగా ఉండేదంటారా? ప్రభూ! మీరు మహారాజులు. మీకు రాజప్రసాదం ఉంది. మేం మీ సేవకులం. మాకు కనీసం రెండు చిన్న చిన్న బంగళాలు ఉండడం తప్పా?

**రాజు:** కాని ఇప్పుడు నీ బంగళాలున్న స్థలంలో ఇదివరకు పూరిగుడిసెలుండేవట కదా?

**ఐరా:** అదే కదా, ప్రభూ! ప్రగతి అంటే! ఇది వరకు పూరిగుడిసె స్థానంలో ఇప్పుడు బంగళా! మేము ఇంగ్లండు మహారాణీగారు బానిసలకు వారసులం ప్రభూ! అందుకే కదా మమ్మల్ని బ్యూరోక్రాట్స్ అంటారు.

**రాజు:** అది సరే! ఇప్పుడొచ్చిన పనేమిటి?

**ఐరా:** ప్రభూ! దొంగతనం కేసులు రాజ్యంలో ఎక్కువైపోతున్నాయి. తాజా సమాచారం ప్రకారం నాలుగు కోట్ల జనాభాలో మూడు కోట్ల తొంభై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది మంది దొంగలే ప్రభూ!

**రాజు:** ఆ మిగిలిన ఒక్కడూ ఎవరు? నేనా?

**ఐరా:** ఆ సంగతి వేరే చెప్పాలా ప్రభూ?

**రాజు:** అయితే నువ్వూ దొంగవేనన్నమాట!

**ఐరా:** సమాచారంలో ఉన్న చివరి అంకెల్లో ఒక చిన్న సవరణ ప్రభూ! తొమ్మిది వందల తొంభై తొమ్మిదికి బదులు తొంభై ఎనిమిది అని వుంది ఈ సమాచారంలో...చూడండి.

**రాజు:** అంటే నువ్వు దొంగవు కాదన్నమాట....తరువాత?

**ఐరా:** దొంగతనం చెయ్యడం పాపం..కాని ఆ మాట మీద ఉండి దొంగతనం చెయ్యడం ఎవ్వరూ మానుకోవడం లేదు. అలవాటయిన దాన్ని మానుకోమనడం మనకు మాత్రం భావ్యమా?

**రాజు:** అర్థం అయ్యేట్టు చెప్పవయ్యా!

**ఐరా:** మహారాజా! దొంగతనాలకి మనమే పర్మిట్లిస్తే ఎలా వుంటుంది?

**రాజు:** బ్రహ్మాండం.

**ఐరా:** మనమే ప్రతి పర్మిట్‌కి ప్రభుత్వానికి ఇంత చెల్లించాలంటాం అనుకోండి. ప్రతి వాడూ పర్మిట్ కొంటాడు. మన ధనాగారం నిండిపోతుంది.

**రాజు:** వాకిట్లో ఆ గోల ఏమిటి?

**ఐరా:** ప్రజలు పర్మిట్ల కోసం ఎగబడుతున్నారు మహారాజా? తొందరగా సంతకాలు పెట్టండి.

**సేవ:** (వస్తూ) ప్రభూ! చిల్లరగారు మీకోసం వచ్చారు.

**రాజు:** తరువాత సంతకాలు పెడతాన్లే....ఆగు..చిల్లరను లోపలకు పంపించు.

(సేవకుడు వెళ్లిపోతాడు)

**ఐరా:** ప్రభూ! ఈ చిల్లర విషయంలో జాగ్రత్తగా వుండండి. అస్సలు నమ్మకమైన వాడు కాదు. ఏదో ఇదీ అదీ మాట్లాడి పంపించి వెయ్యండి. మరో విషయం ప్రభూ! మంత్రిగారు రాజీనామా చేశారని విన్నాను నిజమేనా? దానివల్ల నష్టం ఏముంది లెండి? ఆ పనులన్నీ చూడ్డానికి నేను లేనూ?....ముందుగతిలో వేచి వుంటాను మహారాజా! (ఐరావతం వెడుతూ వెడుతూ చిల్లరతో, రహస్యంగా) బావున్నావా? నిన్ను గురించి బ్రహ్మాండంగా చెప్పాను మహారాజుగారికి....

**చిల్లర:** మీ దయ. (రాజుతో) జయం జయం మహారాజా!

**రాజు:** నీక్కూడా నా చెవులతోనేనా పని?

**చిల్లర:** చిత్తం మహారాజా!

**రాజు:** నా చెవులింకో మూరెడు పొడుగుంటే బావుణ్ణు. ఆ చెవుల్ని మీ ఇద్దరి నోళ్లల్లో దోపి నేను హాయిగా నిద్రపోయి వుందును...విషయం ఏమిటో చెప్పు.

**చిల్లర:** మహాప్రభూ! మంత్రిగారు రాజీనామా ఇచ్చారు కదా? ఇచ్చివుంటే, వెంటనే ఆమోదించండి. ఆ పనులన్నీ చూడడానికి, మీ భృత్యుణ్ణి, నేను లేనా మహారాజా? కాని ఆ ఐరావతంతో తమరు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. అస్సలు నమ్మదగిని మనిషి కాదు....గోతులు తవ్వేరకం.

**రాజు:** వాకిట్లో ఆ గోల ఏమిటి?

**చిల్లర:** కళాకారులంతా మిమ్మల్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు మహాప్రభూ!

**రాజు:** ఎందుకు?

**చిల్లర:** నేను మీకు చూపించ బోయే వుత్తరం మీద మీరు సంతకం పెడుతున్నారు కనుక.

**రాజు:** ఆ వుత్తరంలో ఏముంది?

**చిల్లర:** మహాప్రభూ! పేదవాళ్లంటే మీకున్న జాలి, దయ ఈ దేశంలో ప్రతి ఒక్కడికీ తెలుసు. వాళ్ళను ఉద్ధరించి వాళ్ల జీవితాలను ఆనందమయం చెయ్యడమే మీ జీవిత ధ్యేయం. అవునా మహారాజా?

**రాజు:** అవును.

**చిల్లర:** అయితే, ఇదుగో వాళ్లను నిత్యమూ ఆనందంగా ఉంచే పథకం. సంతకం చెయ్యండి.

**రాజు:** ఆ పథకమేమిటో చెప్పు.

**చిల్లర:** చాలా తేలిక ప్రభూ! ప్రతి ఊళ్ళోనూ ఉన్న పేదవాళ్ళందర్నీ ఒక చోటకు చేర్చాలి.

**రాజు:** అప్పుడు వాళ్ళకు ఉపన్యాసం ఇవ్వాలి.

**చిల్లర:** కాదు మహాప్రభూ! మన దేశంలో ఉన్న అత్యున్నత కళాకారులందరూ అక్కడికి చేతుల్లో బుట్టల్తో వస్తారు. ఆ బుట్టలనిండా రొట్టెలు. ఆ పేదవాళ్ళముందు ఈ కళాకారులు రొట్టెలు తినడం మొదలుపెడతారు. "ఎంతబావుందో" అంటూ తింటూనే వుంటారు. పేదవాళ్లు కళాకారులంటే కోపంతో అరుస్తారు. తిడతారు. కళాకారులు మాత్రం తింటూనే వుంటారు. ప్రజలు తిట్టినా వాళ్ళ పని

చేసుకుపోవడం, పాపం, కళాకారులకి అలవాటే! జనం చూస్తూనే వున్నారు. చివరకు తెలుస్తుంది వాళ్ళకు ఆ రొట్టెలు మామూలు రొట్టెలు కాదు. అట్టముక్కల్తో చేసినవని. ఆ పేదవాళ్లు, ఇహ చూడండి, ఒకటే చప్పట్లు, నవ్వులు.

**రాజు:** ఆ పేదవాళ్ళు వీళ్ళు చేసిన పని చేసి నవ్వుతారంటావా?

**చిల్లర:** నవ్వుతారు మహారాజా. నేను చూశానుగా!

**రాజు:** నిజంగా నవ్వారంటావా?

**చిల్లర:** నిజం మహారాజా. నవ్వు ఆగక కొందరు పడిపోయారు. కొందరికి స్పృహ తప్పింది. కొందరు పడిపోయి మరి లేవలేదు. పేదవాళ్ళంతా అప్పుడే పిచ్చాసుపత్రి నుంచి తప్పించుకొచ్చిన వాళ్ళలా విరగబడి నవ్వడం....ఎందుకా అని నేను చూద్దును గదా – ఈ కళాకారులంతా అట్టరొట్టెలు తింటూ కనిపించారు.

**రాజు:** మంచి పథకం..నీ లాంటి అధికారులే రాజులకు ఊపిరి. ఏం తెలివితేటలు!

(వాకిట్లో గలాభా. సేవకుడు వస్తాడు)

**సేవ:** ప్రభూ! ప్రజలంతా ప్రాసాదం బయట చేరారు. మిమ్మల్ని చూసి తీరాలంటున్నారు.

(ఐరావతం వస్తాడు)

**ఐరా:** వాళ్ళంతా పౌరులు మహారాజా! మీరు దొంగతనం పర్మిట్ల మీద సంతాకాలు చేస్తున్నారని విని మీకు జయజయ ధ్వానాలు పలకడానికి వచ్చారు.

**చిల్లర:** కాదు మహారాజా! వాళ్లు కళాకారులు. మీరు ఈ పథకం మీద సంతకం పెడితే మీ కీర్తిగానం చెయ్యడానికి వచ్చారు.

(సేవకుడు బయటకు వెడతాడు)

**ఐరా:** బయట గుమిగూడింది పౌరులు.

**చిల్లర:** కాదు......వాళ్ళు కళాకారులు.

**ఐరా:** ఆ పథకం మీద సంతకం చేయించడానికి నువ్వెంత తీసుకున్నావో నాకు తెలియదనుకోకు.

(సేవకుడు మళ్ళీ పరిగెత్తుకుంటూ వస్తాడు)

**సేవ:** ప్రభూ! ప్రతి ఒక్కరూ విప్లవం వర్థిల్లాలి అని అరుస్తున్నారు.

**ఐరా:** ఈ కళాకారుల పథకం ఆమోదిస్తే పౌరులు ఊరుకోరు.

**చిల్లర:** దొంగతనానికి పర్మిట్లిస్తే మాత్రం ఊరుకుంటారా?

**ఐరా:** (చిల్లరతో) మనిద్దరికీ ఒకళ్ళ మీద ఒకళ్లకి పంతం ఏమిటి? రాజులకి రాచరికం ఉంటే అధికారుల చేతుతో అధికారం ఉంది. మనం – అధికారులం అందరం ఒక్కటే!

**రాజు:** ఏమిటీ అంటున్నావ్?

**ఐరా:** వాళ్ళు విప్లవం అని అరవడంతో కొంత అర్థం లేకపోలేదు, మహారాజా! దొంగతనాన్ని చట్టబద్ధం చెయ్యడం, కళ ద్వారా ఆనందాన్ని పంచడం – ఇవి విప్లవాత్మకమైన ఆలోచనలు. అందుకే ప్రజలు విప్లవం, విప్లవం – అంటున్నారు.

**రాజు:** మన మాజీ మంత్రి అక్కడ వున్నాడా?

**సేవ:** ఆయన ప్రజల్ని 'శాంతించండి' అంటున్నాడు. కాని ఆయన మాట ఎవరికీ వినపడడం లేదు.

(బయటి గోల ఎక్కువవుతుంది....'విప్లవం వర్ధిల్లాలి' అనే నినాదాలు)

**చిల్లర:** ఇది నిజంగా విప్లవమే! ఆ మంత్రే వెనకాల వుండి దీనిని నడిపిస్తున్నాడు...ఎవరక్కడా?

**సేవ:** చిత్తం ప్రభూ!

**చిల్లర:** పోలీసుల్ని పంపించండి...ఎవ్వరూ ఇక్కడ అరవకూడదు...ఎవ్వరూ విప్లవం అని ఎక్కడా అరవకూడదు. ఇది మహారాజుగారి ఆజ్ఞ.

**సేవ:** చిత్తం....అట్లాగే! (వెళ్ళబోతాడు)

**ఐరా:** ఎవరక్కడ?

**సేవ:** (తిరిగివస్తూ) చిత్తం ప్రభూ!

**ఐరా:** ఆ గోల చేసే వెధవల మీద సైన్యాన్ని పంపించండి. ఎదురు తిరిగిన వాణ్ణి కాల్చెయ్యండి.......ఇది రాజుగారి ఆజ్ఞ.

**సేవ:** చిత్తం...అట్లాగే!

(సేవకుడు వెడతాడు. ఇదివరకు బయటి గోలకు తోడుగా ఇప్పుడు కాల్చిన చప్పుళ్ళు...)

**చిల్లర:** మహరాజా! జనం నిజంగా మనమీదికి వస్తున్నట్టుగా ఉంది.

**ఐరా:** మహరాజా! మనం ఈ అల్లర్లను అణచలేం – అనిపిస్తోంది. ఇక్కణ్ణుంచి పారిపోవడం శ్రేయస్కరం.

(సేవకుడు వస్తాడు)

**సేవ:** దయచేసి బయటకు పోకండి. బయట గుంపులు గుంపులుగా జనం. మిమ్మల్ని చూడకుండా అక్కడ నుంచి కదలం – అంటున్నారు.

**రాజు:** నన్ను చూడాలా? నేను పొద్దుట్నుంచీ మొహం కూడా కడుక్కులేదు. వాళ్ళకీ మొహం చూపించను?

**సేవ:** వాళ్ళు మాత్రం మిమ్మల్ని చూడకుండా వెళ్ళరు మహారాజా......అది మాత్రం నిజం.

**రాజు:** అయితే సరే! నా ప్రజలు నా మొహాన్ని చూడాలని పట్టుబడితే, నేను చెయ్యగలిగిందేముంది? అయితే నేను పొద్దున్నే కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత కాళ్లు కడుక్కున్నాను. వాళ్ళకు నా కాళ్ళు చూపించవచ్చా?

**ఐరా:** అవి చాలు మహారాజా.

**చిల్లర:** అట్లా కుదరదు మహారాజా.

**ఐరా:** చాలు మహారాజా.

**చిల్లర:** కుదరదు మహారాజా.

**ఐరా:** చూడు....నీకు అనుభవం తక్కువ....పై అధికారుల్ని గౌరవించడం నేర్చుకో......

**చిల్లర:** అనుభవమా? గాడిదక్కూడా అనుభవం ఉండొచ్చు.

**ఐరా:** ఎవర్ని నువ్వు గాడిద అంటోంది? మీ నాన్న గాడిద, మీ అమ్మ ఇంకో గాడిద....

**చిల్లర:** మీ తాత, మీ మామ్మ – అంతా గాడిదలే..

**రాజు:** (చిరకుగా) కుక్కల్లా ఏమిటా కొట్లాట?

(ఇద్దరూ నిశ్శబ్దం)

**ఐరా:** అసలు మీరు ఒక్క కాలు చూపిస్తే చాలు ప్రభూ!

**చిల్లర:** అట్లా వీల్లేదు ప్రభూ! అంత భక్తితో ప్రజలు కోరుకుంటూ వుంటే – కనీసం రెండు కాళ్ళయినా వాళ్ళకు చూపించాలి.

**రాజు:** నాకు మరో రెండు కాళ్ళు ఎట్లాగూ లేవు కనుక, ఈ రెండు కాళ్ళతోనే వాళ్ళు సర్దుకుపోవాలి.

(ఇద్దరూ అధికారుల మీద చెరో చెయ్యి వేసి కిటికీ లోనుంచి కాళ్ళు రెండూ బయట పెడతాడు రాజు. వాకిట్లో గలాటా ఆగలేదు....రాజు సేవకుడితో)

వెళ్ళి నా ప్రజలతో చెప్పు. నా మొహం బాగులేదు. ఇవ్వాల్టికి నా కాళ్ళతో సర్దుకు పొమ్మని.

(సేవకుడు వెడతాడు)

**రాజు:** నా పాదాలు తడుస్తున్నాయే.

**చిల్లర:** మీ పాదాలను భక్తితో కడుగుతున్నారు ప్రభూ ప్రజలు.......

**రాజు:** ఆ నీళ్ళు వెచ్చగా ఉన్నాయి...కొంపదీసి వాళ్ళు (కుడిచేతి బొటనవేలు చూపుతాడు....గలాభా తగ్గలేదు. పాదాలను కొడుతున్న చప్పుడు)

అయ్యో! నా పాదాలనెవరో చితక బాదుతున్నారు. అమ్మో.....అయ్యో!...వాటిని లోపలకి లాగండి.... తొందరగా, తొందరగా –

**చిల్లర:** ప్రభుత్వం ఆర్డర్లు లేకుండా ఆ కాళ్లను లోపలకు లాగడం నేరం కాదా ప్రభూ?

**రాజు:** నీ ఆర్డరు దొంగలు తోలా? నేను చెబుతున్నాను కదర్రా!

**ఐరా:** ఈయన ప్రతిదానికీ ఏదో అడ్డుపుల్ల వేస్తాడు...ముందు అతనికి నచ్చ చెప్పండి...

**రాజు:** అయ్యో! వాళ్లు కాళ్లను అటుపట్టుకు లాగుతున్నారు...నా కాళ్ళు...అయ్యో....అవి ఊడిపోతాయి ఇవ్వాళ.

**ఐరా:** ప్రభుత్వం ఆర్డరు సంగతి నేను చూసుకుంటాను....లాగు...మీ కాళ్ళు ఊడిపోయినా సరే మేము వదలం మహారాజా! ఆ! ఇంకా గట్టిగా!

(రాజును అటూ ఇటూ లాగుతారు..ఎవ్వరూ వదలండం లేదు. ఇంతలో పరిగెత్తుకుంటూ శివ వస్తాడు)

**శివ:** మహారాజా! మీరు నాకొక్క అవకాశం ఇస్తే ఈ జనాన్ని ఒక్క నిముషంలో పారిపోయేటట్లు చేస్తాను.

**రాజు:** నువ్వేం చెయ్యగలవో చెయ్యి.....తొందరగా –

**శివ:** డింగ్‌డాంగ్.....(వాకిట్లో భయంకరమైన అరుపు) డింగ్‌డాంగ్! రాజుగారిని ఆయన ఎటువంటి వాడయినా రక్షించడం మన కర్తవ్యం కాదా? (మళ్ళీ ఓండ్రపెడుతుంది) అయితే, బయటవున్న జనాన్ని తన్ని ఇక్కడ లేకుండా చెయ్యి.

(వాకిట్లో నుంచి వినిపించే గలాటాలో ఇప్పుడు మార్పులు. గాడిద అరుపులు చాలా భయంకరంగా వినిపిస్తాయి. జనం అరుపులు, మొత్తుకోవడాలు.....కాసేపట్లో రాజుగారి కాళ్ళు ఇవతల వచ్చి పడ్డాయి. రాజు, మిగిలినవాళ్ళు కిటికీ లోనుంచి బయటకు చూస్తూ గాడిద గొప్పతనాన్ని మెచ్చుకుంటూ వుంటారు)

**రాజు:** అరె! ఇది దేవతా గుర్రం కాదు గదా?

**చిల్లర:** చూడండి జనాన్ని ఎట్లా తంతూ, తరుముతోందో? ఇది దేవతా గాడిద ప్రభూ?

**ఐరా:** ఇంగ్లండు మహారాణి దగ్గర ఇటువంటివి నాలుగున్నాయి మహారాజా!

**చిల్లర:** జనం ఎట్లా పారిపోయారో చూడండి...అయినా వాళ్ళను వెంటాడి వెంటాడి తంతున్నది గాడిద.

**ఐరా:** భలేగాడిద! ఏం పేరు! డింగ్‌డాంగ్!

**రాజు:** డింగ్‌డాంగ్!

**ఐరా:** ఆ గాడిద వెంటవున్న కుర్రాడిని రప్పించింది నేను ప్రభూ!

**రాజు:** డింగ్‌డాంగ్.

**చిల్లర:** ఆ గాడిద కుర్రాడు మా ఇంట్లోనే పనిచేస్తాడు మహారాజా!

**రాజు:** డింగ్‌డాంగ్! బ్రహ్మాండం!!...నీ పేరేమిటి అబ్బాయ్?

**శివ:** శివ....మేం బాగా పేదవాళ్ళం ప్రభూ! మీరేదన్నా పని ఇప్పిస్తే మీ కొలువులో బతుకుతాం మహారజా!

**ఐరా:** తప్పకుండా....దేశీయ జంతు రక్షక సమితికి ఇతడిని అధ్యక్షుడుగా వెయ్యండి ప్రభూ!

**చిల్లర:** కాదు ప్రభూ! ఆంతరంగికి ప్రాసాద జంతు పోషక సంస్థకి మేనేజింగ్ డైరెక్టర్‌ని చెయ్యండి ప్రభూ!

**రాజు:** శివా! నీ డింగ్‌డాంగ్ ఎక్కడవుందో తీసుకురా.....

(శివ వాకిట్లోకి వెళ్లి డింగ్‌డాంగ్‌తో వస్తాడు. గాడిను చూసి అందరూ ఆశ్చర్యపోతారు)

**రాజు:** అద్భుతం! ఎంత అందంగా వుంది! దాని కాళ్ళు, దాని చెవులు!! నా క్కూడా అటువంటి చెవులుంటే ఎంత బాగుండును!

**ఐరా:** నాకు డింగ్‌డాంగ్‌లా నాలుగు కాళ్ళుంటే ఎంత బాగుండును!

**చిల్లర:** నేను శనివారానికి బదులు ఆదివారం పుట్టివుంటే డింగ్‌డాంగ్‌లా పుట్టేవాణ్ణి.

**రాజు:** అందరూ వినండి.....ఇవ్వాళ్ళినుంచి ఈ దేశానికి ప్రధాన మంత్రి –

**ఐరా:** ప్రధాన మంత్రి శివన్నకూ –

**రాజు తప్ప మిగిలిన వాళ్ళు:** జిందాబాద్.....జిందాబాద్......

**రాజు:** సరిగ్గా వినండి....ఇవ్వాళ్ళినుంచి ఈ దేశానికి ముఖ్యమంత్రి – శివన్న కాదు – డింగ్‌డాంగ్ –

**ఐరా:** ప్రభూ!

**రాజు:** మనల్ని రక్షించే కండబలం ఉన్నవాడే ప్రధాన మంత్రి! అందరూ అనండి – డింగ్‌డాంగ్ –

**అందరూ:** జిందాబాద్ (మూడుసార్లు అంటారు)

**రాజు:** డింగ్‌డాంగ్ ప్రధానమంత్రి....శివ ఆయన పి.ఏ. శివా! విను....ప్రధాన మంత్రిని జాగ్రత్తగా చూసుకోవాలి. ఆయన కోరికల్ని మాకు చెబుతూ వుండాలి. మా తోటలోని ప్రాసాదంలో ఉంటారు మీరు. సేవకా! వీళ్లను తోటలోని మా ప్రాసాదంలోనికి తీసుకుపోయి, అన్ని సౌకర్యాలు ఉండేట్లు చూడు.

**మంత్రి:** ఇప్పుడు మన పంట పండినట్లే! డింగ్‌డాంగ్‌గారి పేరు మీద విదేశాల నుంచి ఏం తెచ్చినా కస్టమ్స్ వాళ్ళు ......పేరుమీద పట్టుకోడానికి వీలులేదు. దాణాకోసం ఎంత ఖర్చు చేసినా ప్రభుత్వం ఏం అనడానికి వీలులేదు – ఇటువంటి రాజులుండాలి గాని ఛాన్సంటే మాలాంటి అధికారుల్దే!

(రాజు లోపలకు వెడతాడు. ఆంతరంగికి మంత్రి రాజుగారి ఆజ్ఞల్ని వినిపిస్తూ వుంటాడు. ఐరావతం, చిల్లర – రాసుకుంటూ వుంటారు)

**మంత్రి:** (ఎ) ఈనాటి నుంచి ఎవ్వరూ డింగ్‌డాంగ్ సార్‌ని గాడిద అనకూడదు. వారిని విమర్శించకూడదు. మనసులో కాని, బయటకు గాని ఎవరైనా అందుకు పాల్పడితే వారిని ఆరునెలలు కారాగార శిక్ష. పదివేల రూపాయలు జరిమానా. ఇప్పటినుంచి ఒకరినొకరు పరామర్శించుకోనేటప్పుడు...పరస్పరం డింగ్‌డాంగ్, డింగ్‌డాంగ్ అనుకోవాలని ప్రభువుల ఆజ్ఞ.

(బి) అమాత్యా డింగ్‌డాంగ్ సార్ గారు మహారాజుల్ని తిరుగుబాటు దారుల్నించి ఏ విధంగా రక్షించారో మీ కందరికీ తెలుసు. డింగ్‌డాంగ్ సార్‌గారి గౌరవార్థం విడుదల చేస్తున్న ప్రత్యేక తపాలా బిళ్ళను ప్రతివారూ కొనసాగవలసిందిగా ఆజ్ఞ.

(సి) ఆస్ట్రేలియా నుంచి గడ్డి, అమెరికానుంచి పత్తి విత్తులు, నూనె గింజలూ, చైనా నుంచి ఇంగ్లండు నుంచి చిత్తు కాగితాలు – శ్రీవారి నిమిత్తం దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. ఇందుకుగాను ఇవ్వాళ నుంచి తల ఒక్కింటికీ రూ॥1 చొప్పున గడ్డి పన్నును ప్రభుత్వ ఖజానాకు జమకట్టవలసిందిగా మహరాజుగారి ఆజ్ఞ....అయిపోయింది.

**చిల్లర:** ఆస్ట్రేలియా, అమెరికా, ఇంగ్లండు – ఇహ గడ్డిపేరు చెప్పి బంగారు గడ్డి దిగుమతి చేసుకోవచ్చు – ఆహా! ఏమి నా భాగ్యము!! ఆ, అన్నట్టు – శివన్నగారూ! మాహామంత్రులవారికి రాత్రికి అవసరాలేమిటో అదే! అమాత్యుల వారికి వివాహం –

**శివ:** కాలేదు.

**మంత్రి:** అయితే, స్నేహితురాళ్ళ నేమన్నా –

**శివ:** అంటే?

**మంత్రి:** అదేనయ్యా! నా ఎవరికలో రెండు ఆడగాడిదలు ఉన్నాయి. పుష్టిగా ఉంటాయి....జబ్బు లేమీ లేవని డాక్టర్లు ఖరారు పత్రం ఉంది...దాన్లో ఏదో ఒకదాన్ని మీరు ఒప్పుకుంటే, మీకూ లాభం, మాకూ లాభం. మీకెంత శాతం కావాలో చెప్పండి....ప్రభువుల వారి నుంచి ఆమోదం తెప్పించే భారం నాది...మీకు అది ఇష్టం లేదనుకోండి. ఓ మంచి ఆడగుర్రం ఉంది. ఇంకా కన్య....మీరు పరీక్ష చేసుకోండి. ఫిఫ్టీ – ఫిఫ్టీ.....మంత్రాలయా బార్‌కి సాయంకాలం రండి....అక్కడ నిర్ణయం చేద్దాం.

(వెడతాడు)

**ఐరా:** డింగ్‌డాంగ్, శివన్నా!

**శివ:** డింగ్‌డాంగ్, సార్......

**ఐరా:** నిజం చెప్పాలంటే – ఇట్లా ఆడగాడిదలకి ఆడగుర్రాలని మహామంత్రులవారి దగ్గరకు పంపించడం చాలా అవమానం. రేపు రాజుగారి ప్రతిష్ట ఏం కాను? ఆ మాటకొస్తే మన ప్రతిష్ట? నువ్వు కనుక ఒప్పుకుంటే అందమైన అమ్మాయిలే అమాత్యుల వారితో స్నేహానికి ఉరకలు వేస్తూ ముందుకు వస్తారు. వాళ్ళకి కబురు చెయ్యనా?..ఆలోచించుకుని మరీ చెబుదురు గాని. సాయంకాలం బాలాజీ బార్‌కి రండి.

(వెళ్ళిపోతాడు)

## ఆరో రంగం

(వినాయకుడి గుడి...సాంబ, చేతిలో ఒక వార్తా పత్రికను పట్టుకుని, పాడుకుంటూ లోపలకు వస్తాడు. ఒక మూల ఎవరో ఒకాయన తాగుతూ వున్నాడు. సాంబ ఆయన్ని గమనించడు)

**సాంబ:** నందామయా గురుడ నందామయా
ఈ సాంబయ్య చెప్పేది వినుకోండయా ॥
రోజులే మారాయి, రాజ్యాలు మారాయి
ఇనుము నీళ్ళలో తేలె, బెరడు నీటిలో మునిగె
ఎటు చూసినా, విన్న డింగ్‌డాంగు మహిమలే ॥
ఆడోళ్ళు మగవోళ్ళు ప్రతివోడు గాడిదై
నాల్గుకాళ్ళతో కదను తొక్కేనయా ॥
దేవుళ్ళ బొమ్మల్ని గాడ్ది తోకకు కట్టి
మూడు సార్లు తిరిగి మురిసే రయా
అందరూ ఒక భజనె అందరూ ఒక కొలుపె
డింగ్‌డాంగ్ దేవుడని సాంష్టాంగ పడతారు ॥

నందామయా గురుడ నందామయా
ఈ సాంబయ్య చెప్పేది వినుకోండయా ॥

ఇక్కడి జనం నిజంగా పిచ్చ మూక. ఏ పేపరైనా చూడండి. పతాక శీర్షికల్లో డింగ్‌డాంగ్ వార్తలే! ఎవరితోనన్నా మాట్లాడితే, డింగ్‌డింగ్ మాటలే. ఇవ్వాళ పేపర్లో వార్తలున్నాయోమో చూద్దాం....రాష్ట్రపతి రోడ్ మీద డింగ్‌డింగ్ శిలావిగ్రహం..ఆడగాడిదల అక్రమ రవాణా...డింగ్‌డాంగ్ ఫాన్స్ అసోసియేషన్ వారిచే రక్తదానం...గడ్డి పన్ను ఎక్కువ చేయడానికి రాజుగారి నిర్ణయం. ప్రజల హర్షామోదం.... ఇదేమిటి? వినియోగదారులకు హెచ్చరిక:

డింగ్‌డింగ్ టాల్కమ్‌కు పౌడర్ పేరుతో పలు సంస్థలు పౌడరును తయారు చేసి అమ్మడం మీ దృష్టికి వచ్చివుంటుంది. ప్రభుత్వ సంస్థ ఒక్కడే ఆ పౌడరును సరాసరి డింగ్‌డింగ్ గారు వేసిన పేడతోనే తయారు చేస్తుంది. మిగిలినవన్నీ ప్రజల్ని మోసం చేస్తూ మామూలు జంతువులు వేసే పదార్థాలను వాడుతున్నారు. ప్రజలు జాగురూకులై అసలు సిసలైన ప్రభుత్వం డింగ్‌డింగ్ టాల్కమ్ పౌడరునే వాడాలని ప్రభుత్వ ప్రతినిధి హెచ్చరిస్తున్నారు.

**భైర:** అందులో గొప్పేముంది? కాలేజీ అమ్మాయిలు డింగ్‌డాంగ్‌కు ప్రేమ లేఖలు వ్రాస్తున్నారు, తెలుసా?

**సాంబ:** (తనలో) చూడండి. ఒక్కడే కూర్చుని తాగుతున్నాడు. ఇతన్నెక్కడో చూసినట్టుందే?

**భైర:** ఒక అమ్మాయి ఏమని రాశిందో తెలుసా? తాను డింగ్‌డాంగ్‌తో కలిసి డిస్కో డాన్సు చేసినట్లు కలగన్నదట!

**సాంబ:** అది బాగానే వుంది. కాని డాన్సు చేసేటప్పుడు డింగ్‌డాంగ్‌కు రెండు కాళ్ళు మాయం అయ్యాయా? ఆ అమ్మాయికి మరో రెండు కాళ్ళు మొలిచాయా?

**భైర:** పోనీ కలల సంగతి వదిలెయ్య. బజార్లో నూనె గింజలు, పశువుల దాణా ఎంత ఖరీదయినయ్యో నీకేమైనా తెలుసా?

**సాంబ:** జనం నూనె గింజలు తినడం మొదలెడితే!

**భైర:** హోటల్లో నూనెగింజల ప్లేటు పదిరూపాయలు!

**సాంబ:** కూరలేకుండా ఒట్టి రొట్టె తినేవాళ్ళను చూశాం....కాని కాయగూరలు, పచ్చళ్ళు దొరికే చోట నూనె గింజలు తినడమేమిటో?

**భైర:** అది భోజనం కాదని వాళ్ళకే చెప్పాను....కాని జీవితంలో నెగ్గుకు రావడానికి అదొక్కటే మార్గం అంటున్నారు వాళ్లు.......పేరున్న నాయకుడేం చేస్తే మనమూ అదే చెయ్యాలట!

**సాంబ:** వాళ్ళకి సరైన సలహా చెప్పేవాళ్ళు ఎవరూ లేరా?

**భైర:** లేకేం? మాలో ఒక పండితుడున్నాడు. ఆయనకెప్పుడూ పుస్తకాల గోలే! అన్నం, పచ్చడి, కూర – వీటిని గురించి అసలు మాట్లాడడు. ఆయన అన్నమేమో ఎలికలు తిని బలుస్తున్నాయి. ఆయనేమో ఎండిన కర్రపుల్లలా సన్నగా అయిపోతున్నాడు.

**సాంబ:** భలేగా మాట్లాడతావే! నిన్ను చూస్తే రాత్రి నాకు కలలో కనిపించిన చేపపిల్ల జ్ఞాపకం వస్తున్నది.

**భైర:** చేపపిల్ల కనిపించడమేమిటి?

**సాంబ:** అది కల......మరిచిపో....నువ్వు తాగుతున్నావు...మరో మనిషి ఎదురుగుండా ఉంటే అతన్ని కూడా తాగమని అడగాలని నీకు తెలియదా?

**భైర:** ఏమిటి ప్రతిదానికీ ఉపన్యాసాలు చెబుతావ్? అది రాజాకీయ నాయకులకే చెల్లు........నువ్వు బల్ల గుద్ది మాట్లాడావనుకో! నువ్వు ప్రభుత్వ రాజకీయవాదివన్నమాట! మా పండితుల వారు గాలితో యుద్ధం చేస్తూ మాట్లాడతాడు.

**సాంబ:** సరే, సరే! ఇప్పుడు నీతో యుద్ధం చెయ్యడం కుదరదు. నిన్ను ఇంద్రుడు, చంద్రుడు అనాలి. లేకపోతే నాకా కాస్తా దాహం ఇవ్వవు.

**భైర:** ఇప్పుడూ ఇవ్వను...నీకు కలలో కనిపించిన చేపను గురించి చెప్పు, ఇస్తాను.

**సాంబ:** అది చెప్పాలంటే నేను తాగాలి.

**భైర:** చివరికి నువ్వు కూడా మా నాయకుడిలాగే మాట్లాడుతున్నావు. (ఏడుస్తాడు)

**సాంబ:** ఏమైంది? ఎందుకేడుస్తున్నావ్?

**భైర:** ఏముంది? మా నాయకుడు తాగితే ఇహ నన్ను మాట్లాడనివ్వడు. తనే అంతా మాట్లాడి మైకంతో పడిపోతాడు.

**సాంబ:** నేను తాగినా నిన్ను మాట్లాడనిస్తాను...దేన్ని గురించి మాట్లాడుతావ్?

**భైర:** ఈ నగరాన్ని గురించి, ఈ దేశాన్ని గురించి.

**సాంబ:** నాకో చుక్కపోయ్........తరవాత వింటాను.

**భైర:** సరే!

**సాంబ:** ఇప్పుడు చెప్పు, ఈ నగరాన్ని గురించి, ఈ దేశాన్ని గురించి నీ అభిప్రాయం...

**భైర:** ఈ నగరం ఓ పెద్దమురికి గుంట. ఒకప్పుడు ఇది నదే! ఇప్పుడు దాని చుట్టూ కట్టలు కట్టి ఒక

తటాకాన్ని చేశారు. దాని చుట్టూ అడవి వుంది. ఒకప్పుడు అడవి అంటే గుబురుగా, దట్టంగా అల్లుకుపోయిన చెట్లు. ఇప్పుడో ముళ్ళ కంచెలు, దుబ్బులు – అదీ అడవి. ఆ ముళ్ళ చెట్లకి పళ్ళ ఉన్నాయి. నువ్వు వాటిని తినదలుచుకున్నావా? దగ్గరికి పో. నీకు పళ్ళు కనిపించవు.. కంకాళాలు కనిపిస్తాయి. మానవ కంకాళాలు...

**సాంబ:** నువ్వు నాకు వచ్చిన కలలో మొదటి భాగాన్నే చెప్పావు. నువ్వు వెళ్లి పోయాక ఆ కంకాళాలు నేనూ చూశాను. నేను వెళ్ళేసరికి అవి నవ్వుతూ కేరింతలు కొట్టసాగాయి. ఎందుకా అని చుట్టూ చూశాను. ఒక స్థూలకాయుడు ఒడ్డున కూచుని ఒక్కొక్క చేపని పట్టుకుని నోట్లో వేసుకుని మింగుతున్నాడు. నేను కూడా ఒక చేపపిల్లను పట్టుకున్నాను. దాన్ని మేజామీద పెట్టాను, కోద్దామని. అది పాడడం మొదలు పెట్టింది.

నా ప్రాణం కాపాడు. నీకు చందమామ నందిస్తాను

నా కోరిక కాదనకు ఈ కట్టల్ని ఛేదించు – ఈ ఊచకోతనాపు – అని పలికింది.

**భైర:** తరువాత?

**సాంబ:** అప్పటి దాకా దాని కళ్ళు చూడలేదు....చూశాక, నాకు భయం వేసింది. మెళకువ వచ్చింది. ఆ చేపకళ్లు అచ్చు నీ కళ్ళలా వున్నాయి.

**భైర:** అప్పుడే నీకు మెళకువ రాకుండా ఉండాల్సింది.

**సాంబ:** అడ్డకట్టను పార, పలుగు తీసుకుని తొలిగించమని చేపపిల్ల చెబితే, నేను తప్పకుండా దాన్ని తీసేస్తాను. ఎందుకో తెలుసా? చేపపిల్ల ఏడవడం నేను భరించలేను.

**భైర:** ఆ పని నువ్వు ఒక్కడివే చెయ్యలేవు. పార, పలుగు పక్కనే పెట్టుకుని నిద్రపోతూ ఉంటాను నేను. నన్ను కూడా పిలు.

**సాంబ:** నిన్నేమని పిలవాలి?

**భైర:** భైరయ్యా – అను. ఇంకా కొంచెం తాగు. హాయిగా నిద్రపో. మళ్ళీ అదే కల కను...నేను తొందరలోనే నిన్ను కలుస్తాను.

**సాంబ:** ఎక్కడికి వెడుతున్నావ్, తమ్ముడూ?

**భైర:** పార, పలుగు తేవడానికి...నా మనస్సులో ఒక బీజాన్ని నాటావు...నీకు అది కేవలం విత్తనమే కావచ్చు. కాని దానికి వచ్చే పండును నేనప్పుడే చూస్తున్నాను.
నీకు చందమామనిస్తాను
ఈ కట్టల్ని ఛేదించు –
ఈ ఊచకోతనాపు

## ఏడో రంగం

(రాజప్రాసాదంలో రాజు – ఆంతరంగిక మంత్రి)

**రాజు:** ఎందుకు అంత సంతోషంగా ఉన్నావు?

**మంత్రి:** ఏడవడానికి కారణం లేదు ప్రభూ!

**రాజు:** ఎన్ని కారణాలు కావాలి? ఓ వంద? ఓ వెయ్యి?

**మంత్రి:** రెండు కారణాలు చెప్పండి మహారాజా! చాలు –

**రాజు:** నోరుమూసుకో. నీలాంటి అసమర్థులు ఉండడం వల్ల ఇటువంటివన్నీ జరుగుతున్నాయి. (మంత్రి చేతని నోటికి అడ్డంపెట్టుకున్నాడు) నాకు కోపం రావచ్చునో రాకూడదో చెప్పు.

**మంత్రి:** నా నోరు మూసుకోమన్నారుగా!

**రాజు:** ఫరవాలేదు. నోరు మూసుకునే మాట్లాడు.

**మంత్రి:** ఏం చెప్పమంటారు?

**రాజు:** నాకు కోపం రావచ్చా, రాకూడదా?

**మంత్రి:** వచ్చింది కదా, మహారాజా.

**రాజు:** నా కోపానికి కారణం వుంది...ఒకటి కాదు, రెండు.

**మంత్రి:** ఏమిటి?

**రాజు:** ఆ డింగ్‌డాంగ్, నన్ను రక్షించాడు కదా అని, ప్రధాన మంత్రిని చేశానా? ఇప్పుడీ దేశం మొత్తం మీద అతని కీర్తిని చూడు....ప్రతివాడూ అతన్ని గురించి మాట్లాడ్డమే! అతన్ని గురించి పాటలే...అతని మీద భక్తిగీతాలు! మహారాజు సంగతే తలుచుకోవడం లేదు.....ఇది చాలదూ నా ఒక కోపానికి?

**మంత్రి:** అయ్యో! తప్పకుండా? ....మరి రెండో కోపం?

**రాజు:** నువ్వా అడుగుతున్నావ్? ఆ అమ్మాయిని తీసుకొస్తానన్నావ్! ఎక్కడ ఆ అమ్మాయి? ఎంత కాలం వేచి వుండడం? నాకు కోపం రాకూడదా?

**మంత్రి:** మీకు కోపం రావడం చాలా సహజం మహారాజా! కాని మీరు దయామయులు. రోజు మాదిరిగానే మీ చెవల్ని ఇటు పారేస్తే, ఈ రెండు విషయాలలోను మిమ్మల్ని ఆనందపరుస్తానని చెప్పగలను.

**రాజు:** చెప్పు.

**మంత్రి:** మహారాజా! డింగ్‌డాంగ్ గారు ఇప్పుడు తళతళా మెరుస్తున్న నక్షత్రంలా వెలిగిపోతున్నారు. మేధావుల మస్తిష్కాల్లో, అమ్మాయిల హృదయాల్లో, వృద్ధులు కళ్ళల్లో, మన దేశ వినీలాకాశంలో –

**రాజు:** అవును.

**మంత్రి:** మహారాజా! మగవాళ్ళ తళుకులన్నీ ఎప్పుడు ఆరిపోవడం మొదలుపెడతాయ్?

**రాజు:** ఎప్పుడు?

**మంత్రి:** వాళ్లకి పెళ్లిళ్ళు కాగానే! డింగ్‌డాంగ్ సార్‌కి పెళ్ళి చేసెయ్యండి.

**రాజు:** బ్రహ్మాండం....నువ్వు కూడా మేధావివి అయిపోతున్నావ్....నా మూలనేననుకో – ఎవరక్కడ?

**సేవ:** (వస్తూ) ఆజ్ఞ?

**రాజు:** ఐరావతాన్ని రమ్మని చెప్పు.

**సేవ:** తమ ఆజ్ఞ ప్రభూ! (వెడతాడు)

**రాజు:** ఆంతరంగిక మంత్రీ! డింగ్‌డాంగ్‌కి పెళ్ళి చేసేద్దాం...కాని గాడిదతో కాదు. ఒక మంచి అందమైన పిల్లతో...ఎంత చేసినా డింగ్‌డాంగ్ గాడిదేగా? పేరుకు అతనికి భార్య అయినా, చివరకు ఆ పిల్ల నాదే

అవుతుందిగా? ఎట్లా వుంది నా పన్నాగం?

**మంత్రి:** అద్భుతం మహారాజా, అద్భుతం.

**ఐరా:** (వస్తూ) నన్ను పిలిపించారా మహారాజా?

**రాజు:** ఐరావతం! మన అమాత్యులు డింగ్‌డాంగ్ గారికి త్వరలో పెళ్ళిచేయాలని నిర్ణయించాం...పూర్వకాలం ఎవరికి కావలసిన వరుడ్ని వాళ్ళే ఎన్నుకునే వాళ్ళే! స్వయంవరం...అలా! వాళ్ళ వాళ్ళ అమ్మాయిలను తీసుకు రాదలుచుకున్న వాళ్ళందరూ తీసుకురావచ్చు. కాని నిర్ణయం మాత్రం అమాత్యుల వారిదే! అర్థం అయిందా?

**ఐరా:** చిత్తం. కాని మహామంత్రుల వారి విషయంలో ఇది స్వయంవరం కాదు మహాప్రభూ! వారు వధువును ఎన్నుకుంటారు కనుక దీనిని "స్వయంవధు" అనవచ్చు.

**రాజు:** బాగానే వుంది. రాజ్యమంతా ప్రకటించు. డింగ్‌డాంగ్ వారి స్వయంవధూత్సవం త్వరలో జరుగుతుందని.

**ఐరా:** అట్లాగే మహారాజా! (వెడతాడు)

**రాజు:** మంత్రీ! డింగ్‌డాంగ్ వ్యవహారం ముగిసింది. తలలో వున్న కోపం తొలిగిపోయింది. ఇహ రెండోది.

**మంత్రి:** ఆ రెండో కోపానికి అవసరం లేనే లేదు మహాప్రభూ!

**రాజు:** అంటే?

**మంత్రి:** మీరు చెప్పిన అమ్మాయిని చూశాను ప్రభూ!

**రాజు:** స్వయంగా, నీ కళ్ళతోనే?

**మంత్రి:** స్వయంగా, నా కళ్ళతోనే.

**రాజు:** ఎట్లావుంది?

**మంత్రి:** అడగాలా ప్రభూ?..ఓ బొమ్మ అనుకోండి....బంగారు బొమ్మ.

**రాజు:** గుండె ఆగిపోయేటంత అందంగా లేదూ?

**మంత్రి:** అంత అందం ప్రపంచంలో దొరకడమే దుర్లభం ప్రభూ! ఆ అమ్మాయి కళ్ళు మల్లెలు; చెవులు చంపకాలు; పెదిమలు –

**రాజు:** అంత అందంగా ఉన్నదంటావా?

**మంత్రి:** మేం ఏం మాట్లాడామో చెప్పమంటారా?

**రాజు:** నన్ను గురించే అయివుంటుంది. ఆ అమ్మాయి ఏమన్నది?

**మంత్రి:** మా రాజుగారు – ఎంత మంచివారు, ఎంత హుందాతనం, ఎంత వీరత్వం, ఎంత శృంగారం –

**రాజు:** ఇవన్నీ ఆ అమ్మాయే అన్నదా?

**మంత్రి:** కాదు, నేను.

**రాజు:** ఆ అమ్మాయి ఏమంది?

**మంత్రి:** విన్నది.

**రాజు:** ఆ తరువాత?

**మంత్రి:** ఆగండి, మహారాజా!..దానికే వస్తున్నా.....ఆ అమ్మాయి మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నది.

**రాజు:** గాఢంగా?..ఆ అమ్మాయి నా వయసు గురించి ఏమన్నా చెప్పిందా?

**మంత్రి:** మిమ్మల్ని చూస్తే ఇంకా పెళ్లి వయసు రాలేదనుకుంటారు.

**రాజు:** అంతేనంటావా? అట్లాకనిపిస్తానా నేను?

**మంత్రి:** మిమ్మల్ని చూస్తుంటే మీకు ఏ ఇరవై ఏళ్ళో, పదిహేనేళ్ళో అనిపిస్తుంది.

**రాజు:** వాళ్ళ అమ్మా, నాన్నా ఇది వరహీనం అనుకోవడం లేదు కదా?

**మంత్రి:** ఏమీ అనుకోవడం లేదు. నిజం చెప్పమంటారా? ఆ మొత్తం కుటుంబానికి వయసు మళ్లిన వాళ్ళంటేనే ఇష్టం అనితోస్తుంది....అక్కడ షారుక్‌ఖాన్, సన్నిడియోలు కనిపించరు. జనకుడు, భీష్ముడు, గాంధీ, టాల్‌స్టాయ్, వ్యాసుడు, దుర్వాసుడు – వీళ్ళ బొమ్మలు కనిపిస్తాయి. అందరూ పెద్దవయసు జనం –

**రాజు:** నిజంగా? దానివల్ల వాళ్ళెంతటి సంస్కారవంతులో తెలుస్తున్నది.

**మంత్రి:** నేను ఆడదానిగా పుట్టినా అంతే! నేను నా వయసు అబ్బాయిల వంక కూడా చూసేదాన్ని కాదు. మీలాంటి పెద్దవాళ్ళనే కోరుకునేదాన్ని.

**రాజు:** నిజమే! ఆ కాలం అమ్మాయిలు తమ ఈడు అబ్బాయిలంటే ఎందుకంత పడిచచ్చిపోతారో అర్థమై ఏడవదు.

**మంత్రి:** అయినా మీకేం, మహారాజా! మీ ఠీవి, మీరు కూర్చునే పద్ధతి, లేచే పద్ధతి (రాజు ఒక్కక్కటే చూపుతూ వుంటాడు..లేవబోతూ కాలు తిమ్మిరెక్కి పడతాడు) మీరు పడిపోయే పద్ధతి – మీలో అసలు లోపాలు చూడగలమా?

**రాజు:** ఏదో అప్పుడప్పుడూ కాస్త ఆస్మా తప్ప.

**మంత్రి:** అదేముందండీ. పైగా ఆస్మా వచ్చినప్పుడు మీరెంత అందంగా ఉంటారండి?

**రాజు:** అ అమ్మాయి పేరేమిటి?

**మంత్రి:** బంగారి.

**రాజు:** ఎంత బంగారం లాంటి పేరు....ఇంతకీ ఎప్పుడొస్తుంది?

**మంత్రి:** ఇప్పుడే.

**రాజు:** ఇప్పుడొద్దు, ఇప్పుడొద్దు...ముందు రాజవైద్యుణ్ణి పిలిపించు.

**మంత్రి:** మీ ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉంది మహారాజా!

**రాజు:** నేను ఆరోగ్యంగానే ఉన్నాను. కాని కొన్ని భాగాల్లో ఇంకొంచెం ఆరోగ్యంగా ఉండాలని నా కోరిక... రేపు రాత్రికి పెట్టుకుందాం ఈ కార్యక్రమాలు. రహదారి బంగళాలో ఏర్పాటు చెయ్యి. రాత్రి పదిగంటలకి వస్తాను. ప్రతిదీ జాగ్రత్తగా ఏర్పాటు చెయ్యాలి సుమా! ఐరావతానికి, చిల్లరకీ కూడా ఈ విషయం చెప్పు. ఎక్కడయినా పొరపాటు జరిగిందా క్షమించేది లేదు. (వెడతాడు)

**మంత్రి:** ఎవరక్కడా?

**సేవ:** చిత్తం.

**మంత్రి:** ఐరావతాన్ని పిలు.

**సేవ:** ఆజ్ఞ.

(ఐరావతం వస్తాడు)

**మంత్రి:** ఐరావతం. మహారాజుగారి అతిథి ఒకరు రేపు రహదారి బంగళాకు వస్తారు...అన్ని ఏర్పాట్లు సక్రమంగా

జరగాలి. ఎక్కడయినా పొరపాటు జరిగిందా, ఎవర్నీ క్షమించేది లేదు. (వెళ్ళిపోతాడు)

**ఐరా:** (జేబులో నుంచి ఒక బెల్ తీసి మోగిస్తాడు. చిల్లర వస్తాడు) ఇటు చూడు. మహారాజుగారి అతి ముఖ్యమైన అతిథి ఒకరు రేపు రహదారి బంగళాలో బస చేస్తారు. అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరగాలి. ఎక్కడయినా పొరపాటు జరిగిందా, ఎవర్నీ క్షమించేది లేదు.

(ఐరావతం వెళ్ళిపోతాడు. చిల్లర కూడా జేబులో నుంచి బెల్ తీసి మోగిస్తాడు. కాని అది మోగదు. దాన్ని లోపలకు తీసుకుని వెడతాడు)

## ఎనిమిదో రంగం

(రహదారి బంగళాలో సాంబ-శివ. సాంబడు ఆడవేషం వేసుకుంటున్నాడు. శివ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. సేవకుడు వాకిట్లో వేచి వున్నాడు.)

**శివ:** మనం ఎంత తొందరగా ఈ వూరు వదిలి వెళ్లిపోతే అంతమంచిది. నువ్వు మహారాజుతో, ఆంతరంగిక మంత్రితో, ఐరావతంతో ఆటలాడుకుంటున్నావు. నాకు చెడ్డ భయంగా ఉంది.

**సాంబ:** భయమెందుకు? నీ ఆట నువ్వా ఆడు. గెలిస్తే, నువ్వు కావాలనుకున్న అమ్మాయి నీకు దక్కుతుంది. ఓడిపోతే, మనకేం నష్టం? గాడిద వెంట్రుక. వినాయకుడు వరం తప్పిపోతే ఆయనకి నష్టం కాని, మనకేమిటి? అనవసరంగా మనసు పాడు చేసుకోకు.....ఆ ముత్యం ఇట్లా యివ్వు...కావేరిని కలిశావా?

**శివ:** ఆ!

**సాంబ:** ఏమంటున్నది?

**శివ:** ఏమంటుంది? వాళ్ళ అమ్మేమో ఏమయినా సరే ఆ అమ్మాయిని స్వయంవరానికి – అదే – స్వయంవధూ ఉత్సవానికి తీసుకెళ్ళాలని...ఆ అమ్మాయి ససేమిరా, నేను చచ్చి అయినా పోతాను కాని గాడిదని పెళ్లి చేసుకోను – అని...నిన్నక్కడికి ఎత్తుకునయినా తీసుకుపోతానని వాళ్ళ అమ్మ.

**సాంబ:** బావుంది.

**శివ:** ఏమిటి బాగు?...నేను చాటుగా కావేరికేం చెప్పానంటే – నువ్వు ఎట్లాగయినా ఉత్సవానికి రా. గాడిద నిన్నే పెళ్ళిచేసుకునేటట్లు చేయడం నా వంతు. నువ్వు గాడిదను పెళ్లిచేసుకో....అప్పుడు నిరభ్యంతరంగా నా దానివి అవుతావు.

**సాంబ:** రేపు ఉత్సవానికి వస్తుందంటావా?

**శివ:** వస్తానంది....నువ్వు చెప్పినదాన్లో ఏదైనా తభావతువస్తే దానికి నువ్వే బాధ్యుడి వంది. నేను సరే అన్నాను....నాన్న! నువ్వు ఆడవేషం ఎందుకు వేసుకుంటున్నావు?

**సాంబ:** అదే తమాషా. ప్రతి వాళ్ళూ రంగుపూసు కోవడమో, చెరిపెయ్యడమో చేస్తున్నారు. కొంచెం రంగు పూసుకుంటే గాడిద రాజవుతుంది. తీసేస్తే రాజు గాడిద అవుతాడు. ఆడది మగవాడు, మగవాడు ఆడది అవుతారు....చిల్లర వచ్చినట్టున్నాడు..చూడు.

**శివ:** నాకు భయంగా ఉంది నాన్న! నేను వెళ్ళిపోనా?

**సాంబ:** ఉండు ఉండు.....నీ వినోదం కోసమో ఇదంతా.

(చిల్లర రంగస్థలం అవతలి వైపు నుంచి వస్తాడు)

**చిల్లర:** ఎవరది?

**సేవ:** డింగ్‌డాంగ్, సర్.

**చిల్లర:** ఎవరో వచ్చినట్టున్నారే.

**సేవ:** డింగ్‌డాంగ్ సార్‌గారి పి.ఏ. లోపల వున్నారు.

**చిల్లర:** ఎవరు? శివానా?

**సేవ:** ఆయన గారితో మరొకళ్ళెవరో ఉన్నారు.

**చిల్లర:** ఉన్నారూ? (రహస్యంగా) మగా? ఆడా?

**సేవ:** మగ మనిషేనండీ.

**చిల్లర:** మన రాజావారికేం కావాలి?

**సేవ:** ఏమీకారండి....గొప్ప మనిషేం కాదు....దోవన పోయే మనిషిలా ఉన్నాడు.

**చిల్లర:** అయితే చాలా మామూలు మనిషేనంటావ్? అయితే రాజుగారి కోసం వచ్చే అతిథి ఇంకా రాలేదన్నమాట. ఫరవాలేదు....రెండో అధికారి గారు వచ్చారని, తన్ని రమ్మంటున్నారని శివతో చెప్పు.

**సేవ:** చిత్తం.........(వెడతాడు)

**శివ:** (వస్తూ) నమస్కారమండీ...

**చిల్లర:** డింగ్‌డాంగ్.......ఎవరో రాజుగారికి కావలసిన ఒక ముఖ్యమైన వ్యక్తి వస్తున్నాడని రాజుగారు చెప్పారు. వచ్చారా?

**శివ:** ముఖ్యమైన వాళ్ళు ఎవ్వరూ రాలేదే! ఒకావిడ మాత్రం వచ్చింది.

**చిల్లర:** ఆడమనిషా? నేనెవరో మొగవాళ్ళు వచ్చారని విన్నానే!...ఎట్లా ఉంటుంది ఆవిడ?

**శివ:** అందగత్తె......బంగళాలో గదేమన్నా దొరుకుతుందా – అని అడిగింది.

**చిల్లర:** ఏడిశావ్!....నువ్వు ఒక్కడివే లోపల ఏం చేస్తున్నావ్?

**శివ:** ఆవిడ స్నానాల గది ఎక్కడ – అని అడిగితే – చూపిస్తున్నాను.

**చిల్లర:** (తనలో) అట్లాగా! ఎవరో ముఖ్యమైన అతిథి వస్తున్నాడని నాతో చెప్పి ఐరావతం ఏదో దుర్మార్గపు ఆలోచనలో వున్నాడన్నమాట! సరే! (బిగ్గరగా) స్నానాల గది చూపించడానికి నువ్వెవరివి? మేం లేమా? వెళ్ళు వెళ్లు...డింగ్‌డాంగ్ గారికి ఆకలి వేస్తూ వుండాలి...వారికి దాణా తినిపించు...(శివ వెడతాడు. చిల్లర లోపలికి వెడతాడు)

**సాంబ:** (అతన్ని చూసి) ఓ! మిమ్మల్ని చూస్తే నాకానందంగా ఉంది...ఎంతో సంతోషంగా ఉంది....మీకు లేదా?

**చిల్లర:** (ఆశ్చర్యంగా) ఏమన్నావ్?

**సాంబ:** మీకు సంతోషంగా లేదా – అన్నాను.

**చిల్లర:** లేదు.

**సాంబ:** అయ్యో! ఉంటే బావుండును.

**చిల్లర:** ఏమిటి?

**సాంబ:** సంతోషం.

**చిల్లర:** ఎందుకు?

**సాంబ:** ఎందుకంటే – సంతోషం సగం బలం, మంచి ఆరోగ్యానికి, హాయిగా తినడానికి, హాయిగా ఇతర పనులు చెయ్యడానికి –

**చిల్లర:** కావచ్చు.

**సాంబ:** అట్లా వుంటే బావుండేది.

**చిల్లర:** ఎట్లా?

**సాంబ:** మీరు సంతోషంగా ఉంటే –

**చిల్లర:** ఎవరు మీరు? మీరు మా ఏలిక గారికి చుట్టాలా?

**సాంబ:** లోపలికి వచ్చి మాట్లాడండి.

**చిల్లర:** ఎవరు నువ్వు? ఇక్కడికి ఎందుకు వచ్చావ్?

**సాంబ:** చిల్లరిగారి ఆఫీసులో అటెండర్ ఉద్యోగం ఖాళీగా ఉందిట.

**చిల్లర:** అవును. ఉంది.

**సాంబ:** ఆ ఉద్యోగం నాకు ఇప్పించమని ఐరావతం గారి నడిగాను. ఆయనేమో నన్నిక్కడికి రమ్మన్నారు.

**చిల్లర:** ఎంత మదం! నా ఆఫీసులో ఉద్యోగాన్ని ఆయన ఇస్తానంటాడు?…చూడమ్మాయ్! నీ పేరేమిటి?

**సాంబ:** సుందరి.

**చిల్లర:** చూడు సుందరీ! ఆ ఐరావతం పనికి రాని సన్నాసి….అన్నీ గొప్పలే చెబుతాడు..అటువంటి వాళ్ళ మాటలువిని మోసపోగూడదు.

**సాంబ:** అట్లాగా! ఎన్ని మాటలు చెప్పాడు? ఎన్ని వాగ్దానాలు?..సరే లెండి….నేనిక్కడికి రావడం మంచిదయింది. దేవుడు లాంటి మిమ్మల్ని చూశాను. ఆ ఉద్యోగం నాకిప్పించే ఏర్పాటు చెయ్యండి.

**చిల్లర:** ఎంత మంది చిన్నపిల్లల్ని ఆ రకంగా మోసం చేస్తున్నాడో ఎవరికి తెలుసు?…నీ పేరేమిటన్నావ్?

**సాంబ:** సుందరి.

**చిల్లర:** మంచిపేరు…దగ్గరికి రా..నీకో విషయం తెలుసా? రాజుగారు నా మాటే వింటారు. మొన్న ఏమన్నారో తెలుసా? నీ పై అధికారి ఒట్టి బుద్ధావతారం…ఒక్క తాపు తన్ను – అన్నారు. నేనెట్లా చెయ్యగలను? అన్నాను…రాజుగారేం చేశారో తెలుసా? "ఇట్లా" అన్నారు….నా పిర్రమీద ఒక్క తన్ను తన్ని…. (నవ్వుతాడు)

**సాంబ:** మీరు రాజుగారికి నిజంగా అంత దగ్గరా, అండీ? ఆయనతో చెప్పి నాకో ఉద్యోగం ఇప్పించండి.

**చిల్లర:** రాజుగారి దాకా ఎందుకు? నేను లేనూ? నేను ఉత్తరం రాసి ఆయన ముందు పెడితే ఒక్క అక్షరం మార్చకుండా సంతకం పెడతారు ఆయన….రాజుగారి ఆర్డర్లని రాసేదినేనే, తెలుసా?

**సాంబ:** అయితే మీరే నాకు దిక్కు. నాకు ఉద్యోగం వచ్చేటట్టు చూడండి.

**చిల్లర:** నా కొదిలేయ్…నీకా ఉద్యోగం ఇప్పిస్తే….నా మామూలు….నాకు….నీకు తెలుసుగా….ఏమంటావ్? (తలుపు వేస్తాడు)

**సాంబ:** ఆ విషయంలో మీకు సందేహం వద్దు…మీరడిగింది ఇద్దామంటే ఈలోగా మీ పై అధికారిగారు

వచ్చేస్తారేమోనని....అంతే!

**చిల్లర:** వస్తే ఏమిటిట? ఆయనంటే నాకు భయమనుకుంటున్నావా?...నాకు లెక్కలేదు. వాడి తాత దిగివచ్చినా అంగుళం కదపలేడు నన్ను.

**సాంబ:** అయితే ఇంకా ఆలస్యం దేనికి? నా సేవలు స్వీకరించండి.

**చిల్లర:** సేవలా?

**సాంబ:** (పాడుతూ) ఎట్లు సైపగలను? ఓ మన్మథా!
అతివకు జరిగే ఈ వ్యథకు?
నిత్యమూ నీ పూశరములు
నా హృదిని గుచ్చుకొన ॥ఎట్లు సైపగలను॥

**చిల్లర:** ఓ, సుందరీ! నా హృదయాన్ని నా పాదాలముందు పెడుతున్నాను.

(ఇంతలో తలుపు చప్పుడు)

**సాంబ:** ఎవరది?

**బయటిగొంతు**: నేను.....ఐరావతాన్ని....తలుపు తియ్యి.

**చిల్లర:** అమ్మో! మా పై అధికారి.

**సాంబ:** "మీ కింది అధికారి ఇక్కడున్నాడు. మీరు వెళ్ళండి" అని చెబుతాను....

**చిల్లర:** అమ్మో! ఆ మాట మాత్రం చెప్పకు.......తలుపు వేసివుంది...మనం ఇద్దరమే ఉన్నాం ఇక్కడ. ఆయనే మనుకుంటాడు? నా ఉద్యోగం కాస్తా పోతుంది.....నీ కాళ్ళు పట్టుకుంటాను. ప్లీజ్........

**ఐరా:** తలుపు తియ్యరేం? తొందరగా.

**సాంబ:** మీకేమీ లెక్కలేదన్నారుగా!

**చిల్లర:** అన్నాను...బుద్ధి గడ్డి తిని అన్నాను.....ఆ వుద్యోగం నీకు రేపే ఇస్తాను. ఇక్కడ్నుంచి పారిపోవడానికి దారి చూపించు.

**సాంబ:** ఎట్లా? దీనికి ఒక్కటే తలుపు..ఆ! ఒక ఉపాయం చెప్పనా? ఆ చీరె కట్టుకుని ఆ తలుపు దగ్గర కూచోండి. ఆయన అడిగితే నాతో వచ్చారని చెబుతాను...ఆయన వెళ్లిపోయాక మీరు – ఏమంటారు?

**చిల్లర:** చీరె కట్టుకోవాలా?

**ఐరా:** ఏం జరుగుతోంది లోపల?

**చిల్లర:** ఆ చీరె ఇవ్వు...

(తొందరగా చీరె కట్టుకుంటాడు. సాంబ అతని గుడ్డలు తీసుకుని పోయి లోపల దాచేస్తాడు)

**సాంబ:** ఎవరది? వచ్చేదాకా ఆగరేం?
(చిల్లర ఎక్కడ కూచోవాలో చెప్పి తలుపు తీస్తాడు......ఐరావతం, శివ వాకిట్లో ఉన్నారు)
లోపల చీరె కట్టుకుంటున్నాను. ఇంతలో ఏమిటా తొందర?

**ఐరా:** ఇదెవరు?

**శివ:** నాకు తెలియదండి.....మిమ్మల్ని ఎరుగునని చెప్పింది.

**ఐరా:** నన్నా? నీకేం మతి పోలేదు కదా?...ఆ దొంగ వెధవ చిల్లర గాడేడీ? గాడిదల్ని కాస్తున్నాడా?

**శివ:** నాకు తెలియదదండి.

**ఐరా:** నువ్వెవరు?

**సాంబ:** ఐరావతంగారి ఆఫీసులో నాకు పి.ఏ. ఉద్యోగం ఇప్పిస్తానని చిల్లరగారు చెప్పారండి....ఇక్కడికి రమ్మన్నారు.

**ఐరా:** దొంగవెధవ! రాజుగారి ఆజ్ఞ ఏమిటి? వాడిక్కడ చేస్తున్నదేమిటి? వాడికో గుణపాఠం చెప్పాలి. చూడు, రాజుగారి అతిథి ఒకరు వస్తున్నారు....నువ్వు ఇక్కడ నుంచి ఖాళీ చెయ్యాలి.

**సాంబ:** ఎవ్వరూ రావడం లేదని, నేనిక్కడ ఉండవచ్చునని ఆంతరంగిక మంత్రిగారు చెప్పారే!

**ఐరా:** ఆంతరంగిక మంత్రిగారా? అంటే అతిథి ఎవ్వరూ రావడం లేదన్నమాట.....నువ్వు ఇక్కడికెందుకు వచ్చావు, శివా? డింగ్‌డాంగ్‌గారిని చూసుకోవడం లేదూ?

**శివ:** మీరు ఊరికే తలుపులు బాదుతున్నారు. మీకు సహాయం చేద్దామని వచ్చాను.

**ఐరా:** నాకెవరి సహాయమూ అక్కర్లేదు...వెళ్ళు...పేద్దగొప్ప! దేవుడిలా – సహాయం చేస్తానని కబుర్లు..... (సాంబతో) చూడు, నువ్వు చదువుకున్న దానిలా ఉన్నావ్......చిల్లర లాంటి దుర్మార్గుల మాయ మాటల్లో పడకూడదు.....నీ లాంటి అమాయకురాల్ని మోసగించేవాడు ఎంతటి నీచుడై ఉండాలి... ఇట్లా ఎందరు ఆడవాళ్ళని మోసం చేశాడో ఎవరికి తెలుసు?....నిన్న రాజుగారి దగ్గరకి తీసుకుపోతాను. ఇదంతా రాజుగారికి చెప్పాలి....

**సాంబ:** రాజుగారికే ఏమిటి? ఆయన అమ్మమ్మకు చెప్పమన్నా చెబుతాను.

**ఐరా:** తనకు ఉద్యోగం రావడానికి వాడి చెల్లెల్ని రాజుగారి దగ్గరికి పంపించిన వాడు. నీకు ఉద్యోగం ఇప్పిస్తానని ఎట్టా చెప్పాడంట?

**సాంబ:** మీరంటే లెక్కలేదన్నాడు.

**ఐరా:** త్రాష్టుడు.

**సాంబ:** ఆయన పేరేమిటి?

**ఐరా:** తిరుగుబోతు.

**సాంబ:** మీరే రాజుగారికి చెప్పినాకు ఉద్యోగం ఇప్పించాలి......

**ఐరా:** నేనిక్కడ ఉండగా రాజుగారెందుకు? నా డబ్బా నేనే వాయించుకునే మనిషిని కాదు నేను. కాని ఈ మాట ఒక్కటీ నీకు చెప్పాలి. ఈ రాజ్యం ఉన్నదీ అంటే నా వల్లనే!...ఒక్క రోజు నేను లేకపోతే ఈ రాజ్యం ఏమవుతుందో తెలుసా?

**సాంబ:** ఏమవుతుందండీ?

**ఐరా:** కుప్ప కూలిపోతుంది....నేను లేకుండా రాజుగారిని దర్బారు నడపమను.....ఆ దర్బారులో ఏ ఒక్కడినాయనా తప్పులు లేకుండా రాజుగారి పేరును రాయమను....పరిపాలన సాగించడమంటే చిన్నపిల్లల ఆట కాదు....రాజుగారు....ఆ ఇస్పేటు రాజు – రాజాకల్మాది – నన్ను చూస్తేనే గడగడలాడతాడు. ఇదంతా ఎందుకు చెప్పానో తెలుసా?...ఒక ఉద్యోగం ఉంది. అది నీదే – అని చెప్పడానికి....అయితే...నువ్వు నాకేం ఇవ్వాలో తెలుసుగా......

**సాంబ:** మిమ్మల్నే పూర్తిగా నమ్ముకున్నాను. నీట ముంచినా, పాలముంచినా –

**ఐరా:** నిన్ను మద్యంలో ముంచేస్తాను. ఆగు.

(తలుపు వేస్తాడు. సాంబ దగ్గరకి వస్తాడు. ఇంతలో రాజు, ఆంతరంగిక మంత్రి వస్తారు.)

**సాంబ:** మీరజాలగలరా, నాయానతి వ్రత విధాన మహిమన్ ॥మీర॥
సుందరి యానతి, మీరజాలగలరా
ఐరావతమైన, అది మహారాజులే అయినా ॥మీర॥

**రాజు:** (బయటి నుంచి) అన్ని ఏర్పాట్లు సక్రమంగా జరిగినట్టే కదా?

**మంత్రి:** మీరేం భయపడకండి. ఐరావతం అన్నీ చూసుకుని ఉంటాడు. (లోపల తాగుతున్న ఐరావతం రాజు మాట విన్నాడు.

**ఐరా:** బయట రాజుగారి గొంతు కాదు కదా?

**సాంబ:** అట్లాగే వుంది.

**రాజు:** ఆ అమ్మాయి వచ్చిందా?

**మంత్రి:** ఆ!

**రాజు:** నువ్వు వెళ్ళొచ్చు.

**మంత్రి:** చిత్తం మహారాజా.

**రాజు:** ఇక్కడ వున్న సేవకుల్ని, అందర్నీ నీతోపాటు తీసుకుపో.

**మంత్రి:** అట్లాగే మహారాజా.

**ఐరా:** అయ్యో! చచ్చాను....సుందరీ! నన్ను రక్షించు....ఇక్కడ్నుంచి పారిపోయే మార్గం చెప్పు......

**సాంబ:** ఈ గదికి ఉన్న వాకిలి అదొక్కటే. ఆ తలుపు తియ్యనా?

**ఐరా:** అమ్మో! వద్దు వద్దు.

**సాంబ:** ఏం? రాజుగారికి మిమ్మల్ని చూసే ఒణుకు గదా?

**ఐరా:** అయ్యో, సుందరీ! నీకు అర్థం కాదు....అంతా తరువాత చెబుతాను. ఇప్పుడు మాత్రం నన్ను ఈ ఆపద నుంచి గట్టెక్కించు....నీ మేలు మరువను....

**రాజు:** (చేతలెత్తి ఆంతరంగిక మంత్రికి చూపుతూ) నువ్వు వెడుతున్నావా? ఆగు.....చూడు, వాసన బావుందేమో?

(రాజు రెండో చెయ్యి కూడా ఎత్తుతాడు)

**మంత్రి:** ఇంకేమీ ఎత్తనక్కరలేదు....మీ అంగాలన్నీ పరిమళశోభితాలు ప్రభూ!

**రాజు:** ఆమెను పిలు. “సుందరీ! రాజుగారు వచ్చారు” అని చెప్పు.....కాదు, కాదు...“సుందరీ మహారాజు గారు వచ్చారు” అను...కాదు, కాదు....“ప్రపంచంలోని అతి సుందరాకారుడు శ్రీశ్రీశ్రీ కల్మాదీ మహారాజులుంగారు విచ్చేశారు. ఆహ్వానించు” అను....పోనీ, ఒక పాట పాడమంటావా?

**మంత్రి:** వద్దు, మహారాజా! బయటెందుకు ఆ చప్పుళ్ళు? లోపలికి వెళ్ళాక పాడుకోవచ్చు, కావాలంటే.

**రాజు:** బాగా చెప్పావ్......ఊ!

(ఆంతరంగిక మంత్రి తలుపు తడతాడు)

**ఐరా:** సుందరీ! నీ కాళ్ళు పట్టుకుంటాను....నన్ను కాపాడు.

**సాంబ:** అయితే, ఆ చీరె కట్టుకుని అక్కడ లోపల కూర్చోండి. రాజుగారు అడిగితే నాతో వచ్చారని చెబుతాను. రాజుగారు వెళ్లిపోయాక, మన ఇష్టం...

**ఐరా:** ఏమిటీ? చీరె కట్టుకోవాలా?

**మంత్రి:** సుందరీ! రాజు గారు వచ్చారు. తలుపు తియ్యి.

**ఐరా:** సరే! ఇవ్వు..

**మంత్రి:** సుందరీ! తలుపు తియ్యవేం?

**సాంబ:** (లోపల నుంచి) ఆంతరంగిక మంత్రిగారూ! రాజుగారి కోసం ఎంతసేపు చూస్తూ కూర్చుని వున్నాను. ఒంటరిగా, విరహంతో....ఇంత ఆలస్యంగా రావడం మీ రాజుగారికి తగునా? (ఐరావతంతో) నీ దుంప తెగ...తొందరగా తెములు...లోపలికి పోయి నోరు మూసుకుని కూర్చో. అక్కడ ఇంకో ఆడమనిషి ఉంది...ఆవిడని ముట్టుకోవడం...వగైరా వెధవ చేష్టలు చేస్తే – కబడ్దార్...

(తలుపు తీస్తాడు...రాజుగారు వస్తాడు. సాంబ చీరె కొంగుతో మొహం కప్పుకుని ఉంటాడు)

**రాజు:** ఓ, ప్రేయసీ! ఆ రోజున వసంతోత్సవంలో నిన్ను చూసిన దగ్గర నుంచీ నా గుండె మూగవోయింది. నా జీవితం ఎడారి అయింది. నా శరీరం వసివాడి పోయింది. నా మనస్సు శూన్యం అయిపోయింది. తొందరగా వచ్చి నన్ను మళ్ళీ బతికించు....రా!

**సాంబ:** మహారాజా! సుందరి లోపల దాక్కుని వుంది...సిగ్గుపడుతోంది.

**రాజు:** మరి నువ్వెవరు?

**సాంబ:** నేను ఆమె చెలికత్తెని. అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ మిమ్మల్ని సేవించుకుందామని వచ్చారు. పెద్దమ్మాయి పేరు మంజరి. చిన్నమ్మాయి పేరు సుందరి....వాళ్ళిద్దరూ మంచి నాట్య కత్తెలు....మీరు ముందుగా వాళ్ళ నృత్యం చూస్తారని వాళ్ళు ఆశ పడుతున్నారు.

**రాజు:** మేం ఇద్దరం ఏకాంతంలో ఉంటామని అనుకున్నామే! సరే! ముందుగా కళాపోషణే చేద్దాం...రమ్మను.

**సాంబ:** మహారాజుగారు మిమ్మల్ని కరుణించారు...తొందరగా వచ్చి నృత్యం చెయ్యండి...(వాళ్ళిద్దరూ ఒకర్ని ఒకరు చూసుకుంటారు. భయంతో వణికిపోతున్నారు) తొందరగా రారేం?...రాజుగారు మంచి రసికుడు. పోనీ, రాజుగారినే మీ దగ్గరకు రమ్మంటారా?...మహారాజా! అమ్మాయిలు సిగ్గుపడుతున్నారు. పోనీ, మీరే – ఆ! మీరే ఒస్తున్నారా? రాజుగారు గొప్ప కళాప్రియుడు....రండి. (భయపడుతూ వస్తారు) అరుగో మహారాజా!...నేను పాడతాను. వాళ్ళు నృత్యం చేస్తారు....

పిలిచిన బిగువేలరా
రారాజ
నినుగన మనసాయెరా
కాముడు
నిలువెల్ల దహియించెరా
నీకై
ఒడలంత గికురించెరా
నీ సామి

మనసంత కళ్ళాయర

మన్మథ

బాణాలు తూట్లాయరా

రమ్మని

వేడ్కాతో పిలిచేనురా

మరులు

ఇమ్మని వేడేను రా॥

రారాజ, రావేల, రారాజ, రావేల....

(ఇద్దరూ నృత్యం చేస్తారు. ఏ మాత్రం లయ, తాళం లేకుండా)

**సాంబ:** ప్రభూ! ఈ క్షణం నుంచి మీరు, మీ ప్రియురాళ్ళతో ఒంటరిగా – నాకు సెలవు ఇప్పించండి...మా అమ్మాయిలు ఇద్దరూ పాపం ఇంకా విచ్చని గులాబీలు...అనుభవం లేని అమాయకులు...వాళ్ళు సిగ్గుతో ఏం చేసినా భరించండి...మీరు అనుభవజ్ఞులు – మీకు చెప్పాలా?

**రాజు:** సరే, సరే! అవన్నీ మాకు చెప్పాలా?...ఇహ నువ్వు వెళ్ళు. తలుపు వాకిట్లో గడియ పెట్టు....తెల్లవారే దాకా ఒక్క పురుగు కూడా ఈ చుట్టు పక్కల తారట్లాడకూడదు.....

(సాంబ వెడుతూ వెడుతూ ఐరావతం, చిల్లరల గుడ్డలు తీసుకుని వెడుతూ, తలుపు లాగి బయట గడియ పెడతాడు)

## తొమ్మిదో రంగం

(వినాయకుడి గుడి. సాంబ నవ్వుతూ వుంటాడు. శివ దిగులుగా)

**శివ:** ఆ నవ్వడం ఆపు..

**సాంబ:** హ! హ! హ!

**శివ:** నీకేమన్నా పిచ్చి పట్టిందా?

**సాంబ:** వినాయకుడి దయవల్ల ఇంకా నాకు పిచ్చి పట్టలేదు. నీ ప్రియురాలికి పిచ్చి పట్టకుండా చూసుకో.

**శివ:** ఇద్దరం పిచ్చివాళ్ళం అయినాం...ఇంకా చూసేదేమిటి?

**సాంబ:** శివా!...ఈ నీళ్ళలోనే ఏదో తమాషా మత్తు ఉందిరా! రెండు గుక్కలు తాగితే మత్తు వస్తుంది...సీసాలు ఖాళీ చేసే నాకు!....

**శివ:** నీకెప్పుడూ తాగుడు గొడవే!......నీ కంత గొడవలా వుంది.

**సాంబ:** ఒరేయ్ శివా! ఈ విచిత్ర లెక్కదన్నా చూశావా? గాడిదకి స్వయంవధూ ఉత్సవమా? మనం మనుషులం – వెడితే – పిల్లను చూపనైనా చూపని వాళ్ళు గాడిదకి పిల్లనిస్తామని ఎగబడడమా?..నీ గాడిద వాళ్ళని ఎన్నుకోలేదని ఇద్దరు అమ్మాయిలు ఎక్కెక్కి ఏడుస్తున్నారు. ఇక్కడి జనానికి గాడిదే సరైన మొగుడు.

**శివ:** రాజుగారిని చూడలేకపోయాను. మొహం అంతా గీరుకుపోయింది. కాళ్ళ కన్నీ కట్టే! ఆ ఐరావతం,

చిల్లర ఆయన్నేం చేశారో ఎవరికి తెలుసు?...సరే! వాళ్ళిద్దరూ ఎక్కడా కనిపించరేం?

**సాంబ:** వాళ్ళకు కూడా ఇదే జరిగుండవచ్చు...ఒళ్ళంతా గాయాలు –

**శివ:** ఇక్కడ వధువు ఎన్నిక జరుగుతూ వుంటే ఆ ఆంతరంగిక మంత్రి నా పక్కనే కూర్చుని ఒకటే సొద. నీకు సుందరి తెలుసా? ఆవిడకేం అయింది? నాకేమో తప్పించుకోవడానికి వీలు లేదు. కావేరి ఇంకా రాలేదు.....చివరకు కావేరి వచ్చింది. గాడిద అరవదే! గాడిద అరవకముందే ఆమె వెళ్లిపోయేదే! గాడిద తోక గట్టిగా మెలి పెట్టాను – గాంధ్రు గాంధ్రుమని అరిచింది...ఈ అమ్మాయే పెళ్లి కూతురని అరిచాను. అవతల రాజుగారేమో మంత్రి మీద ఇంత ఎత్తున లేచాడు.

**సాంబ:** ఎందుకు?

**శివ:** ఇదే ఆనాడు నేను చూసిన అమ్మాయి – నీలం చీరె, పచ్చ జాకెట్టు. ఆ అమ్మాయి ఈ అమ్మాయే! నువ్వెరినో బజారుదాన్ని తీసుకువచ్చి నా కాళ్ళూ, చేతులూ విరిగ్గొట్టించావు – అని ఒకటే తిట్లు –

**సాంబ:** అయితే ఆ రోజున రాజు చూసిన అమ్మాయి కావేరి అన్నమాట! తగిన శాస్తి జరిగింది వాడికి.

**శివ:** వాడి ఏడుపు వాడిని ఏడవనీ...కాని ఇప్పుడు నా సంగతేమిటి?

**సాంబ:** నీకేం? అన్నీ నీకు అనుకూలంగానే జరుగుతున్నాయి....కావేరి డింగ్‌డాంగ్ భార్య...వివాహం ఇవ్వాళ రాత్రే – కావేరి దగ్గరికి పో – గాడిదని కట్టెయ్యి....ప్రేయసీ ప్రియులిద్దరూ మొదటి రాత్రి ఆనందంగా గడపండి.

**శివ:** అదేం అంత తేలిక పని కాదు...ఆ మంత్రి రాజుతో కలిసి ఏం పన్నాగం పన్నుతున్నాడో తెలుసా?

**సాంబ:** అదేమిటి?

**శివ:** "ఈ అమ్మాయే నీలంచీరె అమ్మాయి అయితే మనకు చిక్కినట్టే! ఎట్లా డింగ్‌డాంగ్ ఆ అమ్మాయినే ఎంచుకున్నాడు. ఇవ్వాళ పెళ్లిరాత్రి...గాడిద లోపలికి రాగానే ఆ అమ్మాయి ఎట్లాగూ ఏడుపు లంగించుకుంటుంది, నేనీ గాడిదతో కాపురం చెయ్యను – అని. అప్పుడు మీరు లోపలికి పోయి దేవుడిలా ఆమెను రక్షించి మీదాన్ని చేసుకుంటారు" ఇదీ వాళ్ళ పన్నాగం. నేను లోపలే ఉంటే పట్టుబడి పోవడం ఖాయం. ఇప్పుడేం చేద్దాం?

**సాంబ:** ఇంకేం చేస్తావు? మనం అనుకున్నట్లుగా నువ్వు కావేరి దగ్గరికి వెళ్ళిపో.

**శివ:** ఈ సారి నువ్వు ఆడవేషం వేసుకుంటే ప్రాణాలత బయటికి రావు. ఈ సమస్యకు వేరే పరిష్కారం చూడాలి.

**సాంబ:** నా సమస్య అల్లా నీ ఖాళీ మెదడు...శివా! నీకు వినాయకుల వారి ఆశీర్వచనం ఉంది. తక్కువ మాట్లాడు....గాడిద పేడకి, మూత్రానికి వేలకు వేలు విలువ వుంటే, అది ఓంద్ర పెట్టడానికి అంత విలువ వుండాలి?

**శివ:** అంటే?

**సాంబ:** నువ్వు లోపలికి పోయి తలుపులు కిటికీలు గట్టిగా ముయ్యి. ఏం జరిగినా తియ్యకు. రాజుగారు వస్తే నేను ఈల వేస్తాను. అప్పుడు డింగ్‌డాంగ్ చేత గట్టిగా అరిపించు.

**శివ:** అంటే నన్ను వెళ్ళమంటావా?

**సాంబ:** ఊరికే నసపెట్టకు.....తొందరగా వెళ్ళు....

## పదో రంగం

(డింగ్‌డాంగ్ పెళ్లి రాత్రి. వెన్నెల దూరంగా పాట వినిపిస్తూ వుంటుంది. రాజు, ఆంతరంగిక మంత్రి వస్తారు. వాళ్ళు ఇద్దరూ మారువేషాల్లో ఉంటారు – రాజుగారు మగ దయ్యంగాను, మంత్రి ఆడ భూతంగాను)

(దూరంగా పాట)

నిను వీడి మనజాలరా, ప్రియా
నిను మరువ వెతతాయెరా ॥
నీ నవ్వు ముఖమూ, నీ చిలిపి తనమూ
నా గుండెలో నిండెరా
పూవింటి రాజు, పొదరింటి మల్లె
నా గుండెనే చీల్చరా
ఈ కన్నె మనసు, ఉప్పొంగు వయసు
లోలోన మధియించెరా – ప్రియా
నేనేమీ చేసేదిరా ॥

**రాజు:** మనల్నెవరూ గుర్తు పట్టరు కదా?

**మంత్రి:** దిగిరావాలి....అందులోనూ మిమ్మల్ని...అచ్చంగా మగదయ్యంలా వున్నారు.

**రాజు:** నువ్వు మాత్రం.. సరిగ్గా ఆడభూతంలా లేవు....లోపల ఏం ఏడుపులు వినబడడం లేదేం?

**మంత్రి:** ఇద్దరూ ఇంకా పడుకున్నట్టుగా లేరు. లైటు వెలుగుతూనే వుంది.

**రాజు:** ఆలస్యం అయిపోయింది...ఎక్కడన్నా కంత ఉందేమో చూడు...వాళ్ళు ఏం చేస్తున్నారో చూడొచ్చు.

**మంత్రి:** అంత బిగ్గరగా మాట్లాడకండి మహారాజా!

**రాజు:** నా ఇష్టం వచ్చినంత బిగ్గరగా మాట్లాడతాను. అడగడానికి నువ్వెవరివి?

**మంత్రి:** మహారాజా! మహారాజా!! నగరం చెవులన్నీ ఈవైపుకే మొహరించి వున్నాయి....మనం కనక ఇట్లా తొంగి చూస్తున్నాం అని తెలిస్తే, జనం అందరూ మనల్ని అసహ్యించుకుంటారు.

**రాజు:** అట్లా చెప్పవేం!...అయితే మనల్ని అసహ్యించుకోకుండా ఉండే పథకం ఒకటి వెయ్యి.

**మంత్రి:** దేనికి?

**రాజు:** లోపలికి చూడడానికి....చిల్లి ఎక్కడన్నా ఉందా?

**మంత్రి:** లేదు.

**రాజు:** గోడదగ్గర చెవులు పెట్టుకు విను. లోపల ఏమన్నా చప్పుడవుతోందా?

**మంత్రి:** ఏమీ వినిపించడం లేదు, మహారాజా!

**రాజు:** మరి ఏమీ కనిపించని, వినిపించని చోట ఎందుకు ఏర్పాట్లు చేశావ్ ఈ పెళ్ళి రాత్రి?...పైకి ఎక్కి ఒక

పెంకును తీసి లోపలకు చూడు....ఊ...

(ఆంతరంగిక మంత్రి పైకి ఎక్కుతాడు...లోపలికి చూస్తూ తప్పుడు సమాచారం ఇస్తూ వుంటాడు)

**మంత్రి:** మహారాజా! వాళ్ళిద్దరూ మంచం మీద కూర్చుని ఉన్నారు.

**రాజు:** అట్లాగా! తరువాత?

**మంత్రి:** డింగ్‌డాంగ్ ఆ అమ్మాయి చెవిలో ఏదో రహస్యంగా చెబుతున్నాడు.

**రాజు:** తొందరగా....ఇంకా?

**మంత్రి:** ఆ అమ్మాయి నవ్వుతోంది.

**రాజు:** ఆనందంతోనా, విచారంతోనా?

**మంత్రి:** ఆనందంతోనే మహారాజా!

(మహారాజు కాళ్ళు పట్టుకుని మంత్రిని కిందికి లాగుతాడు)

**రాజు:** గాడిద కొడకా!...నేను మొదటినుంచీ అంటున్నదీ ఈ అమ్మాయి గురించి. మరెవళ్ళతో తెచ్చి నన్ను నానా తిప్పలు పెట్టావు! ఇప్పుడేమో? ఆ అమ్మాయి లోపల హాయిగా నవ్వుతూ వుంటే ఎందుకు అరుస్తుంది?...ఆ అమ్మాయి ఏడుస్తుంది. మీరు వెళ్ళి రక్షించండి – అంటూ వెధవ కబుర్లన్నీ చెప్పావ్! కనీసం ఇప్పుడొక పనిచెయ్...పైన పెంకు తీసినవాడివి ఎట్లాగూ తీశావ్....దాన్లో నుంచి తల లోపలికి పెట్టి గుడ్లగూబలా పెద్దగా అరు...ఆ అమ్మాయి భయంతో అరుస్తుంది. నేను లోపలికి పోయి రక్షించవచ్చు.

(విధిలేక మంత్రి అట్లా అరుస్తాడు. ఇంతలో సాంబ వేసిన ఈల వినిపిస్తుంది. డింగ్‌డాంగ్ అరుపులు, భయంకరంగా. ఇద్దరూ పరిగెత్తుకు వెడతారు. స్టేజీకి రెండో పక్కన సాంబ ఒక దుప్పటి కప్పుకుని కూర్చుని వున్నాడు, తాగుతూ)

**రాజు:** డింగ్‌డాంగ్ మనల్ని గుర్తు పట్టాడంటావా?

**మంత్రి:** ఛ! ఛ! అట్లా జరగడానికి వీలు లేదు, ప్రభూ!

(సాంబ మొహం మీదనుంచి మెల్లగా దుప్పటి తొలగిస్తాడు)

**సాంబ:** దొంగవెధవల్లారా!....ఇటురండి.

**మంత్రి:** తాగుబోతులా ఉన్నాడు.

**రాజు:** మనం దయ్యాలమని చెబుదాం...భయపడి పారిపోతాడు.

**సాంబ:** ఒరేయ్...ఇటురండి....హాయిగా ప్రేమించాల్సిన రాత్రి దొంగతనం చేస్తున్నారా? దొంగ వెధవల్లారా! దయ్యాలూ భూతాలూ కూడా ఇంతరాత్రి హాయిగా ప్రేమించుకుంటూ ఉంటాయాఏ –

**రాజు:** మేం కూడ దయ్యాలం, భూతాలం –

**సాంబ:** ఇందులో దయ్యం ఎవరు? భూతం ఎవరు?

**రాజు:** నేను దెయ్యాన్ని.

**మంత్రి:** నేను భూతాన్ని.

**సాంబ:** మీరు ఒకళ్ళకొకళ్లు సరిగ్గా సరిపోయారు. హాయిగా ఒక చోట ఉండక, ఇంతరాత్రి ఈ సంచారం ఏమిటి?

**రాజు:** హాయిగానే ఉన్నాం....ఇంతలో మీ గొంతు వినిపించింది.

**సాంబ:** అట్లా చెప్పండి....ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. నా కొడుకు, నా కోడలు; డింగ్‌డాంగ్ – పెళ్ళాం, నువ్వూ, మీ ఆవిడ – బావుంది...నేనొక్కణ్ణే – ఒంటరిగా ఉన్నాను. అందుకే నాకు దిగులుగా ఉంది (ఏడుస్తాడు)

**రాజు:** (తాను ఏడుస్తూ) నీ ఏడుపు చూస్తే నాకు ఏడుపొస్తోంది.

**సాంబ:** ఏడవకు. నేను సహించలేను. మనుషులైనా, దయ్యాలైనా సరే!...ఇదుగో! ఓ గుక్క మద్యం సేవించు. హాయిగా ఉంటవ్! (బలవంతాన రాజునోట్లో పోస్తాడు)....ఆ! నన్ను చూడక ముందు మీరిద్దరూ హాయిగా ప్రేమించుకుంటున్నారు కదూ? ఇప్పుడు కూడా ప్రేమించుకోండి...

**రాజు:** వద్దులెండి. నా సఖురాలికి చచ్చే సిగ్గు.

**సాంబ:** సిగ్గయితే వదిలెయ్యడమేనా? ఆడవాళ్ళకి అంత అలుసు ఇవ్వకూడదు..మరి మీ దయ్యాలతో స్నేహం చెయ్యాలంటే ఏం చెయ్యాలి.

**మంత్రి:** మీరు కూడా చచ్చిపోయి మా లోకానికి వచ్చెయ్యండి.

**సాంబ:** దయ్యం అన్నయ్యా! మీ ఆవిడ భలే తెలివైందే!....నాక్కూడా చాలామంది దయ్యాలు తెలుసు, తెలుసా?....మా వూళ్ళో – నాకో దయ్యం ప్రేమసి వుంది.

**రాజు:** మరి ఇక్కడికి తెచ్చుకోలేదేం?

**సాంబ:** రమ్మన్నాను...రమ్మంటే అన్నది – “మేం అంతా పల్లెటూరి దయ్యాలం. మీ బస్తీ దయ్యాలు మమ్మల్ని చూసి నవ్వుతాయి. నేను రాను” అంది.

**మంత్రి:** అందుకని ఒంటరిగా దిగులు పడుతున్నావన్నమాట!

**సాంబ:** అవును...నా ప్రేయసితో ఆ మాటే చెప్పాను. “నువ్వు లేకపోతే నేను ఏకాకిని కానా? నాకేం తోస్తుంది” అన్నాను. అప్పుడు నాకో ముత్యం ఇచ్చింది. ఇచ్చి. “నీకు మరీ ఒంటరిగా అనిపిస్తే, ఈ ముత్యాన్ని ఎవరినోట్లోనన్నా వుంచు. ఆ మనిషి ఆడమనిషి అయిపోతుంది” అన్నది.

**రాజు:** (లేచి, ఆవేశంతో దగ్గరగా వచ్చి) ఇప్పుడా ముత్యం నీ దగ్గర వుందా?

**సాంబ:** ఆ! వుంది.

**రాజు:** ఏదీ! ఇటివ్వు.

**సాంబ:** నీకివ్వను...నువ్వూ, నీ గడ్డం – నాకిష్టం లేదు. ఈ మనిషికివ్వనా?

**రాజు:** ఇవ్వు...

**మంత్రి:** ప్రభూ!.....నేను ఆడదాన్నే కదా?

**రాజు:** ఏం ఫరవాలేదు..నోట్లో పెట్టుకో –

**మంత్రి:** తప్పదా?

**రాజు:** తీసుకోమంటున్నానా?

**సాంబ:** ఇట్లారా? ఇది నోట్లో పెట్టుకో –

(సాంబకి ఆనందంగా వుంది. రాజుకు ఉత్సుకత.)

**మంత్రి:** (ముత్యం ఉంచుకుని) అయ్యో!...ప్రభూ!...నిజంగానే నేను ఆడమనిషినయిపోయాను...అయ్యో! బాబూ!

తిరిగినన్ను మగవాణ్ణి చెయ్యి –

**రాజు:** నిజంగానా?

**మంత్రి:** అయ్యో! మీకెట్లా చెప్పను?...నేను నిజమే చెబుతున్నాను మహారాజా!

**రాజు:** అంతా మంచిదే అయింది. కావేరిని డింగ్‌డాంగ్‌తో వుండనీ – నువ్వు నాతో రా –

(మంత్రి దగ్గరకు వెడతాడు..సాంబడు వస్తాడు, మధ్యకి)

**సాంబ:** నువ్వెవడివిరా మధ్యలో? వాణ్ణి ఆడదాన్ని చేసింది నేను...అది నాది...

**రాజు:** నేనెవర్నో తెలుసా? దాన్ని వదులు....

(సాంబ రాజును దూరంగా నెట్టుకుంటూ పోతాడు)

**రాజు:** ఒరేయ్! నేను, నేను – ఈ దేశానికి మహారాజునిరా....

**సాంబ:** ఏడిశావ్‌లే అంట్ల వెధవా! ఒక మామూలు దయ్యానివి! మహారాజునని చెబుతావ్! ఎన్ని గుండెలురా నీకు! (అంటూ తరుముతూ కొడతాడు...మంత్రి కూడా రాజుతో పరుగెత్తుదామని చూస్తాడు) (మంత్రితో) కదిలావా, చంపేస్తాను. నోరుమూసుకుని ఉండు –

## పదకొండో రంగం

(రాజప్రాసాదం, మహారాజు కూర్చుని వున్నాడు..ఆడవేషంలో ఉన్న ఆంతరంగిక మంత్రి, చీరెను మొహానికి అడ్డం పెట్టుకుని, వస్తాడు)

**మంత్రి:** మహారాజా!

**రాజు:** ఎవరు నువ్వు?

**మంత్రి:** నేను మహారాజా! మీ ఆంతరంగిక మంత్రిని.

**రాజు:** నువ్వా! రా...రా....నువ్వింకా నీ చీరెని వదలలేదా?

**మంత్రి:** అదేం లాభం లేదు మహారాజా....నేనింకా స్త్రీనే!

**రాజు:** నిజంగా!

**మంత్రి:** మీతో హాస్యాలాడతానా ప్రభూ?...ఈ వేషంలో నేను ఇక్కడి వాళ్ళకి నా మొహం ఎట్లా చూపగలను? దయచేసి మళ్ళీ నన్ను మగవాణ్ణి చెయ్యండి.

**రాజు:** వాడినే ఎందుకు అడగలేకపోయావు?

**మంత్రి:** అడగడమేనా? కాళ్ళా వేళ్ళా పడ్డాను. బతిమిలాడాను, భంగ పడ్డాను....ఆయన నా మీద అరిచి, నువ్వు ఇట్లాగే బావున్నావు, ఫో – అన్నాడు.

**రాజు:** మంచిమాటే అన్నాడు.

**మంత్రి:** ఎల్లకాలం ఇట్లా ఎలా వుండమంటారు మహారాజా? అతని కోసం కబురు చేసి పిలిపించండి.

**రాజు:** ఎట్లా? వాడెవడో తెలియదు? ఊరూ పేరూ తెలియదు......ఎక్కడ వుంటాడో తెలియదు.

**మంత్రి:** ఆయన ఊరి బయట వినాయకుడి గుళ్ళో ఉండాడని తెలిసింది...నన్ను ఇవ్వాళ అక్కడికి రమ్మన్నాడు.

**రాజు:** మంత్రీ! మనం రాత్రి కలిసిన మనిషి గొప్ప మాంత్రికుడిలా ఉన్నాడు కదూ! మగవాళ్లను ఆడవాళ్ళుగా

చెయ్యగలడు...దయ్యాలతో, భూతాలతో తిరగగలడు.

**మంత్రి:** అవును మహారాజా! మాంత్రికుడే అయివుండాలి.

**రాజు:** అయితే, అతను మగవాడిని ఆడమనిషిని చెయ్యగలిగాడు కదా, నన్ను గాడిదగా మార్చగలడంటావా?

**మంత్రి:** మార్చగలడనుకుంటాను...కాని మహారాజా! మీరు – గాడిద కావాలనుకోవడం –

**రాజు:** మట్టి బుర్ర! ముందు డింగ్‌డాంగ్‌ని తీసుకురా. మిగిలిన దంతా తర్వాత చెబుతాను.

## పన్నెండో రంగం

(శివ – కావేరి)

**శివ:** నా మాట విను.

**కావే:** నేను వినను.

**శివ:** నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?..నేను నీ భర్తని.

**కావే:** న్యాయశాస్త్రం ప్రకారం నా భర్త ఓ గాడిద. నువ్వు కాదు.

**శివ:** మరి నేనేవర్ని?

**కావే:** శివ.

**శివ:** ఇహ నేను చెప్పేదేం లేదు.

**కావే:** ఎందుకని? ఏదో ఒకటి మాట్లాడుతూ వుండండి.

**శివ:** నేను చెప్పేది నచ్చని ఎవరితోనో నేను ఏదో ఒకటి ఎందుకు మాట్లాడాలి?

**కావే:** మీరు మాట్లాడడం మొదలుపెడితే నేను దాన్ని ఇష్ట పడవచ్చు.

**శివ:** అయితే, లోపలికి పోయి, గట్టిగా తలుపు వేసుకుని, అక్కడ కూర్చో.

**కావే:** ఇక్కడ ఆరు బయట కూర్చుంటే ఏమవుతుంది?

**శివ:** కొంచెం సేపట్లో ఇక్కడ గలభా జరగబోతున్నది...అందరూ మగవాళ్ళు. ఆడవాళ్లు అక్కడ వుండడం ప్రమాదం.

**కావే:** ఆడవాళ్ళు ఉంటే కొత్త కొత్త రంగుల అందాలు వస్తాయి. (ఎవరో పరిగెత్తుకుంటూ వచ్చి లోపల దాక్కుంటాడు)

**శివ:** నువ్వు మీ అమ్మగారింటికి ఎందుకు వెళ్ళలేదు?

**కావే:** అక్కడికి వెడితే, పక్క వాళ్ళ పిల్లలందరూ చేరి "గాడిద పెళ్ళాం" "గాడిద పెళ్ళాం" అంటూ ఆట పట్టిస్తారు.

**శివ:** ఇప్పుడు లోపలకు పోయి గట్టిగా తలుపు మూసుకో...నా గొంతు వినిపించేదాకా తలుపు తియ్యకు.

(కావేరి లోపలకు వెడుతుంది. పోలీసులు వస్తారు)

**పోలీసు:** మాజీ మంత్రిగారు ఇటు వచ్చారా?

**శివ:** లేదు.

(పోలీసులు వెళ్లిపోయారు. వాళ్ళు వెళ్లిపోయారని రూఢి అయిన తరువాత ఆ దాక్కున్న మనిషి బయటకు

వచ్చాడు)

**మంత్రి:** నాకొక గొప్ప మేలు చేశావు నాయనా!

**శివ:** మీరిక్కడ ఉండడం చాలా ప్రమాదం.

**మంత్రి:** నాకు తెలుసు.

**శివ:** మీరు మాజీమంత్రి కదూ?

**మంత్రి:** అయివుంటే నన్ను కాపాడినందుకు బాధపడతావా?

**శివ:** పడను.

**మంత్రి:** అయితే నేనే మాజీ మంత్రిని.

**శివ:** మీరు ఇటువంటి ప్రమాదాల ఊబిలో బిగుసుకోకూడదు. ఇక్కడికెందుకు వచ్చారండీ?

**మంత్రి:** నిన్ను చూడడానికే వచ్చాను.

**శివ:** చెప్పండి నేనేం చెయ్యగలను?

**మంత్రి:** మా విప్లవం చల్లారిపోయింది. ఈ రాక్షసుడి నుంచి విముక్తి లేదు. నీ గాడిద అంటే నాకు కోపం లేదు. అతను ముఖ్యమంత్రి కావడమే న్యాయం. ఇటువంటి రాజుకు, ఇంకెటువంటి మంత్రి ఉంటాడు? కాని ఆ నోరులేని జంతువు పేరు చెప్పి ఎన్ని పన్నులు వసూలు చేస్తున్నాడు ఆ రాక్షసుడు? ప్రజలు బతకడం ఎలా?

**శివ:** యథా రాజా, తథా ప్రజా! అంతేగా?

**మంత్రి:** అదీ నిజమే. సరేలే. ఆ సంగతి పోనీ. దేశం బాగుపడాలని కోరేవాళ్ళు అంతకంతకు తక్కువై పోతున్నారు. అందరూ మనం బాగుపడేదెట్లా అని ఆలోచించేవాళ్ళే!

**శివ:** మరి మీతో పాటు పని చేసినవాళ్ళు?

**మంత్రి:** ఏరీ? కొందరు జైళ్ళలో పడ్డారు. మరికొందరు స్వర్గంలో. ఒకళ్ళమో ఇద్దరమో ఇంకా బతికున్నాం. ఇవ్వాళోరేపో మేమూ ఉండం..అది సరే, నువ్వు నాకో సహాయం చెయ్యాలని అడగడానికి వచ్చాను.

**శివ:** చెప్పండి. ఏం చెయ్యాలి?

**మంత్రి:** నాకో స్నేహితుడున్నాడు....ఒక చాకలతను...ఇప్పుడు తిండికి కూడా లేదు. విప్లవంలో ఉన్నాడని అతని ఆస్థిపాస్తులు లాక్కున్నారు. అతనికి నీకు చేతనైన సహాయం చెయ్యాలి.

**శివ:** నేనేం చెయ్యగలను?

**మంత్రి:** అతనికి ఒక ఆడ గాడిద ఉంది – దాని పేరు రాధ. బలంగా బావుంటుంది. నీ డింగ్‌డాంగ్‌కి రోజుకొక ఆడ గాడిద కావాలట గదా? అతని గాడిదని తీసుకుని అతనికి కాస్త ఎక్కువ ధనం ఇప్పించు. కొన్నాళ్లు అతను, అతని కుటుంబం బతుకుతారు.

**శివ:** ఇటురండి...ఎవరో వస్తున్నారు.

(మంత్రి దాక్కుంటాడు) (సాంబ పరిగెత్తుకుంటూ వస్తాడు)

**సాంబ:** నిన్ను ఎన్ని యుగాలనుంచి వెతుకుతున్నానో తెలుసా?

**శివ:** ఎందుకు నాన్నా?

**సాంబ:** నీతో రహస్యంగా కొన్ని విశేషాలు చెప్పాలి...ఇక్కడెవరూ లేరు గదా?

**శివ:** ఎవ్వరూ లేరు చెప్పు?

**సాంబ:** ఇవ్వాళ రాజుగారు పెద్ద ఎత్తులో ఉన్నాడు.

(శివ దాక్కున్నమనిషిని చూపిస్తాడు. మెల్లగా మాట్లాడమని హెచ్చరిస్తాడు)

నేను చెప్పేదేమిటంటే – (రహస్యంగా శివ చెవులో చెబుతాడు)

**శివ:** ఎందుకు? (మళ్ళీ చెవులో చెబుతాడు)

**శివ:** ఎప్పుడు? (సాంబ రహస్యం చెబుతాడు)

**శివ:** ఎన్నిగంటలకు? (సాంబ మళ్ళీ రహస్యం చెబుతాడు)

**శివ:** అయితే అంతవరకు వచ్చిందన్నమాట! మంత్రిగారూ బయటకి రండి....(వస్తాడు) అయ్యా! మీ స్నేహితుడితో రాత్రికి రాధను తీసుకుని రమ్మని చెప్పండి...వీలైతే మీ మిగిలిన స్నేహితులతో రాత్రికి ఇక్కడికి రండి.

**మంత్రి:** ఇంకా నా మిత్రులెవరూ మిగిలిలేరు నాయనా! ఉన్న కొద్దిమంది కూడా నన్ను చూడడం మానివేశారు – నేనేం చెయ్యలేనని తెలుసుకుని.

**సాంబ:** మీకు బైరయ్య అనే మిత్రుడున్నాడా?

**మంత్రి:** ఆ! కాని ఒట్టి బద్ధకస్తుడు.

**సాంబ:** అయినా సరే, అడ్డుకట్టను బద్దలు కొట్టే సమయం వచ్చింది. చేపపిల్లల్ని రక్షించాలి...పార, పలుగు పట్టుకుని రమ్మన్నానని చెప్పండి..అతనే వస్తాడు.

**మంత్రి:** ఆనకట్టేమిటి?

**సాంబ:** ఆ మాటలతనికి చెప్పండి, చాలు.

**మంత్రి:** అలాగే....

**శివ:** ఇహ మన తెలివి తేటల్ని, భుజబలాన్ని రెంటినీ చూపించి ఈ రాజుకు బుద్ధి చెప్పాలన్నమాట!

**సాంబ:** తియ్యరా సాంబా! నీ ముత్యాన్ని –

**శివ:** తయారు చెయ్యరా నీ గాడిదని –

## పదమూడో రంగం

(రాజు, ఆంతరంగిక మంత్రి, సాంబ స్టేజీ ఒక పక్కనుంచి ప్రవేశిస్తారు. రాజు గాడిద వేషధారణలో సగం పూర్తి అయింది. గాడిదలా కనిపించేటట్లు చెయ్యడానికి ఒక తోక, వగైరాలు పెట్టారు)

**రాజు:** సైన్యాన్ని దూరంగా పంపారా?

**మంత్రి:** చిత్తం.

**రాజు:** డింగ్‌డాంగ్‌ని?

**మంత్రి:** కట్టుతాడు విప్పి ఊరుమీదికి వదిలివేశాను.

**రాజు:** కాపలావాళ్లు?

**మంత్రి:** మరో చోట కాపలాకి పంపించాను...చుట్టుపక్కల ఎవ్వరూ లేరు మహారాజా! కావేరి భయంతో అరిచి

కేకలు పెట్టినా సహాయం రావడానికి ఎవ్వరూ లేరు.

**రాజు:** కావేరికి భయమెందుకు? నేను డింగ్‌డాంగ్‌లా లేనా?

**సాంబ:** ఉన్నారు. కాని మొత్తం అంతా పూర్తి కానివ్వండి. అప్పుడు మీరు డింగ్‌డాంగ్ తాతలా వుంటారు.

**రాజు:** నాకు డింగ్‌డాంగ్ తాతలా ఉండాలని లేదు. అచ్చంగా డింగ్‌డాంగ్‌లాగానే ఉండాలి.

**సాంబ:** అయితే ఇటురండి....(ఆయన వేసుకున్న దుస్తులు ఒక్కొక్కటీ తీసివేస్తారు)

**రాజు:** నా తోకని కొంచెం దువ్వండి....నా జూలును కూడా.

(అట్లాగే చేస్తారు)

అద్దం! (ఇస్తారు....అందులో వివిధ కోణాలనుంచి చూసుకుంటాడు)

స్ప్రే – (స్ప్రే చేస్తారు)

**సాంబ:** మేం ఏం చేసినా మీ రాచరికపు హుందాతనం కనిపిస్తూనే వుంది మహారాజా! మీరు రాజగాడిద!

**రాజు:** కావేరి ఏమనుకుంటుందంటావ్?

**సాంబ:** కావేరి మిమ్మల్ని రోజూ కంటె ఎక్కువ ప్రేమిస్తుంది ఇవ్వాళ.

**మంత్రి:** మహారాజా! ఇది కావేరి పడకగది.

**సాంబ:** లైటు వేసేవుంది ప్రభూ! ఆ అమ్మాయి మీకోసమే కాచుకుని వుంది.

**రాజు:** ప్రభూ అని, మహారాజా అని అనకండి నన్ను....డింగ్‌డాంగ్ అనండి. అంతా బాగున్నదేమో చూడండి.

**సాంబ:** బ్రహ్మాండంగా ఉంది.

**రాజు:** నువ్వక్కడికి పోయి పాడడం మొదలుపెట్టు....స్వాగత గీతం...ఇప్పుడు ఓండ్రపెట్టనా? హీ....హీ...హీ హీహా......హీహా....ఆగండి, ఆగండి. నా చేతి వేలు కనిపిస్తోంది.

**సాంబ:** మీరు చేతులు కూడా కిందపెట్టి నడవడం మొదలుపెడితే, అది కింద గడ్డిలో ఉండి కనిపించదు.

**రాజు:** నిజం, నిజం..నేను ఇప్పుడే గడ్డి తినడం మొదలు పెట్టనా?

**సాంబ:** ఇప్పుడు కాదు...తరువాత...ఇప్పుడు డాన్స్ చెయ్యాలి...కావేరిని కలుసుకోబోతున్న ఆనందంతో –

**రాజు:** హీ–హీ–హా–హా.....ఉహుహహ...ఎట్లా వుంది?

**మంత్రి:** నా వెంట్రుకలు లేచి నిలబడుతున్నాయి....

**సాంబ:** ఏమిటన్నావ్.........

**మంత్రి:** అదే – గగుర్పాటు..

**రాజు:** నా ఓండ్రింపు ఎట్లా వుంది?

**సాంబ:** అంత బాగాలేదు....గొంతు ఇంకా పెంచాలి.

**రాజు:** హీ–హా–హా–హా.....హిహిహిహహ....

**సాంబ:** ఒంగిపోకూడదు.....ఇప్పుడు కొంచెం డాన్సు చూడా చెయ్యండి....(చేస్తాడు) డాన్సు, ఓండ్రపెట్టడం రెండూ ఒకేసారి చెయ్యాలి. (రాజు అట్లాగే చేస్తాడు)...ఆ...హా.....డింగ్‌డాంగ్ అట్లాగే ఆడేవాడు..ఏయ్! (మంత్రితో) నువ్వు పాడు.

**మంత్రి:** ఒంటరిగాణ్ణి డింగ్‌డాంగ్
చలికాలంలో డింగ్‌డాంగ్

తోడు కోసమే డింగ్‌డాంగ్

చూస్తున్నాను డింగ్‌డాంగ్

(పాడుతూ వుండగా రాజు డాన్సు చేస్తాడు) (రెండో పక్కనుంచి శివ వస్తాడు)

**శివ:** నాటకం మొదలయినట్టుగా వుంది. ఇంకా ఈ చాకలాయన రాలేదే?

**రాజు:** హీ–హో–హో–హో.....హీ–హో–హో–హో.....(ముందుకు వస్తాడు)

**శివ:** (డింగ్‌డాంగ్ కోసం వెతుకుతున్నట్లుగా చూసి) ఎవరది? మహారాజ రాజాధిరాజ డింగ్‌డాంగ్ ప్రభువులవారా? (రాజు మాట్లాడడు)

**శివ:** బహుశః కాకపోవచ్చు. లేకపోతే నన్ను చూసి ప్రేమతో అరవకపోయాడా?

**రాజు:** హీ–హో–హో–హో........హీ–హో–హో–హో....

**శివ:** నా డింగ్‌డాంగ్ అయితే నన్ను చూడగానే రెండు కాళ్ళు పైకెత్తి (అనగానే రాజు చేతులు రెండూ ఎత్తుతాడు)

డింగ్‌డాంగ్ దగ్గర వచ్చే ఆ సెంటు వాసన – ?

(ఒక చెయ్యి ఎత్తి చూపుతాడు)

ఇవ్వాళ డింగ్‌డాంగ్ ఆనందంతో డాన్స్ చెయ్యడం లేదేం?

(రాజు డాన్స్ చేస్తాడు)

**శివ:** ఇప్పుడు నిజంగా డింగ్‌డాంగ్ గారే! సందేహం లేదు....భవదీయ సేవక పరమాణువుని ప్రభూ! శివన్నని.

**రాజు:** హీ–హో–హో–హో....హీ–హో–హో–హో.......

**శివ:** ప్రభూ! మీకొక మాట మాత్రం చెప్పాలి....గుర్రాల శాలలో నుంచి తప్పించుకుని తెలియకుండా ఎక్కడికో వెళ్ళిపోవడం ఏం భావ్యంగా లేదు.

(తాను విచారిస్తున్నట్టు రాజు తల వాలుస్తాడు)

మీ కోసం నగరం అంతా గాలించాను. మీకు ఇష్టమని ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు తెచ్చాను. తినండి...ఊ! తినండి.

(రాజు భయంతో శివ వంక చూస్తాడు)

అదేమిటి? ప్రతి రోజూ ఓ కొత్త స్నేహితురాలు గడపడానికి మీకు బలం కావాలంటే ఇవి తినాలని డాక్టరుగారు చెప్పలేదూ? (రాజు తినడానికి సాహసించడు) ఇవ్వాళ ఎందుకు తినడం లేదు? లేకపోతే, మీరు డింగ్‌డాంగ్ కదా? (రాజు గబగబా తినడం మొదలు పెడతాడు...రొప్పుడూ, బాధపడుతూ) ఆ! ఇప్పుడు నిర్ధారణ అయింది. మీరు మా యజమానే! ఉల్లిపాయలు, పచ్చి మిరపకాయలు ఎట్లా వున్నాయి?

**రాజు:** హీ–హో–హో–హో.......

**శివ:** ఈ పాటికి మీ ప్రియురాలితో హాయిగా ఉండాల్సిందిగా ప్రభూ!

**రాజు:** (తలవూపుతూ) హీ–హో–హో–హో..........

**శివ:** ఇవాళ మా ప్రభువుల వారికింకా నిద్రరావడం లేదు. ఎందుకనో? నాకు తెలుసులెండి. ప్రభువుల రహస్యాలు భృత్యులకు తెలియవా? ప్రభూ! మీరేం భయపడకండి. మహారాణీ వారికి చెప్పనుగా! మీరు నగరంలోకి ఎందుకు వెళ్ళారో నాకు తెలియదనా? మీ ప్రియురాలు కోసమేగా? నీలం చీరె, పచ్చరవికె –

**రాజు:** (అవునన్నట్లు) హీ–హా–హా–హా.......

**శివ:** అంత అందంగా ఉంటుందా?

**రాజు:** (సిగ్గుతో) హీ–హా–హీ....హీ...

**శివ:** మీరు ఊళ్లోకి వెళ్లినప్పుడు ఆమె కూడా మిమ్మల్ని వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చింది....

**రాజు:** (సిగ్గుతో) హీ–హా.......హీ–హా.....హీ–హీ–హీ......

**శివ:** మీ కోరికలు తీర్చడమే కదా ఈ సేవకుడి కర్తవ్యం....అయితే ఇప్పుడు ప్రేయసీ అంటూ ఓండ్రపెట్టండి.

**రాజు:** హా–హా–....హా–హా......హా–హా......

**సాంబ:** ప్రభూ! మీరు శాశ్వతంగా కావేరితో ఉండి పోవాలంటే ఆ ఆంతరంగిక మంత్రికిచ్చిన ముత్యాన్ని తీసుకోండి.....మీరు ఏం కావాలంటే అట్లా మారగలరు దాన్నిమింగితే –

**రాజు:** మంత్రీ! ఆ ముత్యం మా లాంటి రాజులే ఉపయోగించాలి.....ఇవ్వు.

**మంత్రి:** స్వామీ! దీనితో –

**రాజు:** నోరుమూసుకో! (అని ముత్యాన్ని తీసుకుంటాడు)

**సాంబ:** స్వామీ! ఈ ముత్యాన్ని మరెవరికీ దక్కకుండా చెయ్యాలంటే మీరు అమాంతం దీన్ని మింగేసెయ్యాలి. లేకపోతే ఆంతరంగిక మంత్రి వంటి మోసగాళ్ళు మిమ్మల్ని కావేరి దగ్గరకు చేరనివ్వరు.

**రాజు:** అవును కదా! ఇదుగో! ఒక్కసారిగా మింగేస్తున్నా. (మింగగానే ఆడది అయినట్టుగా తెలుసుకుని. స్టేజీ పక్కకు పరిగెత్తుతాడు. నిజంగా ఆడదిగా మారిన రాజు స్టేజీమీదకు పరిగెత్తుకుంటూ వస్తాడు)

**రాజు:** అయ్యో! మోసం! దగా!....కుట్ర.....నేను ఆడదాన్ని అయిపోయాను...అన్యాయం...

**సాంబ:** ఏమిటి అన్యాయం....మమ్మల్ని చేతకాని వాళ్లను చేసి చెండుకు తింటావా? (కొడతాడు)

**శివ:** నువ్వు కళ్ళుమూసుకుని వెధవ పనులు చేస్తూ అంతఃపురంలో కూర్చుని మా మీదకి నీ అధికార్లని బంట్రోతుల్ని తరుముతావా? (కొడతాడు)

(ఇంతసేపు రాజుగారు పారిపోవడానికి విశ్వప్రయత్నం చేస్తాడు. ఎవ్వరూ పోనివ్వరు...అప్పటికే కట్టివేశారు. ప్రతి వాళ్ళూ ఒక దెబ్బ వేస్తూ వుంటారు...రాజుగారి బట్టలు చిరిగిపోతాయి. రాజుగారు పారిపోతారు. అందరూ వెంటాడి కొడతారు. మళ్ళీ పరుగు..పట్టుకోండి, పట్టుకోండి – అంటూ అరుపులు....రాజు స్టేజీ ఒక మూల నిలబడతాడు)

**రాజు:** నన్ను పోనివ్వండి....నేను మీ రాజును. "యథారాజా తథాప్రజ" అన్నారు. మీరు చేతకాని వాళ్ళయితే మీ రాజు గొప్పవాడు ఎలా అవుతాడు? ఈ రాజ్యమే ఒదిలి పోతాను....వెళ్ళినివ్వండి...ఎప్పటికీ తిరిగిరాను..నన్ను బతకనివ్వండి.......

(రాజు పారిపోతాడు)

**సాంబ:** అమ్మయ్య! దేశానికి పట్టిన ఈ అరిష్టం తొలిగిపోయింది.

**మంత్రి:** ఈ విజయం అందరిదీ. సాంబ-శివ ఇద్దరూ ఈ విజయానికి కారకులు. మనం వాళ్ళకి జయజయ ధ్వానాలు పలకాలి.

**శివ:** ఇప్పుడు రాజు ఎవరవుతారు? ఎవరయినా నాదో చిన్న విన్నపం.

**మంత్రి:** ఇక రాజుల యుగం అంతరించింది. మన పాలకుణ్ణి మనమే ఎన్నుకుందాం. మనమంతా ఇక్కడే ఉన్నాం కనుక  శివా నువ్వు అడిగేదేమిటో చెప్పు.

**శివ:** కావేరి గాడిదకు జరిగిన పెళ్ళి, పెళ్లికాదు....మేం ఇద్దరం పెళ్ళిచేసుకుందామనుకుంటున్నాం కనుక అందుకు అందరూ అంగీకరించండి.

**మంత్రి:** దానికి అభ్యంతరం ఏమిటి?

(వాళ్ళిద్దరి చేతులూ కలుపుతాడు. అంతటా ఆనందం. చప్పట్లు. వినాయకుడు వస్తాడు)

**వినా:** నీకోసం ప్రపంచం అంతా గాలిస్తున్నాను.

**శివ:** ఎందుకు గణేశా?

**వినా:** మీ నాన్న ఎక్కడ? (సాంబడు వచ్చి నమస్కార చేస్తాడు)

**సాంబ:** మీ పాదదర్శనం వల్ల నేను కృతార్ధుణ్ణి అయ్యాను దేవా!

**వినా:** అది సరే! ఆ ముత్యం ఏది?

**సాంబ:** ఏ ముత్యం స్వామీ?

**వినా:** ఏ ముత్యం అని అడుగుతున్నావా? మగవాళ్లని ఆడవాళ్ళగా మార్చే ముత్యం?

**సాంబ:** మళ్ళీ ఇచ్చెయ్యాలంటారా?

**వినా:** మరి? అది నాది కాదు. మా నాన్నగారిది. నేను దాన్ని తిరిగి ఇచ్చెయ్యకపోతే ఆయనేమన్నారో తెలుసా?

**సాంబ:** ఏమన్నారు స్వామీ?

**వినా:** అబ్బాయ్....ఆ ముత్యంతో నువ్వు ఏం చేస్తున్నావో నాకు తెలియదు. కాని నీకు ఇంత తక్కువ మంది భక్తులు ఉండడానికి అదే కారణం అయివుండాలి.....చూడండి! ఆయన నన్ను ఎంత తప్పుగా అర్థం చేసుకున్నారో!

**సాంబ:** అయితే తప్పకుండా ఇస్తాను స్వామీ!

**శివ:** స్వామీ! నీ దయ వల్ల మేమంతా హాయిగా ఉన్నాం...ఇప్పుడు మా రాజ్యం కూడా హాయిగా ఉంది. నేనూ హాయిగా వున్నాను.

**సాంబ:** (వినాయకుడికి నమస్కారం చేస్తూ) మీ ముత్యాన్ని గాడిదలాంటి రాజులను పారద్రోలడానికి ఉపయోగించాం?

**శివ:** నిత్యం నిన్నే భజిస్తాం.....ఆ ముత్యం ప్రజల ప్రయోజనం కోసం ఉపయోగపడ్డది. ఇహ దాని సంగతి మరిచిపోయి మమ్మల్ని ఆశీర్వదించు.

**అందరూ:** ఆశీర్వదించు స్వామీ!

**వినా:** స.....రే!

**సాంబ:** అయితే డింగ్‌డాంగ్ ఎక్కడ స్వామీ?

**వినా:** అది గుడి దగ్గరికి వచ్చింది. తిరిగి దానిని బొమ్మలోకి పంపివేశాను.

**శివ:** అమ్మయ్య......రండి అందరం కలిసి వినాయకస్వామిని ప్రార్థిద్దాం.....

(అందరూ వరుసగా నిలబడతారు – రాజు కూడా వస్తాడు – గాడిద వేషం లేదు ఆయనకు)

**శివ:** మీరు దేశం వదిలిపెట్టి వెళ్ళిపోతానన్నాను. మళ్ళీ ఎందుకు వచ్చారు?

**రాజు:** నాటకం అయిపోతే నేను కూడా నటుణ్ణే!

**అందరూ:** ఓం శ్రీ గణేశాయనమః (అంటూ గణేశ ప్రార్థన చేస్తూ వుంటారు)

**(తెర)**